Estd 1938
ఆంధ్రప్రభ
www prabhanews com
Journalism first!

సంపుటి:56 • సంచిక: 335 • శనివారం 17 మార్చి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: అమావాస్య సా.6.22 వరకు; నక్షత్రం: పూర్వాభాద్ర సా. 6.22 వరకు, అనంతరం ఉత్తరాభాద్ర; అమృతకాలం: ఉ. 11.10 నుండి 12.50 వరకు; వర్జ్యం: తె. 5.05 నుండి; దుర్ముహూర్తం: ఉ. 6.00 నుండి 7.36 వరకు; రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు;

సంపుటి:56 • సంచిక: 335 • శనివారం 17 మార్చి 2018 • హైదరాబాద్ ✻ పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



హస్తినలో రాజకీయ ప్రకంపనలు.. చంద్రబాబు తిరుగు బావుటా

మోడీజీ గుడ్‌బై మీపై అవిశ్వాసం...



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశం దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. అంతా ఊహించినట్టే తెలుగుదేశం ఎన్డీయేతో తెగదెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా హస్తిన వేడెక్కింది. ఇన్నాళ్లూ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఒక్కో అస్త్రాన్ని ప్రయోగిస్తూ వస్తున్న తెదేపా చివరి అస్త్రంగా చెబుతూ వస్తున్న అవిశ్వాసాన్నీ అంతేవేగంగా ప్రయోగించింది. ఎన్డీయేతో కటీఫ్ చెప్పిన వెంటనే అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడంతో దేశ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. పలు విపక్ష పార్టీలు తెదేపాకు బాసటగా నిలుస్తామని ముందుకు వచ్చాయి. ఒకపక్క పలు జాతీయ, ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టడంలో తెదేపా ఎంపీలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోపక్క అవిశ్వాసానికి మద్దతు తెలిపిన కాంగ్రెస్ కూడా మరింత మద్దతు కూడగట్టేందుకు పలు పార్టీలతో సంప్రదింపులు జరుపుతోంది. మేజిక్ ఫిగర్ 273కు మించి రెండు డజన్లకు పైగా ఎంపీల మద్దతు భాజపాకు ఉండడంతో ధీమాగా ఉంది. లోక్‌సభలో సోమవారం చర్చకు వస్తుందని భావిస్తుండగా, మాటల యుద్ధం తీవ్రంగా సాగుతోంది... ఇప్పటికే అవిశ్వాస తీర్మానం నోటీసిచ్చిన వైకాపా కూడా వివిధ పార్టీల మద్దతుకు ప్రయత్నిస్తోంది...

అమిత్ షాకు చంద్రబాబు లేఖ

అదే అవిశ్వాసం బాటలో వైకాపా • సోమవారం మళ్లీ రెండు పార్టీల నోటీసులు

- మీ పాలనలో నీతి లేదు
- చాలా పార్టీలు నా వైపే
- మీవల్లే 20 సీట్లు పోయాయి
- నన్ను బలహీనపరిచే కుట్రలు
- హోదా ఇచ్చేదాకా ఊరుకోను
- నాది ఆత్మగౌరవ పోరాటం
- పవన్ వల్ల నష్టమే జరిగింది
- ఏపీ మండలిలో చంద్రబాబు

ఇక ఢీ అంటే ఢీ!



మోడీ ప్రతిష్ఠకు భంగం..!

• వచ్చే ఎన్నికలపై క్రీనీడలు • మూడో ఫ్రంట్‌తో మరో సవాలు

• హాట్‌హాట్‌గా హస్తిన పాలిటిక్స్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: హస్తినలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తెలుగుదేశం పార్టీ ఎన్డీయే నుంచి వైదొలగడం.. అదే రోజు ఆపార్టీతో పాటు వైకాపా విడివిడిగా అవిశ్వాస తీర్మానాలకు నోటీసులు ఇవ్వడంతో కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెరిగినట్టయింది. నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తొలి టరమ్‌లోనే ఒకేసారి రెండు పార్టీల నుంచి.. అందులోనూ ఒక మిత్రపక్షం నుంచి అవిశ్వాసపు పరీక్షను ఎదుర్కోవాల్సి రావడం పట్ల బీజేపీలోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు ఎన్డీయే నుంచి వైదొలగినందుకు తమ పార్టీ కేడర్ చాలా సంతోషంగా ఉన్నారని కమలనాథులు వ్యాఖ్యానిస్తున్నారు. ఒకే ఒక్క మిత్రపక్షం కోసం జాతీయ స్థాయిలో తమ ప్రయోజనాలను ఫణంగా పెట్టలేమని వారు వాదిస్తున్నారు. అయితే ఇదంతా బీజేపీ మేకపోతు గాంభీర్యమేనని.. ప్రభుత్వం ఏర్పాటైన ➪ 5వ పేజీలో...

టీడీపీ పెద్ద తప్పు చేసింది



అవిశ్వాసం వీగటం ఖాయం: బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ 11

చర్చకు వచ్చేనా?

• అవిశ్వాసాలపై సందేహాలు • నిరసనలు లేకుంటేనే సాధ్యం

• సభ అదుపులో కొనసాగేనా? • బాబు, జగన్‌ల జోక్యం అనివార్యం!

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: తెలుగుదేశం, వైకాపా చెరొక అవిశ్వాస తీర్మానం పెట్టిన నేపథ్యంలో సోమవారం ఆ తీర్మానాల నోటీసుల భవిష్యత్తేమిటన్నది ఆసక్తికరంగా మారింది. శుక్రవారం అనుభవాల నేపథ్యంలో అసలా నోటీసులు సభలో చర్చకు వచ్చే అవకాశాలే ఉండవని అంటున్నారు. లోక్‌సభలో పరిస్థితి సజావుగా లేనందున సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ సుమిత్రా మహాజన్ శుక్రవారం ప్రకటించి వెళ్లిపోయారు. ఆ సమయంలో తెరాస సభ్యులు వెల్ వద్ద ఉండి తమ సమస్య మీద నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. స్పీకర్ మహాజన్ మాత్రం సభ సజావుగా లేదని ఆమె సభని వాయిదా వేశారు. సోమవారం కూడా ప్రతిపక్షాలు ఇదే రీతిలో ఆందోళన చేస్తే స్పీకర్ మళ్లీ ఇదే రీతిలో సభను వాయిదా వేసే అవకాశాలు ఉన్నాయని కొందరు సభ్యులు అభిప్రాయపడుతున్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళన పాలక ఎన్డీయేకు ➪ 5వ పేజీలో...



చదువులోనూ..

ఫస్ట్..!

తెలంగాణలో పెరిగిన అక్షరాస్యత శాతం

బాలికలే అధికం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో గత 10 సంవత్సరాల కాలంలో అక్షరాస్యత పెరుగుతోంది. ప్రాథమిక విద్యలో అక్షరాస్యత శాతం జాతీయ సగటు కంటే తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువగా ఉంది. కాలేజీస్థాయిలో కూడా జాతీయ సగటు కంటే రాష్ట్రంలో కొంత ఎక్కువగానే ➪ 5వ పేజీలో...

ఔరా..!



ఏప్రిల్ 15 నుంచి



గడప గడపకు చెక్కులు పాస్‌బుక్కులు

•సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ మేలుకొలుపు • సర్పంచ్ నుంచి మంత్రి వరకు భాగస్వామ్యం •వచ్చేనెలలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ • అధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ పరంగా ఇంటింటికీ సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తూ, రాజకీయంగా ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికీ దగ్గరయ్యేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు వ్యూహం సిద్ధం చేసుకున్నారు. ఒకే కార్యక్రమంతో రెండు కోణాల్లో లబ్ధి పొందేందుకు, తద్వారా ప్రజాభిమానం చూరగొనేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. తాజాగా అసెంబ్లీలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు వేడెక్కినప్పటికీ, క్షేత్రస్థాయి నుంచి కార్యాచరణను ప్రారంభించి రాజకీయ వ్యూహంలో తనదే పైచేయిగా నిరూపించుకోబోతున్నారు. అందుకు ఏప్రిల్ 15న ప్రారంభ ముహూర్తం ఖరారు చేశారు. సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్నందున కేసీఆర్ తన మేధోశక్తికి పదును పెడుతున్నారు. భూయాజమాన్య హక్కులను దృఢపరుస్తూ రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ, అదే సమయంలో దేశాన్నే ఆకట్టుకునే విధంగా పంట పెట్టుబడి మద్ధతు పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంతో గడపగడపకూ అధికార యంత్రాంగాన్ని పంపిస్తున్నారు. ఏకకాలంలో రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను మొదలుపెట్టి గ్రామస్థాయిలో దాదాపు నెల రోజులపాటు సంచలనం సృష్టించనున్నారు. మెజారిటీ వర్గాలు ప్రభుత్వానికి జేజేలు పలికే విధంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నారు. సమర్ధవంతంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు పేరుతో ప్రతి కుటుంబాన్నీ మేలుకొలిపే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో గ్రామ సర్పంచ్ మొదలుకుని రాష్ట్ర మంత్రి వరకు అన్ని స్థాయిల్లో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, మున్సిపల్ ఛైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీల ఛైర్మన్లు, రాష్ట్రస్థాయిలో వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లకు వచ్చేనెల మొదటివారంలో ప్రభుత్వం ప్రత్యేకంగా లేఖలు రాయనుంది. అలాగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించి బాధ్యతలు అప్పగించనున్నారు. ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించి గ్రామస్థాయి వరకూ అధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేయనున్నారు. జిల్లాల వారీగా పార్టీ సమన్వయ సమీక్షలు నిర్వహించి కేడర్‌ను బలోపేతం చేయనున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ ఆన్‌లైన్ చేయడం ద్వారా ➪ 5వ పేజీలో...



లోక్‌సభలో టీఆర్ఎస్ ఎంపీల నిరసన

వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు...

ప్లకార్డుల ప్రదర్శన

పార్లమెంట్ వెలుపలా కొనసాగిన ఆందోళన

రిజర్వేషన్ల హక్కు రాష్ట్రాలదే

11 లో

నా వెనకెవ్వరూ లేరు...



గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో డయేరియా బాధితులకి పవన్ కళ్యాణ్ పరామర్శ

వివరాలు 9లో...

ప్రజలే.. నాకు డైరెక్షన్

- నేను ప్రజల పార్ట్‌నర్‌ని..
- విభజన హామీలు తుంగలో తొక్కారు
- రాజ్యాంగ ఉల్లంఘన చేశారు
- పరీక్షల తరువాత ఉద్యమ కార్యాచరణ
- గ్రామ గ్రామాన ఉద్యమం
- గుంటూరు ఆసుపత్రిలో డయేరియా బాధితులకు పవన్ పరామర్శ

ఏ కష్టమొచ్చిందో..

పిల్లలకి విషమిచ్చి..

దంపతుల ఆత్మహత్య

సికింద్రాబాద్ మహంకాళి పీఎస్ పరిధిలో ఘటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పిల్లలతో సహా దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కండోజి బజార్‌లో ఈ ➪ 5వ పేజీలో...



సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శనివారం 17 మార్చి 2018

రివాజుగా నీటి కొరత..

వేసవి వచ్చిందంటే మంచినీటికి కటకట సర్వసాధారణం. గ్రామాలు, పట్టణాలు, నగరాలనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ప్రజలు నానా అగచాట్లు పడటం కూడా రివాజుగా మారింది. నీటి కొరత, కాలుష్యం కవలల్లా మారాయి. పట్టణాలు, నగరాల్లో నీటిని డబ్బాల్లో సరఫరా చేసేసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకు రావడం వల్ల ఎంత ఖర్చయినా మంచినీటిని ఇబ్బంది లేకుండా వినియోగదారులు పొందగలుగుతున్నారు. గ్రామాల్లో అటువంటి సంస్థల అక్కడక్కడ ఉన్నా, సరఫరా చాలినంతగా ఉండకపోవడం వల్ల మంచినీటిని మహాభాగ్యంగా వాడుకునే పరిస్థితులు తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్నాయి. జల సంరక్షణ గురించి ఎంత ప్రచారం జరిగినా, సురక్షితమైన నీటిని జనం పొందలేకపోవడం పథకాల్లో లోపమా,వాటి అమలులో లోపమా ఆత్మపరిశీలన చేసుకోవల్సిన తరుణం ఆసన్నమైంది. కృష్ణా నదికి అతి సమీపంలో గుంటూరు సర్వజన ఆస్పత్రిలో అతిసార వ్యాధి వల్ల 90 మంది చికిత్స పొందుతుండటం, పలువురు మరణించడం ఆందోళన కలిగించే విషయమే. మంచినీటి కొరతతో పాటు నీటి కాలుష్యం వ్యాపించడం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీటి కాలుష్యం. అతిసార వ్యాధులు గతంలో ఎక్కువ నమోదయ్యేవి. ఇప్పుడు నవ్యాంధ్ర రాజధాని అమరావతికి సమీపంలోని గుంటూరులో వేసవి ప్రారంభంలో నే దాదాపు వందమందికి అతిసార సోకింది. రాష్ట్రరాజధాని సమీపంలోని నగరంలోనే కాలుష్యం కోరలు చాస్తే, మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందో మరి. అయితే, గుంటూరులో పాత ట్యాంకర్ లోని కలుషిత నీటిని తాగడం వల్లనే అతి సార వ్యాపించిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.ఇందుకు బాధ్యులపై చర్యలుతీసుకుంటున్నట్టు, మంచినీటి ట్యాంకర్ల ద్వారా బాధిత ప్రాంతాలకు సురక్షిత నీటిని సరఫరా చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఎండలు ముదిరితే నీటి కొరత,కాలుష్యం పెరిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలి ఉత్తరాంధ్రలో ముఖ్యంగా, గిరిజన గ్రామాల్లో విష జ్వరాలు, అతి సార సోకడం వైద్య సహాయం అందక పలువురు ప్రాణాలు కోల్పోవడం గత చరిత్ర. ఇప్పుడు రాష్ట్రంలో మంచినీటి కొరత ఏర్పడకుండా, కాలుష్యం వ్యాపించకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, అవి చాలవని గుంటూరు సంఘటన రుజువు చేస్తోంది. గుంటూరు సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులను జనసేన అధినేత పవన్ కల్యాణ్ పరామర్శించి బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇతర రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించవచ్చు, హామీలుఇవ్వవచ్చు.ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని స్పష్టమవుతోంది.

తెలుగు రాష్ట్రాల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్టమైన ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. కృష్ణ గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలైన తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నీటి కొరత వెంటాడటం దురదృష్టకరం. ఈ రెండు నదులపై ఎగువ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ఆనకట్టలు కట్టడం వల్ల నీటి లభ్యత నానాటికీ తగ్గిపోతోంది. ఉదాహరణకు కృష్ణానది పై ఉన్న నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులనుంచి 62 శతకోటి ఘనపుటడుగుల నీరు మాత్రమే విడుదలవుతోందని అధికారులు చెబుతున్నారు. సాగునీటికీ, తాగునీటికీ కటకట ఏర్పడటం అనివార్యమంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం తాగునీటి కొరతను తీర్చేందుకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసినప్పటికీ, పై నుంచి రావల్సిన రీతిలో నీరు విడుదల కాకపోవడం వల్ల ఆగస్టు వరకూ నీటి పరిస్థితి గడ్డుగానే ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ మంచినీటి అవసరాలు కాకుండా తెలంగాణాకు అదనంగా 9 శతకోటి ఘనపుటడుగుల నీరు అవసరమని అంచనా వేశారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆయకట్టుకు 15 టిఎంసీల నీటిని ఇవ్వాల్సు ంది.గత నెల కృష్ణా వాటర్ బోర్డు రెండురాష్ట్రా లకూ 34.990,17.09 టిఎంసీల ఇండెంట్లను ఆమోదించింది. ఈ రెండు రాష్ట్రాల్లో కృష్ణా నదిలో నీటి లభ్యత కన్నా ఎక్కువ పరిమాణంలో నీటి వనరుల అవసరం ఉంటుందని అంచనా వేశారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోనూ వేసవిలో నీటి కొరత పరిపాటే. మెట్ట ప్రాంతాల్లో తాగునీటికి తీవ్రమైన ఎద్దడి ఏర్పడటం వల్లే కుంటలు, చెలమల్లోని నీటినీ, లోతుబావుల్లోని నీటిని చేదుకుని ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు.

నీటి కొరత నివారణకు ముందస్తు కార్యక్రమాలుగా తెలంగాణలో హరితవనం పేరిట ,ఆంధ్రలో నీరు-చెట్టు పేరిట మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రవేశపెట్టినా ఆ పథకాలన్నీ ఆరంభ శూరత్వాలవుతున్నాయి. నాటిన మొక్కలు పెరుగుతున్నాయో లేదో పర్యవేక్షణ లేకపోవడం వల్ల కూడా ఇది మొక్కుబడి కార్యక్రమంగా తయారైంది. జల సంరక్షణ కార్యక్రమం ద్వారానే గాంధేయ వాది అన్నా హజారే జాతీయ స్థాయిని ఆకర్షించారు. రాజేంద్రసింగ్, ఖమ్మం జిల్లాకు చెందిన వనజీవి రామయ్య వంటి వారు స్ఫూర్తిదాయకమైన కృషి సాగిస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలనీ, కాచిన నీటినే తాగాలన్న ఆరోగ్య సూత్రాలు ఎన్నిసార్లు ఎందరి నోటంట విన్నా మనిషి జీవితంలో వేగం పెరగడం వల్ల ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే నీటి కాలుష్యం పెరిగిపోతోంది.

ఫలించిన అఖిలేష్ వ్యూహం..



'శంక'రాజీయం

-శంకర్ రాజ్, సీనియర్ పాత్రికేయులు

వేసవికి ముందే బీజేపీకి రెండు ఎండ దెబ్బలు తగిలాయి. ఒకటి ఉత్తరప్రదేశ్‌లో, రెండోది ఆంధ్రప్రదేశ్‌లో. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందు అనుకున్నట్టే బీజేపీ కూటమి (ఎన్‌డిఏ) నుంచి తమ పార్టీ (తెలుగుదేశం) వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేకహోదా ఇవ్వనందుకు నిరసనగా ఎన్‌డిఏతో ఆయన తెగతెంపులు చేసుకున్నారు. ఆయనకు ఎన్‌డిఏ మీద కోపం కన్నా, తన ఓటు బ్యాంకును కాపాడుకోవడం ముఖ్యం. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖాళీ చేసిన గోరఖ్ పూర్ లోక్‌సభస్థానాన్ని బీజేపీ కోల్పోవడం కోలుకోలేని దెబ్బ. బీజేపీ అధీనంలో 27 సంవత్సరాలుగా ఉన్న ఆ నియోజకవర్గం ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ చేతిలోకి వెళ్ళింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్ పూర్, పూల్పూర్ లోక్‌సభ స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ ఇటీవలి ఉప ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెల్చుకుంది.

పొరుగునున్న బీహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అరారియా లోక్‌సభ స్థానాన్ని, మరో అసెంబ్లీ సీటును ఉప ఎన్నికల్లో గెల్చుకోవడం వచ్చే (2019) ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఒక మంచిఅవకాశం. లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని బీఎస్‌పీ అధ్యక్షురాలు మాయావతి డిమాండ్ చేయడంలో ఆశ్చర్యం లేదు. 2014లో బీజేపీ విజయాలు ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల నుంచే వచ్చాయి. ఢిల్లీ పీఠం ఎవరికి చెందుతుందో ఈ నాలుగు రాష్ట్రాలు నిర్ణయిస్తాయి. ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ, బీఎస్పీల మధ్య కుదిరిన పొత్తు లేదా అవగాహన బీహార్‌కి వర్తింప జేసేందుకు ఒక ఫార్ములాను రూపొందించాల్సి ఉంది.

హిందీ రాష్ట్రాల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్‌ని దూరంగా ఉంచి లౌకికవాద పార్టీలు జతకట్టే యత్నాలు ఈ ఉప ఎన్నికల ఫలితాల ఊపుతో ప్రారంభం కావచ్చు. కాంగ్రెస్‌ని ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రజలు తిరస్కరించారు. కాంగ్రెస్‌తో జత కట్టే పార్టీలు ఘోరంగా ఓటమి పాలవడం ఖాయం. కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ ఘోరంగా నష్టపోయారు. ఈ ఉపఎన్నికల్లో అఖిలేష్ కాంగ్రెస్‌ని దూరంగా ఉంచారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో సమాజ్‌వాదీ, బీఎస్పీ కాంగ్రెస్‌ని దూరంగా ఉంచలేవు. ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అంతఃకలహాలను అరికట్ట గలిగితే, ఆ పార్టీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో విజయాలు సాధించవచ్చు.

మోడీని ఎదుర్కోవడానికి యువ నాయకత్వం సిద్ధమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్ యాదవ్, బీహార్‌లో తేజస్వి యాదవ్, రాజస్థాన్‌లో సచిన్ పైలట్, మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా మోడీని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నారు. వీరు కాకుండా, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్, శివసేన, వామపక్షాలు వంటి పార్టీలు ఉండనే ఉన్నాయి. పాత నాయకత్వాన్ని పక్కన పెట్టి యువతరం ముందుకు వస్తోంది.



ఈ కూడికలన్నీ ఇప్పుడు బాగానే ఉండవచ్చు. ప్రధానమంత్రి అభ్యర్థిత్వం వచ్చే సరికి పొత్తులు కుదరకపోవచ్చు. ఢిల్లీలో ప్రస్తుతం ఓ రాజీ సూత్రం ప్రచారంలో ఉంది. అదేమంటే, ఉత్తరప్రదేశ్, బీహార్ బెల్ట్ నుంచి మాయావతిని ప్రధానమంత్రి పదవికి ప్రతిపాదించి, రాజస్థాన్, మధ్యప్రదేశ్ నుంచి బలమైన కాంగ్రెస్ అభ్యర్థిని ఉప ప్రధానిగా ఎంపిక చేయడం ద్వారా కాంగ్రెస్‌ని సంతృప్తి పర్చడం. కాంగ్రెస్ అధ్యక్షునిగా రాహుల్ గాంధీ కొనసాగుతూ, హిందీ రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాల రెండు ఐక్య సంఘటనల కన్వీనర్‌గా విస్తృతమైన అధికారాలను కలిగి ఉండటం ఈ ప్రతిపాదనలోని ముఖ్యాంశం.

హిందీ రాష్ట్రాల ఐక్య సంఘటనలో మమతా బెనర్జీ, చంద్రబాబు నాయుడు, కె.చంద్ర శేఖరరావు (బెంగాల్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు), తమిళనాడులో ద్రవిడ పార్టీలు, ఇతర స్థానిక నాయకులు ఎక్కువ ప్రాధాన్యం కలిగుంటారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థుల విజయం కేవలం బీఎస్పీతో పొత్తు వల్లే సాధ్యంకాలేదు. ఈ ఉప ఎన్నికలకు పదిహేను రోజుల ముందు అఖిలేష్ తీసుకున్న ప్రధాన నిర్ణయాలే ఇందుకు కారణం.

మొదటిది కాంగ్రెస్‌ని దూరంగా ఉంచడం. ఇది సమాజ్‌వాదీ కార్యకర్తల ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. రెండోది...ఎనిమిది ఇతర పార్టీలతో కలిసి ఐక్య సంఘటనను ఏర్పాటు చేయడం. వీటిల్లో రాష్ట్ర స్థాయికి మాత్రమే పరిమితమైన పార్టీలు కూడా ఉన్నాయి. కులాల వారీగా బలమున్న పార్టీలు, వర్గాలు ఉన్నాయి. గోరఖ్‌పూర్, పూల్పూర్ ప్రాంతాల్లో ఈ కులాలు, వర్గాలకు మంచి బలం ఉంది. మూడోది...అభ్యర్థుల ఎంపిక.. నిర్బల్ ఇండియన్ సశోత్ హమారా ఆమ్ దళ్ (నిషాద్). పీస్ పార్టీ వంటి స్థానిక పార్టీలతో అఖిలేష్ జతకట్టారు. గోరఖ్‌పూర్ స్థానానికి ప్రవీణ్‌నిషాద్‌ని నిలబెట్టారు. ప్రవీణ్ నిషాద్‌పార్టీ అధ్యక్షుడు సంజయ్ నిషాద్ కుమారుడు. ఈ నియోజకవర్గంలో నిషాద్ సామాజికవర్గం ఒబీసీల్లో అతిపెద్ద వర్గం. ఈ సామాజిక వర్గానికి చెందినవారు ఈ నియోజకవర్గంలో 3.5 లక్షల మందున్నారు. ప్రవీణ్ నిషాద్‌కి బీఎస్‌పీ ఎటువంటి అరమరికలు లేకుండా మద్దతు ఇవ్వడంవల్ల విజయం సునాయాసమైంది. పూల్పూర్ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా నాగేంద్ర ప్రతాప్ సింగ్ పటేల్‌ని అఖిలేష్ ఎంపిక చేశారు. ఈ నియోజవర్గంలో పటేల్ సామాజికవర్గం బలం ఎక్కువగా ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు వివాద రహితులు కావడం వల్ల వారికి మద్దతు ఇచ్చేందుకు బీఎస్పీకి ఎటువంటి ఇబ్బందులు లేకపోవడం కూడా ఒక అనుకూల అంశం. అఖిలేష్ నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), సిపిఎం తోనూ,బీకేపీ (మాలే), ఫార్వార్డ్ బ్లాక్, ఆర్ ఎల్‌డి, ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ వంటి వామపక్ష వర్గాలతోనూ అవగాహన కుదుర్చుకున్నారు. ఈ పార్టీలన్నీ సమాజ్‌వాదీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించాయి. అఖిలేష్ వ్యూహాత్మకంగా వ్యవహరించడం వల్ల బీజేపీ ఓటమి పాలైంది. బీజేపీ పతనానికి ఇది ఆరంభమని చాలామంది జోస్యం చెబుతున్నారు. అప్పుడే అటువంటి అంచనాలకు రావడం పొరపాటు. ఉప ఎన్నికల ఫలితాలను బట్టి ముందస్తు అంచనాలకు రాలేం ఎందుకంటే....ఉప ఎన్నికల్లో పోలింగ్ శాతం బాగా తక్కువ. గోరఖ్ పూర్‌లో 48.5 శాతం పూల్పూర్‌లో 37.4 శాతం పోలింగ్ నమోదు అయింది. 1964 నుంచి పరిశీలించినట్టయితే, ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికల్లో ఏనాడూ 41 శాతం మించలేదు. ఇవే స్థానాలకు సాధారణ ఎన్నికల్లో అయితే 51 శాతం నమోదు అవుతూ ఉండేది. ఇది సమాజ్‌వాదీ, బీఎస్పీ కూటమికి అనుకూలంగా పరిణమించింది. ఈ ఉప ఎన్నికల్లో మధ్యతరగతి ఓటర్లు ఎందుకు దూరంగా ఉన్నారో బీజేపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి.


రెండోది లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగినప్పుడు ఖాళీ చేసిన అభ్యర్థులతో కొత్త అభ్యర్థుల నేపథ్యాన్నీ, స్థాయినీ ఓటర్లు పరిగణనలోకి తీసుకోవడం సహజం. ఉత్తరప్రదేశ్‌లోనే అమేథీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన సంజయ్ గాంధీ అకాల మరణం వల్ల జరిగిన ఉప ఎన్నికలో ఆయన అన్నగారు, మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ పోటీ చేసి గెలిచారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్ మరణం వల్ల ఖాళీ అయిన బలియా నియోజవర్గంలో ఆయన కుమారుడు నీరజ్ శేఖర్ పోటీ చేసి ఆ సీటును నిలబెట్టుకున్నారు.

ఇక మూడో అంశం...లోక్‌సభ ఉప ఎన్నికల ఫలితాలను బట్టి భవిష్యత్ ఎన్నికల ఫలితాలను అంచనా వేయలేం. ఉత్తరప్రదేశ్‌లో 1962 నుంచి 2014 వరకూ మొత్తం 35 ఉప ఎన్నికలు జరుగగా, 11 ఫలితాలు మాత్రమే ఆ నియోజకవర్గాల్లో సాధారణ ఎన్నికల ఫలితాలను పోలి ఉన్నాయి. అధికారంలో ఉన్న పార్టీలకు అనుకూలమైన ఫలితాలు వచ్చినవే ఎక్కువ.

నాల్గవ అంశం ...ఈ ఉప ఎన్నికల ఫలితాలను బట్టి 2019లో సమాజ్ వాదీ, బీఎస్పీల విజయాన్ని అంచనా వేయగలమా? ఆ రెండు పార్టీల మధ్య పొత్తు బలమైనదే సందేహం లేదు. ఈ రెండు పార్టీల నేపథ్యాన్ని పరిశీలించినట్టయితే సందేహాలు కలగవచ్చు. అఖిలేష్ తన తండ్రి వైఖరికి భిన్నంగా మాయావతితో పొత్తు కుదుర్చుకున్నారు. ఈ రెండు పార్టీలూ జాతవ్ దళితులు, యాదవ్‌లపై ఆధారపడినవే, ముస్లిం ఓటర్లు ఈ రెండింటిలో ఏదో ఒక పార్టీని సమర్థిస్తూ వస్తున్నారు. అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో బలమైన వర్గాలకు చెందిన వారు కావడం. ఈ రెండు పార్టీల మధ్య సీట్ల పంపిణీ విషయంలో సర్దుబాట్లు కుదరకపోవచ్చు. వీరిలో చాలామంది మూడో ప్రత్యామ్నాయ అభ్యర్థిగా రంగంలో ప్రవేశించవచ్చు. లేదా బీజేపీ టికెట్ల కోసం ప్రయత్నించి పొందవచ్చు.లేదా బీజేపీయే ఓట్లను చీల్చేందుకు వారిని ఉసికొల్పవచ్చు. చివరిగా....ఏదైనా ఒక ఐక్య సంఘటన రూపుదిద్దుకుంటే అది చివరి వరకూ నిలబడుతుందా? ఒక వేళ బీజేపీని ఓడించేందుకు పట్టుదలతో అవి కలిసి ఉన్నా, సమష్టిగా పాలన చేయగలవా? 2014లో బీజేపీ తరఫున బలమైన ప్రధానమంత్రి అభ్యర్థి బరిలో ఉన్నారు.2019లో కూడా ఆయన నాయకత్వంలోనే బీజేపీ ఎన్నికలకు వెళ్ళనుంది.బీజేపీ కొత్త వ్యూహాలతో బరిలోకి దిగవచ్చు. కొత్త మిత్రులను చేరదీయవచ్చు.లేదా ఇప్పుడు ఏర్పడిన ఐక్య సంఘటనను కకావికలు చేయవచ్చు.

చమురు ధరలు-గెలుపోటములు!

ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయం రెండు కీలకమైన సందేశాలను అందించింది. ఒకటి అందరికీ తెలిసిందే. రెండోదేమంటే, ఎవరూ పట్టించుకోనిది. బీజేపీ విజయానికి వ్యవస్థాగతమైన జాగ్రత్తలు, నైపుణ్యం ప్రధాన కారణం. ముఖ్యంగా త్రిపురలో పాగావేయడం కోసం ఆ పార్టీ చాలా కాలంగా ప్రయత్నాలు సాగిస్తోంది. అవన్నీ ఫలించాయి. బూత్ స్థాయి నుంచి పార్టీ పటిష్టత కోసం చర్యలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పట్టుదలకు తోడు, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వ్యూహ రచనా నైపుణ్యం ఫలించడం వల్లనే త్రిపురలో పాతికేళ్ళుగా అధికారంలో ఉన్న మార్క్సిస్టు ప్రభుత్వాన్ని పెకలించడం సాధ్యమైంది. ఇవన్నీ రాజకీయంగా కనిపించే కారణాలు. ఆర్థికపరంగా పరిశీలిస్తే గతసంవత్సరం పెద్ద నోట్లరద్దు వల్ల ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు కుంటుబడినా, క్రమంగా పుంజుకున్నాయి. తమ జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తుందన్న నమ్మకాన్ని బీజేపీపై త్రిపుర ఓటర్లు ఉంచారు. ఒకసారి అవకాశమిచ్చి చూద్దామని నిర్ణయించుకున్నారు. త్రిపురలో పాతికేళ్ళ మార్క్సిస్టు పార్టీ పాలనలో ఎటువంటి ఎదుగుదల కనిపించకపోవడం తో ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానంటున్న బీజేపీకి అవకాశమిస్తే ఎలా ఉంటుందని త్రిపుర ఓటర్లు అనుకుని ఉండవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోడీపై జనం నమ్మకం ఇంకా సడలలేదు. ఆయనకు ప్రత్యామ్నాయం ఎవరూ కనిపించడం లేదు. దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగానే తమ రాష్ట్రమూ అభివృద్ధి చెందాలన్న ఆకాంక్ష త్రిపుర ఓటర్లలో బలంగా ఉండటం వల్ల వారు మార్పువైపు మొగ్గు చూపారు. నిజానికి త్రిపుర ఓటర్లు ఈ సారి మార్పును కోరుతున్నారన్న సంకేతాలు ముందే వచ్చాయి. అధికారంలో ఉన్న పార్టీ హయాంలో ఆర్థికాభివృద్ధి వేగవంతంగా ఉంటే ఆ పార్టీ తిరిగి ఎన్నికయ్యేందుకు 60 శాతం అవకాశాలుంటాయి. పూర్వపు ప్రభుత్వ హయాంలో అభివృద్ధికీ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికీ మధ్య వ్యత్యాసాన్ని జనం బేరీజు వేస్తారు. త్రిపురలో అలావేయడానికి లేదు. పాతికేళ్ళుగా ఒకే పార్టీ అధికారంలో కొనసాగుతోంది. అందువల్ల ప్రత్యామ్నాయం వైపు అక్కడి ప్రజలు మొగ్గు చూపారు. విజయాలకు ఇంకా చాలా అంశాలు దోహదంచేస్తాయి. డబ్బు ఖర్చు చేయడం, ప్రచార సరళి, పార్టీ వ్యవస్థాగత నిర్మాణం, పొత్తులు వంటి అంశాలు కూడా పరిగణనలోకి తీసుకోవాల్సుంటుంది. జాతీయ,అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల ప్రభావం కూడా పరిగణనలోకి వస్తుంది.



త్రిపుర విషయం తీసుకుంటే, పాతికేళ్ళుగా అధికారంలో ఉన్న మార్క్సిస్టు ఫ్రంట్ ప్రభుత్వం ప్రజల స్థితిగతుల్లో మార్పు తీసుకుని రాలేకపోయింది. ఆర్థిక పరిస్థితులే ఏ రాష్ట్రంలోనైనా ఓటర్లను ప్రభావితం చేస్తాయి. యూపీఏ తొలివిడత ప్రభుత్వ హయాంలో కుంభకోణాలు ఏవీ లేవు కనుక, ఆ కూటమికి ప్రజలు రెండోసారి అధికారమిచ్చారు. యూపీఏ రెండో విడత పాలనలో వెలుగు చూసిన కుంభకోణాలు ఆ కూటమి కొంపముంచాయి. వృద్ధి రేటులో కూడా ఆశించిన లక్ష్యాలను చేరుకోకపోవడం మరో కారణం. ఇప్పుడు మోడీ ప్రభుత్వ నాలుగేళ్ళ పాలనలో వృద్ధి రేటు చెప్పుకోదగినంత లేకపోయినా, అధ్వానంగా లేదు. సాధారణంగా ఏ పార్టీ లేదా కూటమి పాలనపైనైనా చమురు, నీరు ప్రభావం చూపుతాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు అనుకూలంగా ఉంటే అధికారంలో ఉన్న ప్రభుత్వంపై వ్యతిరేక ప్రభావం పడదు. వర్షాలు సమృద్ధిగా పడితే సానుకూల ప్రభావం ఉంటుంది. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముడి చమురు ధర బ్యారల్ 30 డాలర్ల నుంచి 60 డాలర్లకు పెరిగింది. ప్రస్తుత ధరలు పెద్దగా చేటు తెచ్చేవికావు. ఇవి ఇలా కొనసాగితేనే ప్రభుత్వంపై వ్యతిరేక ప్రభావం పడదు. ఒకవేళ బ్యారల్ ధర 75 డాలర్లకు పెరిగితే పరిస్థితి ఆందోళనకరమే.

ఇటీవలి అసెంబ్లీ ఫలితాలతో ఈశాన్య రాష్ట్రాలు జాతీయ జీవన స్రవంతిలో చేరాయన్న విశ్లేషణలు అర్ధసత్యాలే. ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ చాలా కాలం అధికారంలో ఉంది. అది జాతీయ పార్టీయే కదా, అందువల్ల బీజేపీ నెగ్గినంత మాత్రాన ఈశాన్యం జాతీయ జీవన స్రవంతిలో కలిసిందనడం నిజంకాదు. త్రిపురలో పాతికేళ్ళ పాటు అధికారంలో ఉన్న మార్క్సిస్టు పార్టీ కూడా జాతీయ పార్టీయే. ఆనాడు కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీల సహకారాన్ని తీసుకుని అధికారంలోకి వచ్చినట్టే, ఇప్పుడు బీజేపీ కూడా ప్రాంతీయ పార్టీల సహకారంతోనే అధికారంలోకి రాగలిగింది. కాంగ్రెస్‌లో అసమ్మతి వర్గీయులను తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా బీజేపీ అక్కడ స్థానాన్ని సంపాదించుకోగలిగింది. ఉదాహరణకు త్రిపురలో బీజేపీ విజయానికి కృషి చేసిన నాయకత్రయంలో ఒకరైన హేమంత్ బిశ్వాస్ శర్మ రెండేళ్ళ క్రితంవరకూ కాంగ్రెస్ నాయకుడే. నాగాలాండ్, మేఘాలయలో మాజీ కాంగ్రెస్‌వాదులకు తమ పార్టీ తీర్థం ఇచ్చిన బీజేపీ ఆ రాష్ట్రాలన్నీ తమ ఖాతాలోకి వచ్చినట్టుగా చెప్పుకుంటోంది. ఈ ఫిరాయింపుదారులంతా కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే అటువైపు ఫిరాయిస్తుంటారు. అందువల్ల ఈశాన్యంలో బీజేపీ సాధించిన విజయాలను బలుపని అనుకోలేం. అది ముమ్మాటికీ వాపు మాత్రమే. ఆర్థిక పరమైన పరిస్థితిని చక్కదిద్దేందుకు కేంద్రం తీసుకునే చర్యలను బట్టే అధికార పార్టీకి తిరిగి అధికార యోగం పడుతుంది. ఇది నిరూపితమైన సత్యం. బీజేపీకి ఇప్పుడు అన్ని విధాల కలిసి వచ్చింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలలోగా వర్షాలు సకాలంలో పడటం, ముడి చమురుధర పెరగకుంటే 2019లో మోడీకి ఢోకా ఉండదు. వాతావరణ పరిస్థితులు, చమురు ధరలు అనుకూలంగా లేకపోతే సమస్యలు తప్పవు.

-ఎ.పి.స్వామి

ఉగాదమ్మ రావమ్మా...



శ్రీ శుభకరమై తెలుగిళ్ళ సిరులవిచ్చి
చైత్రమాసపు అందాల సారె తెచ్చి
పసిడి బతుకుల పండగై భాగ్యమిచ్చి
తెలుగుల విళంబి రావమ్మ వెలుగులిచ్చి

చితికిన బతుకులందున చిగురులిచ్చి
శిశిరాల్చిన కొమ్మల చివురులిచ్చి
మనుషులందరికీ మమత మంచినిచ్చి
ద్రావిడాడపడుచువమ్మ నీవు రమ్ము

మహివిళంబియ నసుభిక్ష మనెడిరీతి
సకల జగతికి శాంతిని సతమునిచ్చి
పదము హిందు ధర్మములతో పరవశించ
భరత భూమికి రావమ్మ ప్రగతితోడ

మాయమోహపు స్వార్థాలు మనిషి మరిగి
నాది నాదని అహమును ప్రోదిచేసి
డబ్బు జబ్బుతో మనుషులు గబ్బుగొట్టి
మనిషియన్న వాడిక నేడు మాయమయ్యె

ఆరు రుచులతో మనిషికి ఆశపోక
స్వార్థమనెడి రుచిమరిగి చాలు అనక
తానిచట శాశ్వత మనుచు తలచుచుండి
చేయుచున్నాడుగ అధర్మ చేష్టలెన్నో

సత్వగుణము మనుషులకు సతమునిచ్చి
మా రజోతమోగుణములు మాడ్చివేసి
నీ వసంతరాగాలతో నీతివెలుగ
సతము సుఖశాంతులిచ్చెడి మతము నేర్పు

తల్లిదండ్రులు ప్రజలును దైవమనుచు
దేశ హితమె మన హితము తీరు జెప్పి
మనిషి మనిషిగా మారెడి మనసునిచ్చి
వర ఉగాదమ్మ రావమ్మ వరములీయ

-రాఘవ మాస్టారు, బెంగళూరు
09743776920

అద్గదీ స్వర్గం అంటే!



సుత్తి మెత్తంగా

కర్లపాలెం హనుమంతరావు
8142283676

''స్వర్గం అంటే? ఏంటి బాబాయ్?''

'స్వర్గం అంటే కల్ప వృక్షాలుంటాయి. రంభా ఊర్వసులుంటారు' అన్నాడురా వెనకటికి ఎవరో నీ లాంటి నిత్య సందేహి అడిగినప్పుడు మన మునిమాణిక్యం ''.

''ఇప్పుడు నువ్వేమనుకుంటున్నావో.. అది చెప్పరాదా బాబాయ్?''

''ఆరగా ఆరగా తాగేందుకు మన ఆఫీసు క్యాంటీన్లలో మాదిరి అమృత భాండాల నిండుగా దొరుకుతుంటుంది అనుకుంటున్నావ్రా! సర్కారు ఉద్యోగమల్లే సరదాగా కూడా ఉంటుందేమో కూడా! పనీపాటాతో వళ్ళు విరుచుకోవాల్సిన పనే ఉండదనుకుంటా. వేళా పాళా లేకుండా.. ఎప్పుడైనా ఎంత సేపైనా హాయిగా గుర్రు కొట్టొచ్చు. ఇక్కడిలా సిసి కెమేరాల గోల ఉండదు. 'ఇదేమిటి?'..అని దబాయించేందుకు ముఖ్యమంత్రులు సచివాలయాల్లోకి అసలు అడుగే పెట్టరు. మన చట్టసభల్లో కన్నా రెట్టింపు అల్లరీ.. ఆగం చేసుకున్నా ఇబ్బందేమీ ఉండదు. ఎత్తుకెళ్ళి బైట కుదేయడానికంటూ ఏ సిబ్బంది నియామకం ప్రత్యేకంగా ఉండదనిపిస్తోంది.''

''ఈ మాత్రం సుఖానికే స్వర్గం కోసం వెంపర్లాడాలా బాబాయ్? ప్చ్..!''

''నీ కిష్టమైన గానాబజానాలు కూడా పెద్దపండుగల్లోలా నడుస్తుంటాయిరా బాబూ అక్కడా! ఇష్టమైన వాళ్ళతో ఇష్టమొచ్చినట్లు ఇష్టమైనంతసేపు మహా విచ్చలవిడిగా వీర విహారం చేసెయ్యొచ్చు. చూసుకో! ఏదీ పాపం కాదంటారక్కడ మరి మన ఆర్జీవీ మోడల్లో! పీకల్దాకా తాగి తూము కాలవల్లో పడి దొర్లినా తట్టి లేపే నాథుడెవడూ ఉండని లోకంరా బాబూ స్వర్గమంటే!''

''పో బాబాయ్! ఓ కొత్త రెండు వేల నోట్లు మనది కాదనుకొంటే ఏ రేవ్ పార్టీలోనైనా ఇంతకన్నా బ్రహ్మాండంగా మజా చెయ్యచ్చు! ఈ మాత్రం సుఖాలకే స్వర్గం దాకా దేకటాలెందుకంట! సరే.. స్వర్గాలన్నీ ఒకే తీరుగా ఉంటాయా? అక్కడా మన నక్షత్ర హొటళ్ళ మాదిరిగా.. సినిమాహాల్లో టిక్కెట్ల లెక్కన తేడాలుంటాయా? ఉంటే అవి ఎన్ని రకాలు? దక్షిణాది.. ఉత్తరాది వారికి తగ్గట్లుగా డిఫరెంటు ఏర్పాట్లు..''

''వంట్లో ఎలా వుందబ్బా నీకూ? ఓ సారలా ఆసుపత్రి దాకా వెళ్ళొద్దామా?''

''శవాలకు మనుషుల్లాగా.. మనుషులకు శవాలకు మల్లే చికిత్సలు చేసే ఆ ఆసుపత్రిలకి ఇప్పుడెందుకులే! అసలే నా దగ్గర ఆరోగ్యశ్రీ ఒరిజినల్ కార్డు కూడా లేదు. నా సందేహం..''!

''సివిల్ సర్వీసు పరీక్ష తెలుగు ప్రశ్నపత్రంలా గందరగోళంగా ఉందిరా నీ సందేహం. అడిగినంత సులభం కాదు బాబూ దీనికి జవాబు చెప్పటం! ఒక్క ముక్కలో చెప్పాలంటే మన హిమాలయాల్లా చల్లంగా ఉంటుందనుకో.. మన రజనీ అప్పుడప్పుడూ అక్కడికెందుకు పోయొస్తుంటాడో.. ముందా రహస్యం విచారించుకో.. పో!''

''మరీ కాశ్మీరీ లోయలా కల్పవృక్షాలూ గత్రాల్తో చల్లంగా ఉంటే.. రజనీకి ఓకేనేమో.. గానీ నాలుగు రాళ్లు గడించుకొనేవాడేం చేస్తాడా చలి చోట్లకి వెళ్ళి? కనీసం తలుచుకొన్నప్పుడల్లా విస్తరి నిండా దండిగా కూరలు పప్పులు వర్షంలా కురుస్తుంటేనన్నా కాస్తీ కరువు రోజుల్లో ఆలోచించచ్చు..''

''ఎప్పుడూ 'తినే' రంధేనా బాబూ నీకూ?!''

''బాబూ అంటే గుర్తొచ్చింది బాబాయ్. మా బాబుకి పంతుళ్ళ బడిత పూజల్లేని బడులుంటే చాలు.. అదే స్వర్గమంట! అలాంటి స్కూళ్లైనా ఉంటాయా స్వర్గంలో?''

''స్కూళ్ళుంటే స్వర్గమెట్లా అవుతుందిరా పిచ్చి సన్నాసీ! పంతుళ్ళతో, పేంబెత్తాలతో, మెళ్లో వేలాడేసే పలకలతో అవసరముండదక్కడ. నీ స్వర్గం, మీ బాబు స్వర్గం.

నాదేముందిగాని మధ్యలో.. మరి నా స్వర్గం ఎలా ఉంటుందో తెలుసా అబ్బిగా?''

''పరగడుపునే పిన్నిగారు చెడతిట్టకుండా లోటా నిండుగా చిక్కటి ఫిల్టరు కాఫీ కలిపిస్తుండాలి! పెందరాళే వార్తాపత్రిక పడేసి పోయే పేపర్ కుర్రాడు, పిలిచీ పిలవంగానే 'సార్' అంటో హాజరయ్యే చౌకీదారు, నోరు పడిపోయిన పక్కింటి కుక్కపిల్ల, ఇంట్లో పనిచేయని టీవీ, ప్రాబ్లం లేకుండా పనిచేసే లిఫ్టు, దొంగనోట్లు కక్కని ఏటియం, చౌకధరలకే దొరికే ఖరీదైన మందులు, గొణక్కుండా నాడిచూసే డాక్టర్లు, పద్దాకా నీ పిచ్చిరాతలు మాత్రమే ప్రచురించే ఓ పది పత్రికలూ..''


''ఫిఫ్టీ పర్సెంట్ నిజవే కానీ.. నిజానికి నా వరకు నాకు స్వర్గం అంటే.. టీవీ సీరియల్సు పదమూడు ఎపిసోడ్లకే బందయిపోయే చోటేరా అచ్చమైన స్వర్గం! పాదచారులు రోడ్డుకు ఎడమ వైపున.. వాహనాలు గీతల మధ్యన మాత్రమే నడిచే స్థలం, పండగలూ పబ్బాలప్పుడైనా సరే దిగి వచ్చే ధరవరలు, బళ్ళ పార్కింగులకు సరైన సదుపాయాలు, ఒకటికీ, రెంటికీ శుద్ధమైన ఏర్పాట్లు,. గత్రా గత్రా ఉంటేనే అది స్వచ్ఛమైన స్వర్గమైనట్లు లెక్క. ఐదేళ్ళకోసారి మాత్రమే సజావుగా.. హుందాగా ఎన్నికలు జరిగాలి. బందులూ ధర్నాలూ నిష్కారణంగా జరగద్దు. ప్రజాసేవకులు సదా చిరునవ్వుతో జనాల సమస్యలను విని జరూరు జరూరుగా పరిష్కరించేందుకు తహతహలాడే పుణ్యభూమేరా స్వర్గమంటే! పొడిచేస్తాం.. బాంబులతో పేల్చేస్తాం.. అనే బెదిరింపులు అసలు చెవిన పడని శాంతిభూమి కూడా అయివుండాలి నా దృష్టిలో స్వర్గమంటే! చేతులు, మూతులు తడపకుండానే సర్కారు కార్యాలయాల్లో చకచకా దస్త్రాలు పరుగులెత్తే దేవాలయాలకి, కారణం లేకుండానే నేతలు కూసుకొనే కారుకూతలు అస్సలు వినపించని నిశ్శబ్ద భూస్థలికి హే భగవాన్.. నన్నూ..నా దేశాన్నీ నడిపించు!''

''బాబాయ్.. బాబాయ్! ముందు నువ్వు కాస్త నేలమీదకు దిగిరావాలి! ఇప్పటికే పాపం పైనున్న ఆ దేవుడికి ముచ్చెమటలు పట్టేస్తున్నాయ్! అసలు.. సందేహం తీర్చుకుందుకి నీ దగ్గరకొచ్చాను చూడు.. నాదీ బుద్ధి తక్కువ. సందు దొరికింది కదా అని.. సందర్భం కూడా తెలుసుకోకుండా నీ కడుపులోని ఆలోచనల్నీ ఇలా బొళబోళా బైటికి కక్కేయడమేనా? ఇదేమన్నా టీవీ డిబేటింగా?''

''సందర్భమేందో బైట పెట్టాల్సింది నువ్వా! స్వర్గం గురించి చర్చ రేపిందెవరూ అసందర్భంగా పరగడుపునే పరుగెత్తుకొంటూ వచ్చి!''

''అసందర్భమేం కాదు! ఏవేవో ఎన్నికలొచ్చి పడుతున్నాయ్ గదా! ఎవరికి వాళ్లు ఓటర్లకు అవినీతిని పొడిచేస్తాం! అవి చేసిన వాళ్లను పొడిచవతల పారేస్తాం' అంటో ఎడా పెడా హామీలు గుప్పించేస్తున్నారు.. చూస్తున్నావ్ కదా! మా వార్డులో ఈ మధ్య ఓ సన్యాసి.. ఫలానా పార్టీగ్గాని ఓటేసి గెలిపిస్తే ఏకంగా స్వర్గానికి పంపించేస్తానంటూ.. కంటబడ్డ వాళ్లందరి నుదుటనా ఇంత లావు పెండెకట్లు రుద్ది పోతున్నాడు! మా పిచ్చిది ఇంట్లో ఒహటే నస. ఆ

సన్యాసి చెప్పినోడికే తప్పకుండా ఇంటిల్లిపాదీ ఓటెయ్యాలంటూ! ఒహవేళ అతగాడు చెప్పిన పార్టీనే ఎన్నికల్లో గెలిచేసి.. స్వర్గానికి పొమ్మని మమ్మల్ని బలవంతం చేస్తే వెళ్లాలా? వద్దా? బెంగతో బుర్ర బద్దలయిపోతోంది! రాత్రుళ్ళు నిద్ర పట్టడంలే!



సరే.. నువ్వున్నావు కదా.. పెద్దాయనవి.. అన్ని సందేహాలు తీర్చడానికని.. ఇట్లా లగెత్తుకొస్తే.. నువ్వేమో.. ఆ సన్నాసోళ్ల కన్నా వింతైన స్వర్గాన్ని కళ్లక్కటించి బెదిరిస్తుంటివి?!''

''అదీ కథ! నేనూ విన్నాన్లేరా ఆ స్వర్గం సన్నాసోళ్ల గురించి. అధికారంలో ఉన్నంత కాలం పబ్లిక్కుని పట్టించుకోనోళ్ల నోళ్లే ఇట్లాంటి 'స్వర్గం' సొళ్లు వినిపించేది! మళ్లా పెత్తనం కావాలి కదా! సమంతా తమన్నా సినిమాలు చూసి ఈలలేసుకొనే ఈడులో ఈ స్వర్గాల గోడు నీకెందుకు చెప్పు! మీ ఆవిడకూ మరీ అంత హడావుడి వద్దు! ముద్ద మందారం ముప్పైవేల ఎపిసోడు కూడా హాయిగా ఎంజాయ్ చేసేయచ్చు! మీ పిలగాడూ ఎదిగి ఓటేసే ఈడు కొచ్చే వరకూ ఏ స్వర్గానికీ ఎవరూ ఎగిరి పోయే బెడదుండదు. నాదీ గ్యారంటీ!''

''అరెరే! ఇప్పుడెట్లా బాబాయ్ మరి! ఆ సన్యాసి పార్టీకే ఇంటిల్లిపాదీ ఓటేస్తామని పెద్దమ్మ గుడికెళ్ళి దీపం కూడా ఆర్పొచ్చిందే మా మొద్దుది! వృథా అవుతాయా మా పవిత్రమైన ఓట్లన్నీ?''

''ఈ సన్నాసి కాకపోతే ఇంకో సన్నాసి. ఎవరొచ్చినా చూపించేది అదే అరచేతి వైకుంఠం! నిజంగానే నీకు స్వర్గం మీదంత మోజుంటే నీ ఓటుతోనే నువ్వు ఇక్కడ సృష్టించుకోవచ్చుబ్బీ! వేదికల మీది ఊపుళ్లు చూసి తప్పుడు నిర్ణయాలు తీసుకోకుంటే సరి! సరాసరి కోరుకొన్న స్వర్గం మీ గుమ్మం ముందుకే వచ్చి వాలుతుంది మరి!

రాజ్యాంగ విలువలను విస్మరించారు


● ఏపీపై అడుగడుగునా వివక్షే: అమిత్‌షాకు రాసిన లేఖలో చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: రాజ్యాంగ విలువలను విస్మరించినందువల్లనే ఎన్‌డిఏ నుంచి తప్పుకున్నట్లు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కేంద్రం ఏపీపై వివక్ష చూపడాన్ని రాష్ట్ర ప్రజలు భరించలేకపోయారని, వారి ఆకాంక్షకు అనుగుణంగానే కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఎన్డీయేతో తెగతెంపులు చేసుకున్న నేపథ్యంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షాకు శుక్రవారం చంద్రబాబు ఒక లేఖ వ్రాశారు. నేషనల్ డెమొక్రటిక్ అలయెన్సు నుంచి తప్పుకోవడం బాధాకరమే అయినప్పటికీ అనివార్యమైందన్నారు. 2014 నాటి రాష్ట్ర పునర్విభజన చట్టంతోపాటు అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రాజ్యసభలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్రం విఫలమైందన్నారు. కేంద్రం నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో తమ మంత్రులు రాజీనామా చేసినప్పటికి ఫలితం లేకపోయిందని అనంతరం ఆర్థిక బిల్లులో కూడా లాభం లేకుండా పోయిందని అంటూ మార్చి 7వ తేదిన ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటన 5 కోట్ల ఆంధ్రుల మనస్సులను గాయపరిచిందని వివరించారు. గత సాధారణ ఎన్నికల కన్నా ముందు ఎన్డీయే భాగస్వాములుగా ఎన్నికలు ఎదుర్కొన్నామని, విభజన హామీలను పరిష్కరించే బాధ్యత ఎన్డీయే సర్కార్‌పై లేదా చంద్రబాబు ప్రశ్నించారు. యుపిఎ సర్కార్ వల్ల కలిగిన నష్టాన్ని ఎన్డీయే ప్రభుత్వం పూడుస్తుందన్న భ్రమలు పోయాయన్నారు. బిజెపి, టిడిపిలపై నమ్మకంతో ఎపి ప్రజలు ఓటు వేశారని గుర్తు చేశారు. రెవెన్యూ లోటు 16 వేల కోట్లను పక్కన పెట్టారని, 14వ ఆర్థిక సంఘం చెప్పకపోయినా ప్రత్యేక హోదాపై మాట తప్పారని తప్పుబట్టారు. ప్రత్యేక ప్యాకేజి హామీని కూడా నిలబెట్టలేకపోయిందని అన్నారు. 29 న్యాయం కోసం ఢిల్లీ వచ్చానని, గత జనవరి 12వ తేదీన తానే స్వయంగా ఢిల్లీ వచ్చి ప్రధాని మంత్రికి రాష్ట్ర సమస్యలపై వినతి పత్రం సమర్పించామన్నారు. 2018-19 బడ్జెట్‌లో కూడా మొండి చేయి చూపారని, రాష్ట్ర విభజనలో కూడా అడుగడుగునా అన్యాయమే జరిగిందన్నారు. రాజధానిలేని రాష్ట్రానికి పూర్తి స్థాయిలో సహాయం చేయడంలో అడుగడుగునా పక్షపాత ధోరణిని ప్రదర్శించారని, వెనుకబడిన జిల్లాల ప్యాకేజిని ఇవ్వలేదని చంద్రబాబు అమిత్ షా దృష్టికి తెచ్చారు. అమరావతి రాజధాని శంకుస్థాపనకు వచ్చిన ప్రధాన మంత్రి విభజన హామీలను నెరవేరుస్తానన్న హామీలు అమలు కాలేదన్నారు. అయిదేళ్లపాటు ఉండాల్సిన ప్రత్యేక హోదా ఊసేలేదన్నారు. పలు అంశాలపై కేంద్రం నామమాత్ర స్పందనతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్డీయే నుంచి తప్పుకోవాల్సి వచ్చిందన్నారు.

అధిష్ఠానం పిలుపు

● తక్షణమే రావాలంటూ ఏపీ బీజేపీ నాయకులకు పిలుపు ● నేడు అమిత్‌షాతో భేటీ ● పార్టీ అధ్యక్షుని మార్పుతో సహా అన్ని విషయాలపై చర్చ ● ఏపీ ఇన్‌చార్జిగా రామ్‌మాధవ్‌ను ప్రకటించే అవకాశం



అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం నుంచి వైదొలుగుతున్నట్లు తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన గంటల వ్యవధిలోనే అత్యవసరంగా ఢిల్లీకి రావాలంటూ ఏపీ బీజేపీ నేతలకు వర్తమానం అందింది. శనివారం వీరు అమిత్ షాతో సమావేశమై రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, ఇప్పుడున్న పరిణామాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు తదితర అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించనున్నారు.

ఇదే సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుని మార్పుతో పాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌ను ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అధిష్ఠానం పిలుపుతో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.హరిబాబు, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సతీష్‌జీ, బీజేపీ నేతలు దగ్గుబాటి పురంధేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ, కావూరి సాంబశివరావు, సోము వీర్రాజు, పైడికొండల మాణిక్యాలరావు, ఆర్.రవీంద్రరాజు, ఇటీవల యూపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన జీవీఎల్ నరసింహారావు హుటాహుటిన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా హరిబాబు స్థానంలో మరొకరిని నియమిస్తారంటూ ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతున్నప్పటికీ అధిష్టానం మాత్రం మౌనమే సమాధానంగా వస్తోంది. రాష్ట్రంలోని అధికార తెలుగుదేశం పార్టీ బీజేపీ మిత్రపక్షంగా ఎన్‌డిఏ ప్రభుత్వంలో కొనసాగడమే ఇందుకు కారణం. రాష్ట్ర బీజేపీ నేతల్లో హరిబాబు మినహా మిగిలిన ఎవరికి కూడా తెదేపా అధినేత చంద్రబాబుతో కాని, ఆ పార్టీ నేతలతో కాని సన్నిహిత సంబంధాలు లేవు. ఈ క్రమంలోనే మూడున్నరేళ్లయినా ఇన్‌చార్జిగా హరిబాబును కొనసాగించాల్సి వచ్చిందని పార్టీ నేతలు చెపుతున్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వంతో తెదేపా కటీఫ్ చెప్పడంతో ఇక అధ్యక్షుని మార్పు అనివార్యంగా మారిందనేది పార్టీ వర్గాల అభిప్రాయం. బీజేపీ జాతీయ ముఖ్య అధికార ప్రతినిధిగా ఉన్న జీవీఎల్ నరసింహారావును రాజ్యసభకు పంపారు. ఇదే విషయమై రాష్ట్ర పార్టీ నేతల్లోని సీనియర్లు కొందరు అధిష్టానంపై కినుకు వహించారు. పార్టీ నియామవళి ప్రకారం ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు పంపినప్పటికీ సొంత రాష్ట్ర బీజేపీ తీర్మాణం చేసి పంపాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా ఆయనను తీసుకోవడం అలిగిన వారిని బుజ్జగించడంతో పాటు కోర్ కమిటీలోకి ఆయనను తీసుకోనున్నట్లు చెబుతున్నారు.

రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌ను ప్రకటించే అవకాశం ఉందని చెపుతున్నారు. ఇప్పటికే ఏపీ సహా తెలంగాణా, కేరళ రాష్ట్రాలకు ఆయనను ఇన్‌చార్జిగా నియమించినప్పటికీ అధికారికంగా ప్రకటించలేదు. శనివారం ఆయన పేరును అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఏదేమైనా రాష్ట్రంలో గంటగంటకూ మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర నేతలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఏ కష్టమొచ్చిందో..

(మొదటిపేజీ తరువాయి)



విషాద ఘటన చోటు చేసుకుంది. ఇద్దరు పిల్లలకు విషమిచ్చి అనంతరం వారు కూడా విషం తాగి బలవన్మరణం చెందారు. మృతుల్లో నెలల వయసున్న చిన్నారి సైతం ఉండటం స్థానికులను కంటతడి పెట్టించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహణ అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆర్థిక ఇబ్బందులేనా? ఇతరత్రా ఏమైనా కారణాలున్నాయా? అన్న కోణంలోనూ పోలీ సులు విచారణ కొనసాగిస్తున్నారు. మృతుల పేర్లు స్వరూప్‌గోపాల్ దాస్, దీప, దిట్టిదాస్(6), ఐదు నెలల చిన్నారి. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చర్చకు వచ్చేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందికరంగా మారగా.. ఈ అవిశ్వాస తీర్మానాల విషయంలో మాత్రం అదే ప్రతిపక్షపు ఆందోళన సానుకూలంగా పరిణమిస్తున్నది. ఈ ఆందోళనను అడ్డుపెట్టుకుని పాలకపక్షం ఆ తీర్మానాలు సభలో ప్రస్తావనకు రాకుండా జాగ్రత్త పడుతున్న దన్న విమర్శలు ఉన్నాయి. అయితే ప్రతిపక్ష సభ్యులెవ్వరూ సోమవారం ఆందో ళనకు దిగకుండా ఉంటే స్పీకర్ ఏమి చేస్తారన్నది ఆసక్తికరమైన అంశం. అందుకే అవిశ్వాస తీర్మానాలు పెట్టిన తెలుగుదేశం, వైకాపాలు ఈ రెండు రోజుల్లో అన్ని ప్రతి పక్ష పార్టీల నాయకులతో మాట్లాడి సభలో నిరసనలకు దిగకుండా ఒప్పించుకుంటే పరిస్థితి మరోలా ఉండవచ్చని అంటున్నారు. అందువల్ల ప్రతిపక్షాలు ఆందోళనకు దిగకుండా లాబీయింగ్ చేసుకోవాల్సిన బాధ్యత ఇటు చంద్రబాబు నాయుడి మీద, అటు జగన్ మీద పడ్డాయి. కేవలం ఈ రెండు పార్టీల ఎంపీలు ఢిల్లీలో ఆయా ప్రతిపక్ష ఎంపీలతో మాట్లాడినంత మాత్రాన చాలదని తెలుగుదేశం, వైకాపాల అగ్రనేతలే రంగంలోకి దిగితేనే మార్గం సుగమం కావచ్చని అంటున్నారు. వైకాపా ఎంపీలు లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ సభా నాయకుడు ఖర్గేని కలిసి నప్పుడు ఆయనిచ్చిన జవాబుని ఈ సందర్భంగా వారు ఉటంకిస్తున్నారు. తమ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని, తమ పార్టీ అధినేత సోనియా గాంధీని కలిసి చర్చిస్తే ఒక నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పందించారు. ఏది ఏమైనా అంతిమంగా ఎవరి అవిశ్వాసం పరీక్షకు వచ్చినా ఇప్పటికిప్పుడు మోడీ ప్రభుత్వా నికి వచ్చిన ఢోకా ఏమీ లేదన్న సంగతి అంకెల లెక్కలతో స్పష్టమవుతున్నది. ఎటొచ్చీ అవిశ్వాసాల భవితవ్యం ఏమవుతుందనేదే ప్రస్తుత సమస్య.

చదువులోనూ.. ఫస్ట్..!

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. పాఠశాల విద్య వరకు పెరుగుతున్న అక్షరాస్యతలో బాలికలు ఎక్కువగా ఉండటం విశేషం. అయితే ఉన్నత విద్యలో మాత్రం బాలికలే డ్రాపౌట్స్ ఎక్కువగా ఉంటున్నారు. ఉన్నత విద్యలో డ్రాపౌట్స్‌ను తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రత్యేకంగా బాలికల్లో డ్రాపౌట్స్‌ను తగ్గించడం కోసం డిగ్రీలో మహిళా రెసిడెన్షియల్ కాలేజీలను ప్రారంభించింది. ఇదే రీతిలో మహిళా యూనివర్సిటీని సైతం ప్రారంభించాలనే ఆలోచనలో సర్కార్ ఉన్నట్టు తెలుస్తోంది. అందుకోసం కోఠిలోని మహిళా కళాశాలను కొద్ది రోజుల క్రితం ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి అయిన కడియం శ్రీహరి పరిశీలించారు కూడా.

10 సంవత్సరాల్లో 8.5 శాతం పెరుగుదల

జాతీయ జనాభా లెక్కల ప్రకారం 2001 నుంచి 2011 వరకు దేశ జనాభా లెక్కల ఆధారంగా అక్షరాస్యతను లెక్కించారు. జాతీయ స్థాయిలో అక్షరాస్యత 64.84 శాతం నుంచి 72.98 శాతానికి పెరిగింది. అంటే 8.14 శాతం పెరిగింది. అదే విధంగా తెలంగాణలో కూడా 58 శాతం నుంచి 66.54 శాతానికి పెరిగింది. 8.54 శాతం అక్షరాస్యత 10 సంవత్సరాల కాలంలో పెరిగింది. తెలంగాణలో అక్షరాస్యతలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లా 83.25 శాతంతో మొదటి స్థానంలో ఉంది. జోగులాంబ గద్వాల జిల్లా 49.87 శాతంతో చివర్లో ఉంది. గ్రామీణ ప్రాంతాలు... పట్టణ ప్రాంతాల మధ్య అక్షరాస్యత బాగా తేడా ఉంది. పట్టణాల్లో 81 శాతం అక్షరాస్యత ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 57 శాతమే ఉంది. ఇక స్త్రీలు, పురుషుల మధ్య కూడా అక్షరాస్యత శాతంలో తేడా ఉంది. పురుషుల్లో చదువుకున్న వారి శాతం 75 శాతం ఉంటే మహిళల్లో 58 శాతం ఉంది. జాతీయసగటు అక్షరాస్యత కంటే రాష్ట్రంలోని 5 జిల్లాలు అధికంగా ఉంటే మిగిలిన 26 జిల్లాలు జాతీయ సగటు కంటే తక్కువ అక్షరాస్యతతో వెనుకబడి ఉన్నాయి. జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్న జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్ అర్బన్, కరీంనగర్ జిల్లాలు ఉన్నాయి. జాతీయ సగటు కంటే తక్కువ అక్షరాస్యత ఉన్న జిల్లాల్లో ప్రత్యేక దృష్టి పెట్టి జాతీయ సగటు కంటే ఎక్కువ శాతం అక్షరాస్యత సాధించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

పాఠశాలస్థాయి వరకు మనమే టాప్

జాతీయ స్థాయి సగటు అక్షరాస్యత కంటే పాఠశాల స్థాయిలో తెలంగాణ రాష్ట్రం ఎక్కువగా ఉంది. పాఠశాల స్థాయిలో జాతీయ సగటు అక్షరాస్యత 87.92 శాతం ఉంటే తెలంగాణ రాష్ట్ర సగటు 90.56 శాతం ఉంది. అదే విధంగా ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువగానే ఉంది. జాతీయ సగటు 86.14 శాతం ఉంటే రాష్ట్ర సగటు 86.97 శాతంగా ఉంది. ఇక పాఠశాల స్థాయిలో ఎన్‌రోల్‌మెంట్ అబ్బాయిల కంటే అమ్మాయిలదే ఎక్కువగా ఉంటుంది. అబ్బాయిలు 12,74,210 మంది ఉంటే అమ్మాయిలు 14,04,693 మంది ఉంటున్నారు. అయితే ఇందులో పాఠశాల స్థాయిలో గిరిజన బాలికల శాతం బాలుర కంటే తక్కువగా ఉంది.

డ్రాపౌట్స్‌పై దృష్టి పెట్టిన సర్కార్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రాపౌట్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టింది. పాఠశాల స్థాయిలో అది బాలురు, బాలికల్లో సుమారు 8 శాతం వరకు ఉంటుంది. దీనిని నివారించడం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా బాలికల్లో ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉంటున్నాయి. దానిని నివారించేందుకు తెలంగాణ రాష్ట్ర సర్కార్ ప్రత్యేకంగా రెసిడెన్షియల్ కాలేజీలను ప్రారంభించింది. అమ్మాయిలకోసం జూనియర్ కాలేజీలతో డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీలను కూడా ప్రారంభించింది. ప్రత్యేకంగా మహిళా రెసిడెన్షియల్ కాలేజీలపై దృష్టి పెట్టిన సర్కార్ భవనాల నిర్మాణంతోపాటు వెంటనే అడ్మిషన్లను తీసుకునే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి జాతీయ సగటు కంటే తెలంగాణ రాష్ట్రంలో తక్కువగా ఉంది. ప్రతి 30 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా అదికాస్త తెలంగాణలో ప్రస్తుతం 18 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నాడు.

స్కూల్ బస్సు బోల్తా

లింగాపూర్, ప్రభన్యూస్: మంచిర్యాల జిల్లా, నడ్డగూడ, గొండుగూడ సమీపంలో శుక్రవారం కేరళ స్కూల్ బస్సు బోల్తాపడి 4గురు విద్యార్థులకు గాయాలు అయిన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. జైనూర్ నుంచి మామిడిపల్లికి వస్తున్న బస్సులో 13 మంది విద్యార్థులు ఉండగా నలుగురు విద్యార్థులకు గాయాలైనట్లు వారి తల్లిదండ్రులు పేర్కొన్నారు.

మోడీ ప్రతిష్ఠకు భంగం!

(మొదటిపేజీ తరువాయి)

తొలి టరమ్‌లోనే నాలుగో ఏట రెండు అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కోవాల్సి రావడం మోడీ పాలనపై తీర్పులాంటిదని తెలుగుదేశం ఎంపీలు అంటున్నారు. నిజానికి ఇది కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వ పాలన మీద అసంతృప్తా? లేక ప్రధాని మోడీ వ్యవహార శైలి మీద ఆగ్రహమా? అన్న కోణాన్ని విశ్లేషించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రత్యేక హోదాతో పాటు రైల్వే జోన్‌లాంటి అనేక అంశాల మీద అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ ఎన్డీయేలో నుంచి వైదొలిగారు. ఆ మరుక్షణమే ఆయన నేతృత్వంలోని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కేంద్రం మీద అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ నోటీసు ఇచ్చింది. తెలుగుదేశం పార్టీకి సంబంధించినంత వరకు ఈ రెండు చర్యల్లోను కేంద్రం మీద కన్నా ప్రధాని మోడీ మీదే గురి పెట్టినట్టు స్పష్టమవుతున్నది. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పట్ల వైముఖ్య ధోరణి అవలంబిస్తున్నారన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అభిప్రాయంగా ఉన్నట్టు తెలుస్తున్నది.

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు రెండో విడత ఈనెల 5న మొదలైన తర్వాత జాతీయ స్థాయిలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతూ వచ్చాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ వేగంగా పావులు కదపడం ప్రారంభించింది. అదే రోజు నుంచి పార్లమెంటులో తెలుగుదేశం పార్టీతో పాటు అన్ని ప్రతిపక్ష పార్టీలు తమ ఆందోళనను ఉధృతం చేశాయి. ఇందులో జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి అనేక ప్రాంతీయ పార్టీలున్నాయి. ఎవరి అంశాలు వారివిగా విడివిడిగా చేస్తున్నప్పటికీ సభలో మూకుమ్మడిగా ప్రతిపక్ష ఆందోళనగా అది ద్యోతకమవుతూ వస్తున్నది. రిజర్వేషన్లు పెంచాలన్న డిమాండ్‌తో తెలంగాణ రాష్ట్ర సమితి తన వంతు ఆందోళనకు నడుం బిగించింది. దీంతో పాలక ఎన్డీయేలోని భాగస్వామ్య పక్షాలు మినహా ఉభయ సభల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ ఏదొక రూపంలో ఏదొక సందర్భంలో నిరసనలకు దిగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన వైకాపా ప్రత్యేక హోదా కోసం కేంద్రం మీద ఒత్తిడి పెంచే విషయమై అవిశ్వాసానికి సన్నద్ధమవ్వడంతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ నుంచి ఊహించని విధంగా దాడి మొదలవ్వడంతో తెలుగుదేశం వ్యూహం మార్చి రెండు కీలక హఠాత్ నిర్ణయాలు తీసేసుకుంది.

అవిశ్వాస తీర్మానాల వల్ల ఎన్డీయే ప్రభుత్వ అస్థిత్వానికి వచ్చిన ముప్పేమీ లేదన్న విషయం స్పష్టమే. చట్టసభలో సంఖ్యాబలాలే ఆ తీర్మానాల భవిష్యత్తుని నిర్దేశిస్తాయి కాబట్టి మోడీ ప్రభుత్వం గాని.. ప్రభుత్వంలోని మోడీ అనుచరులు గాని వాటి గురించి పెద్దగా ఆందోళన చెందటం లేదు. కాకపోతే భాగస్వాముల్లోనే మోడీ పాలన మీద ఇంతటి అసంతృప్తి ఉందన్న సంకేతాలు బహిర్గతమైనట్టు అయిందన్నదే బీజేపీలోని సీనియర్ల ఆవేదనగా ఉంది. అందులోనూ గత చరిత్రను బట్టి చూస్తే.. ఎన్డీయేకు నమ్మకమైన భాగస్వామిగా గతంలో కీలక సమయాల్లో సంకీర్ణానికి ఆపద్బంధువులా ఉన్న చంద్రబాబు నుంచే తొలి షాక్ తగలడం నిస్సందేహంగా ఇబ్బందికరమైన అంశమే నని కొందరి భావన. రాజకీయాల్లో ఆచితూచి అడుగేసే వ్యూహకర్తగా గుర్తింపు పొందిన చంద్రబాబు.. ఆవేశాలకు లోనై తొందరపాటు చర్యలకు దిగే నాయకుడు కాదన్న ముద్ర ఉన్న చంద్రబాబు.. నాలుగేళ్లు ఎదురుచూసి.. మోడీ సహాయ నిరాకరణ చేస్తున్నారన్న విషయాన్ని అనుభవపూర్వకంగా నిర్ధారణ చేసుకున్నాకే ఇంతటి కీలక నిర్ణయం తీసుకోవడం బీజేపీకి చేదు గుర్తుగా మిగిలిపోవడం ఖాయమని వారు భావిస్తున్నారు. దీని ప్రభావం ముమ్ముందు ఎలా ఉంటుందనేదే కమలనాథుల అంచనాలకు అందడం లేదు. ఇప్పటికే ప్రచారంలో ఉన్న మూడో ప్రత్యామ్నాయ ఫ్రంట్ చంద్రబాబులాంటి అసంతృప్తవాదుల అండదండలతో బలపడితే అది బీజేపీకి ఏదొక స్థాయిలో సవాలుగా మారే ప్రమాదం ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఇందుకు ఉత్తరప్రదేశ్‌లో మొన్ననే జరిగిన ఉప ఎన్నికల్లో ఎస్పీ-బీఎస్పీ జత కట్టి బీజేపీని మట్టి కరిపించిన ఉదంతాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. ప్రతిపక్షాల్లో తొంభయ్యో దశకంలో ఎలాంటి అనైక్యత ఉందో ఇప్పటికీ ఇంచుమించు అలాంటి అనైక్యతే ఉందని వాదిస్తున్న వాళ్లూ కమలనాథుల్లో ఉన్నారు. అయితే అఖిలేష్‌యాదవ్, మాయావతి చేతులు కలుపుతారని కలలోనైనా ఊహించని పరిణామం వాస్తవంలోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయాల్లో ఎప్పుడైనా ఏవైనా జరగవచ్చన్న సిద్ధాంతాన్ని ఇతర ప్రతిపక్ష పార్టీల వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

గడప గడపకూ చెక్కులు, పాస్‌బుక్కులు

(మొదటిపేజీ తరువాయి)

పారదర్శకమైన వ్యవస్థను ఆవిష్కరించనున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే కొత్త గ్రామ పంచాయతీలు కార్యరూపం దాల్చనున్నాయి.

ఒక రోజు ముందుగానే గ్రామాల్లోకి సామాగ్రి

పంపిణీ ప్రారంభానికి ఒకరోజు ముందుగానే అన్ని గ్రామాలకు చెక్కులు, పాస్‌బుక్‌లను చేరవేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రతి గ్రామానికి ఒక నోడల్ అధికారిని నియమించి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పర్యవేక్షణ ఉంటుంది. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో అధికార యంత్రాంగమంతా పూరిస్థాయి సమన్వయంతో పనిచేసే విధంగా, ఎక్కడా లోటుపాట్లు జరుగకుండా కలెక్టర్లు ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. అప్పటివరకు భూ రికార్డులన్నింటినీ ఆన్‌లైన్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. అందుకు ప్రభుత్వం రూపొందిస్తున్న 'ధరణి' వెబ్‌సైట్‌ను ప్రపంచంలో ఏ మూల నుండైనా చూడవచ్చు. గ్రామ పంచాయతీల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ద్వారా గ్రామీణ ప్రజల్లో నమ్మకాన్ని దృఢపరుచుకోనున్నారు.

ప్రభుత్వం మార్గదర్శకాలు

● షెడ్యూల్డ్, ప్లెయిన్ ఏరియాల్లో సాదా బైనామాలు ఇప్పటివరకు ధరఖాస్తు చేసుకున్నవన్నీ పూర్తిచేయాలి.

● ఆర్‌వోఎఫ్‌ఆర్ ప్రతిపాదనలు జిల్లాల వారీగా ప్రభుత్వానికి పంపిస్తే వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

● జిల్లాల వారీగా భూ ప్రక్షాళనకు సంబంధించి ఇంకేమన్నా సమస్యలుంటే వాటిని ప్రభుత్వానికి పంపాలి.

● సాదా బైనామాలు, భూ బదలాయింపులన్నీ రిజిస్ట్రేషన్ ద్వారాకానీ, వారసత్వ హక్కుగా గానీ మ్యుటేషన్‌కానీ జరగాలి.

● కొత్తగా సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగిస్తున్న 443 తహసిల్దారులకు, ప్రస్తుతం పనిచేస్తున్న 141 మంది సబ్ రిజిస్ట్రార్లకు కొత్త విధానంలో, ఐటి అప్లికేషన్లలో శిక్షణ ఇవ్వాలి.

● 12 మార్చి తర్వాత బ్యాంకు రుణాల కొరకు పట్టాదారు పాస్‌పుస్తకాలు తాకట్టు పెట్టుకోకూడదు. ధరణి వెబ్‌సైట్‌లో వివరాలు చూసుకోవాలి.

● భూ సంబంధమైన సమస్యలు చాలా సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఇప్పుడు ఆ చిక్కులన్నీ తొలగిపోవాలి.

● ఈ సమస్యల్లో ప్రధానమైంది అసైన్డ్ భూములు.ఈ ప్రక్రియ గతంలో చాలా అశాస్త్రీయంగా జరిగింది. ఈ విషయంలో ఏం చేయాలనే విషయంలో ఒక విధానం రూపొందించాలి.

● రెవెన్యూశాఖ గైడ్‌లైన్స్ రూపొందించాలి. వీటికి అనుగుణంగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తమ జిల్లాల్లో పరిశీలించి తగు విధంగా నిర్ణయం తీసుకోవాలి.

● ఈనెల 25నాటికి జిల్లాలనుంచి కొత్తగా ఏర్పాటు చేయబోయే గ్రామ పంచాయతీల భౌగోళిక సరిహద్దులు (పరిధి) నిర్ణయించి ప్రభుత్వానికి కలెక్టర్లు వివరాలు పంపాలి.

● కొత్త పంచాయతీల ఏర్పాటుకు కనీసం జనాభా 500 ఉండాలి. విడిపోతున్న గ్రామ పంచాయతీకి కొత్తగా ఏర్పాటు కాబోయే పంచాయతీకి మధ్య కనీసం ఒకటిన్నర కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల దూరం ఉండాలి.

● గ్రామాలు బాగు పడటానికి పంచాయతీ వ్యవస్థ ఎలా ఉండాలో అనే దానిమీద కలెక్టర్లు వాళ్ళ సూచనలు, సలహాలు పంచాయతీరాజ్ కార్యదర్శికి పంపాలి.

● సర్పంచ్‌ల నుంచి పని రాబట్టుకోవడానికి ఏం చేయాలనే విషయంపై జిల్లా పంచాయతీ అధికారులు సూచనలు ఇవ్వాలి. ● ఆ సూచనలు, సలహాలఆధారంగా కొత్త పంచాయతీరాజ్ చట్టం ముసాయిదా బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టడం జరుగుతుంది. ● స్థానిక తక్షణ అవసరాల కోసం పెద్ద జిల్లాల కలెక్టర్లకు రూ.1.5 కోట్లు, చిన్న జిల్లాలకు రూ.కోటి కేటాయించాలి.

Andhraprabha business 2018

బిజినెస్

BUSINESS

రిటైర్లకు క్లియర్ ట్యాక్స్ చేయూత

హైదరాబాద్ : కేంద్రప్రభుత్వం గతేడాది జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. సాధారణ కిరాణా వ్యాపారస్తుడి నుంచి పెద్ద వ్యాపారస్తుడి వరకు రిటర్న్స్ ఫైల్ చేయాల్సి వస్తోంది. అలాంటి వారి కోసం క్లియర్‌టాక్స్ క్లౌడ్ ఆధారిత ఈ కామర్స్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన నుక్కడ్ షాప్స్ ద్వారా 1500 రిటైలర్లు, వారి రిటైల్ కార్యకలాపాలను డిజైన్ చేసింది. రిటైల్ వ్యాపారులు క్లియర్‌టాక్స్‌తో ఒప్పందం కుదుర్చుకొని తమ రిటర్న్స్ ఫైల్ చేసుకోవచ్చు నని క్లియర్‌టాక్స్ సీఈవోఅర్చిత్‌గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 3.6 లక్షల ఎస్ఎంఈలను తమ వేదికలోకి తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఏపీ,తెలంగాణల్లో సోలార్ కోల్డ్ రూంలు

హైదరాబాద్ : దేశంలోనే అతి పెద్ద కూలింగ్ సొల్యూషన్స్ విడిభాగాల తయారీకంపెనీ ఐస్‌మేక్ చౌకరకం శీతల గిడ్డంగుల కోసం వైబల్‌సోలార్ పవర్ కోల్డ్‌స్టోరేజి యూనిట్లను ప్రారంభించింది. శీతల గిడ్డంగులకు నిరంతరగా విద్యుత్ సరఫరా అవసరం అవుతుంది. తమ యూనిట్‌లతో ఈ కొరతను అధిగమించవచ్చునని, పర్యావరణానికి అనుకూలంగా ఉండే సోలార్ కోల్డ్‌రూంలు తెలంగాణతో పాటు ఆంధ్ర రైతులకు మేలు చేకూరుతుందని కంపెనీ సీఎండీ చంద్రకాంత్ పీ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. 4-5 మెట్రిక్ టన్నుల కోల్డ్‌రూం స్టోరేజి రూం కోసం రూ.11-12 లక్షల వరకు వ్యయం అవుతుందన్నారు.



జియో ఐడియా 'ఈషా'దే

• 2011లోనే ఈషా ప్రణాళికలు రూపుదిద్దారు
• అవార్డు ఫంక్షన్‌లో ముఖేష్ అంబానీ



లండన్: బిలియనీర్ ముఖేష్ అంబానీ భారత్ టెలికంరంగంలో ఎంట్రీ ఇచ్చి పోటీ కంపెనీలకు చుక్కలు చూపిస్తున్నారు. ఎంట్రీ ఇచ్చిన రెండేళ్ల అనతి కాలంలో భారత్‌లో అతి పెద్దమొబైల్ ఆపరేటర్‌గా ఎదిగారు. అయితే రిలయన్స్ జియో టెలికం రంగంలో ఎంట్రీ ఇవ్వడానికి మొదట బీజం వేసింది మాత్రం తన కుమార్తె ఈషా అని ముఖేష్ అంబానీ ఇక్కడ జరిగిన ది ఫైనాన్షియల్ టైమ్స్, అర్సిలర్ మిట్టల్ బోల్డ్‌నెస్ ఇన్ బిజినెస్ అవార్డులో పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 'డ్రైవర్స్ ఆఫ్ చేంజి' అవార్డు లభించింది. మొట్టమొదటిసారి 2011లో తన కుమార్తె మదిలో టెలికంరంగంలో ప్రవేశించాలనే ఆలోచన పుట్టుకొచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటి వరకు 3100 కోట్ల డాలర్లను పెట్టుబడి పెట్టినట్లు ఆయన చెప్పారు. 2016లో జియో పేరుతో మార్కెట్లో ప్రవేశించామని, పోటీ కంపెనీలను వెనక్కి నెట్టి నాలుగవ స్థానంలో నిలిచామని, కాల్‌సర్వీస్‌లను పూర్తిగా ఉచితంగా ఇవ్వడమే కాకుండా డేటాను అతి తక్కువకు ఇస్తున్నట్లు ఆయన వివరించారు.రాబోయే రోజుల్లో కొత్తరకం హెవీ డేటా సర్వీసెస్‌ని అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్లు దీనిద్వారా గృహాలకు కనెక్ట్ కావడంతో పాటు వ్యాపారస్తులకు, కార్లలో కూడా ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో వచ్చేలా ప్రణాళికలు రూపుదిద్దుతున్నామని ముఖేష్ అంబానీ వివరించారు.భారత్‌కు యువతే అతి పెద్ద ఆస్తి అని.. వారి నైపుణ్యంతో 2028 నాటికి ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలో భారత్ మూడవ స్థానానికి ఎగబాకుతుందన్నారు. కేవలం ఒక దశాబ్దకాలంలోనే ఇది వాస్తవరూపం జరగబోతోందన్నారు.

వాయిస్ కాల్స్ ఉచితం

రిలయన్స్ జియో వచ్చి రావడం తోనే ఉచిత వాయిస్‌కాల్స్‌తో పాటు అత్యంత నాణ్యమైన హైస్పీడ్ డేటాను ప్రపంచంలో ఎక్క డ ఇంత తక్కువ ధరకు లభించని డేటాను అంది స్తున్నామని ముఖేష్ తెలిపారు. అమెరికాతో పోల్చుకుంటే పదోవంతుకు భారత్‌లో డేటా అందిస్తున్నామన్నారు. ప్రారంభించిన 170 రో జుల్లోనే 100 మిలియన్ కస్టమర్లను ఆకట్టుకుం దన్నారు. బ్రిటన్ జనాభాకు ఇది ఒకటిన్నర రెట్లు అధికమని ముఖేష్ వివరించారు.

2011లోనే అంకురార్పణ

టెలికం రంగంలో ప్రవేశించాలనే ఆలోచన తన కుమార్తె ఈషాకు 2011లో వచ్చిందని, అప్పుడు ఆమె అమెరికాలోని యెల్‌లో విద్యార్థి అని, సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు, తన కోర్సులో ఏం సాధించిందని తన చూపించాల నుకుంది. 'నాన్నగారు.. ఇంటర్నెట్ మన ఇంటిని నాశనం చేస్తోందని ముఖేష్ తన కుమార్తె చెప్పిన విషయాలను గుర్తుచేసు కున్నారు.
ఈషా ఇద్దరు సోదరులు ఆకాశ్. దీని గురించి మాట్లాడు తూ పాత కాలంలో టెలికం కంపెనీలు వాయిస్ సర్వీసెస్ ద్వారా పెద్దమొత్తంలో సొమ్ము చేసుకున్నారని, కొత్త ప్రపంచంలో అంతా డిజిటల్ అనిచెప్పారని, ఇషా, ఆకాశ్‌లిద్దరు కొత్తతరం యువత. కొత్త ఆలోచనలో అత్యుత్తమైన సేవలందించాలనే పట్టుదల కలిగినవారు. భారతీయ యువకులు బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ టెక్నాలజీ మారిపోదామని తనను ఒప్పించారని, టెక్నాలజీలో భారత్ వెనుకపడరాదన్న ఆలోచన పట్టుదల కసి వారిలో కనిపించిందని ముఖేష్ అంబానీ వివరించారు. పేలవమైన కనెక్టివిటి: 2011 సంవత్సరంలో భారత్‌లో కనెక్టివిటీ పేలవంగా ఉండేదని. డిజిటల్ సేవల కొరత తీవ్రంగా ఉండేదని డేటా అత్యంత కొరతగా ఉండెదని. కంపెనీలు దీనికి తగ్గట్లు డేటా ధరలను కృత్రిమంగా పెంచేశాయన్నారు. మెజారిటి భారతీయులు ఈ సేవలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉండేదన్నారు.జియో రంగం ప్రవేశం చేసిన తర్వాత అందుబాటు ధరకే దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని సామాన్యుడు కూడా డేటాను వినియోగించుకొనే స్థాయికి తీసుకొచ్చామని చెప్పారు. సెప్టెంబర్ 2016లో జియోను ప్రారంభించిన తర్వాత భారతీయ టెలికం రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టామని అంబానీ అన్నారు.అమెరికా 1జీ మొబైల్ నెట్‌వర్కులో అగ్రస్థానంలో ఉంటే, యూరోప్ 2జీ, చైనా క్రమంగా 3జీ నెట్‌వర్కుకు మారుతోంది. ఇక భారత్ విషయానికి వస్తే జియో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ 4జీ ఎల్‌టీఈ డేటానెట్‌వర్కు... ప్రపంచంలోనే అతి పెద్ద నెట్‌వర్కు అని వివరించారు. 2019లో భారత్ 4జీ నెట్‌వర్కులో మార్కెట్ లీడర్ అవుతుందన్నారు. భారతీయ టెలికంరంగం 2జీ నెట్‌వర్కుకు మారిపోవడానికి పాతిక సంవత్సరాల పడితే జియో కేవలం మూడు సంవత్సరాల్లనే 4జీ ఎల్‌టీఈ నెట్‌వర్కును సాధించి చూపించామని.. 4జీ నెట్‌వర్కు అత్యాధునిక టెక్నాలజీ అని.. ప్రస్తుతం 5జీ నెట్‌వర్కులోకి ప్రవేశించడానికి సిద్దంగా ఉన్నామన్నారు.

భారత్‌లో ఇప్పటికి 500 మిలియన్ ప్రజలు ఫిచర్ ఫోన్‌లను వాడుతున్నారని, స్మార్ట్‌ఫోన్‌లను కొనే తాహతులేక పోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. దీంతో జియో ప్రపంచంలోనే అత్యంత చౌకరకం 4జీ ఎల్‌టీఈ స్మార్ట్‌ఫోన్‌ను ఉచితంగా ఇస్తున్నామని.. కేవలం రూ.1500 డిపాజిట్ చేస్తే చాలని, ఈ స్కీం ప్రకటించిన వెంటనే ఫలితాలు అద్భుతంగా వచ్చాయని, దీంతో రోజుకు సుమారు 3 నుంచి 5 లక్షల మంది తన నెట్‌వర్కులోకి మారిపోతున్నారని, కేవలం రూ.200

చౌకధరకు స్మార్ట్‌ఫోన్

రూ.300 చెల్లిస్తే.. హైస్పీడ్ ఇంటర్నెట్‌తో పాటు వాయిస్ కాల్స్ ప్రస్తుతం ఉన్న కస్టమర్లకు అందిస్తున్నామన్నారు. దీంతో ప్రతి భారతీయుడికి ఇంటర్నెట్‌ను అందుబాటులోకి వస్తుందన్నారు. రాబోయే కొన్ని సంవత్సరాల్లో యూరోప్ జనాభాలో మూడోవంతు మంది సబ్‌స్క్రైబర్లు తమ నెట్‌వర్కులోకి మారిపోతారని, వారందరికి ప్రపంచస్థాయిలో డిజిటల్ సేవలందిస్తామన్నారు. జియో రాకతో బ్రాడ్‌బ్యాండ్ డేటా వినియోగంలో కేవలం రెండేళ్లలో ప్రపంచంలోనే 155 ర్యాంకు నుంచి నెంబర్ వన్ ర్యాంకుకు ఎదిగామని అన్నారు.భారత దేశ చరిత్రలో జియో అతి పెద్ద స్టార్టప్ కంపెనీగా ఎదిగిందన్నారు.

గతంలో డ్రైవర్స్ ఆఫ్ చేంజ్ అవార్డులు దక్కించుకొన్న కంపెనీలు

గతంలో డ్రైవర్స్ ఆఫ్ చేంజ్ అవార్డు దక్కించున్న కంపెనీలు ఇలా ఉన్నాయి. డీప్‌మైండ్ టెక్నాలజీస్ (2016)లో, ఎఫ్ఎఎన్‌యుసీ (2015) హెచ్‌బీఓ (2014), అలీబాబా (2013), మోండ్రాగన్ కార్పొరేషన్ (2012) అమెజాన్ (2011) ఆపిల్ (2010) ఫియట్ (2009), రియాన్‌ఎయిర్ (2008)లు సాధించాయి. అయితే రిలయన్స్ మాత్రం డ్రైవర్స్ ఆఫ్ ఛేంజి అవార్డు లభించలేదు. ఎందుకంటే హైడ్రోకార్బన్, పెట్రోలియం, రిఫైనింగ్ మార్కెటింగ్‌లో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో పెద్ద వృద్ధి సాధించలేకపోయింది. తండ్రి ధీరూబాయి అంబానీ గురించి ప్రస్తావిస్తూ.. భారత్ వ్యాపార చరిత్రలో 'డ్రైవర్ ఆఫ్ చేంజ్' తన తండ్రే అని స్పష్టం చేశారు. 1966లో కేవలం రూ.1,000, అప్పుడు 130 డాలర్ల పెట్టుబడితో వ్యాపార సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారని.. ప్రస్తుతం రిల్ 5000 కోట్ల డాలర్ల గ్రూపు అని.. ప్రతి రెండు లేదా రెండున్నర సంవత్సరాలకు వాటాదారుల సంపద రెట్టింపు చేస్తున్నామని చెప్పారు. ఇతర వ్యాపారులతో పోల్చుకుంటే రిలయన్స్ దేశాభివృద్దికి ఎక్కువ మొత్తం అందిస్తోందన్నారు.



టెక్నాలజీతో మరింత ఉపాధి

• సీఐఐ సదస్సులో గవర్నర్ • సామాన్యుల అవసరాలు తీర్చడం అందరి బాధ్యత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సామాన్య ప్రజల కనీస అవసరాలు తీరేలా వ్యక్తిగత సమ్మిళిత వృద్ధి సాధించాలని, ఇందుకు పౌర సమాజం బాధ్యత వహించాలని గవర్నర్ నరసింహన్ అన్నారు. సామాన్యుడి అవసరాలైన తాగునీరు, విద్య, ఉపాధి ,గృహ వసతి కల్పించాల్సి ఉందన్నారు. ఇందులో పారిశ్రామికరంగం ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.
పరిశ్రమలు, ప్రభుత్వం కలిసి ఆరోగ్యమైన, సుసంపన్నమైన దేశాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. సీఐఐ-తెలంగాణ శుక్రవారం నిర్వహించిన ఒకరోజు సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ప్రత్యామ్నాయం చూపలేదని, ఇది అభివృద్ధికి దోహదపడేదిగానే ఉంటుందన్నారు. టెక్నాలజీ వల్ల ఉపాధి అవకాశాలు తగ్గుతాయన్న భావన సరికాదని, దీనితో ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తున్నాయని గవర్నర్ అన్నారు. సామాన్యులకు విద్య, వైద్యం అందుబాటులో ఉండాలని అందుకోసం ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. సం పద సృష్టిస్తున్న కొద్దీ కాలుష్యం ప్రమాద స్థాయికి చేరుకుం టుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు కాలుష్య వ్యర్థాలను వెదజల్లకుండా టెక్నాలజీని వినియో గించి కాలుష్య రహిత పర్యావరణాన్ని కల్పించాలని నరసింహన్ సూచించారు.
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం రూపొందించిన పారిశ్రామిక విధానాలతో సానుకూల ఫలితాలు వస్తున్నాయన్నారు. దీంతో సులభతర వ్యాపారంలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, అలాగే, అనేక రంగాల్లో దూసుకుపోతోందన్నారు. పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షి స్తున్నామని, రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలు అవకాశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

ఆడి కార్ల ధరకు రెక్కలు

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడి కార్ల ధరలు పెరగనున్నాయి. బడ్జెట్ లో కస్టమ్స్ సుంకం పెంచడంతో వచ్చే నెల 1 నుంచి కార్ల ధరలను రూ.9 లక్షల వరకు పెంచుతున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీకి చెందిన అన్నీ మోడల్స్ పై నాలుగు శాతం వరకు ధరలు పెంచు తున్నట్లు ప్రకటించింది. ధరల విషయానికి వస్తే రూ.1 లక్షనుంచి రూ.9 లక్షల వర కు ఉంటుంది. కంపెనీ మోడ ల్స్‌విషయ నికి వస్తే ఎస్‌యూవీ క్యూ3 ప్రా రంభ ధర రూ.35. 35 లక్షల నుం చి స్పోర్ట్ కా రు టఆర్8 రూ.2.6 3కొ ట్ల వరకు విక్రయి స్తోం ది. కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం సంక్షేమ కా ర్యక్రమ,యాల కోసం ఉ దాహరణకు ఎడ్యుకేష న్ సెస్, ఇతర సెస్‌లతో పోల్చుకుం టే ఎక్కువగా ఉంది దీంతో కార్ల ధరలను పెంచాల్సిన ఆగత్యం ఏర్పడిందని ఆడి ఇండియా హెడ్ రాహిల్ అన్సారీ వివరించారు. వీలైనంత వరకు కస్టమర్లపై తక్కువ భారం మోపుతున్నామని ఆయన వివరణ కూడా ఇచ్చారు. ప్రభుత్వం లగ్జరీ కార్ల పరిశ్రమకు చేయూత నివ్వాలనికోరారు. కార్ల అమ్మకాలు పెరిగితే ప్రభు త్వానికి కూడా ఆదాయం పెరుగుతుందన్నా రు. 2018-19 బడ్జెట్ లో ఆర్థికమంత్రి అరు ణ్‌జైట్లీ కస్టమ్స్ డ్యూటి సీకెడి (కంప్లీట్ నాక్ డౌన్) దిగుమతిచేసు కొనేమోటార్ వాహనా లు, మో టార్ కార్లు, మోటార్ సైకి ళ్లపై సుం కాన్ని పది నుంచి పది హే ను శాతానికి పెం చారు. అలాగ మో టార్ వెహికిల్స్, మోటార్‌కార్లు, మో టార్ సైకిల్ విడిభా గాలపై సుంకాన్ని 7.5 శాతం నుం చి 415 శా తానికి పెంచిన విష యం తెలిసిందే.

భారీగా పెరిగిన కరెంటు ఖాతాలోటు

• పెద్ద మొత్తంలో దిగుమతులే కారణం


న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసికంలో కరెంటు ఖాతాలోటు ఏకంగా స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ)లో రెండు శాతానికి పెరిగిపోయింది. వివరంగా చెప్పుకోవాలంటే 1350 కోట్ల డాలర్లు. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 800 కోట్ల డాలర్లు లేదా 1.4 శాతంగా నమోదైందని రిజర్వుబ్యాంకు విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. సంవత్సరం ప్రాతిపదికన కరెంటు ఖాతాలోటు విపరీతంగా పెరిగిపోవడానికి ప్రధాన కారణం దిగుమతులు విపరీతంగా పెరిగిపోవడం.. అదే సమయంలో ఎగుమతులు తగ్గడమని ఆర్‌బీ బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ ప్రకటనలో పేర్కొంది. కాగా వాణిజ్యలోటు 4410 కోట్లకు డాలర్లకు చేరింది. క్రితం ఏడాది ఇదేకాలంలో 3330 కోట్ల డాలర్లుగా నమోదైంది. దీంతో బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసానికి 940 కోట్ల డాలర్లకు చేరింది. ఏడాది క్రితం 120 కోట్ల డాలర్ల వాణిజ్యలోటు ఏర్పడింది. దేశంలోకి పెద్దమొత్తంలో విదేశీ పెట్టుబడులు రావడంతో పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ప్రకటనలో వివరించింది. కాగా క్యాపిటల్ అండ్ ఫైనాన్షియల్ అకౌంట్ సర్‌ప్లస్ డిసెంబర్ త్రైమాసికంలో 1260 కోట్ల డాలర్లకు చేరుకోగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో 730 డాలర్లని.. అయితే డిసెంబర్ త్రైమాసికంలో విదేశీ ఫోర్టుపోలియో ఇన్వెస్టర్లు 530 కోట్ల డాలర్లను దేశీయ మార్కెట్లో పెట్టుబడుల రూపంలో దేశంలోకి తరలించారని పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో కరెంటు ఖాతాలోటు మరింత పెరగవచ్చునని ఎందుకంటే ముడి చమురు ధరలే కారణంకావచ్చునని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ చీఫ్‌ఎకనమిస్టు ఎ ప్రసన్న తెలిపారు. కరెంటు ఖాతాలోటు ఒక్కటే పెద్ద రిస్కు కాదని దీంతో పాటు కరెంటుఖాతాలోటు, ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం కలిసి రూపాయిపై ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. కరెంటు ఖాతాలోటు ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 2 శాతానికి, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2.3 శాతానికి ఎగబాకవచ్చునని చెప్పారు. కరెంటుఖాతాలోటు విపరీతంగా పెరిగిపోయినా. ఆసియా దేశాలతో పోల్చుకుంటే రూపాయి గత ఏడాది స్థిరంగా ఉందని, దీనికి ప్రధాన కారణం దేశంలోకి పెద్దమొత్తంలో డాలర్లు రావడమే కారణమని, అయితే ఈ ఏడాది 2018 నాటికి తిరిగి చూస్తే సీన్ రివర్స్ అయ్యింది. డాలర్ మారకంతో రూపాయి 1.65 శాతం క్షీణించింది.

మార్కెట్లకు రాజకీయ గ్రహణం!

• 510 పాయింట్లు పతనం • వరుసగా నాలుగో రోజు నష్టాల్లోనే

ముంబై : స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు నష్టాలతో ముగిసాయి. మార్కెట్లకు చివరి ట్రేడింగ్ రోజైన శుక్రవారం నాడు ఏకంగా 510 పాయింట్ల వరకు నష్టపోయింది. ఫిబ్రవరి 6 తర్వాత ఒక్క రోజులోనే భారీ స్థాయిలో మార్కెట్లు కుంగడం ఇదే మొదటిసారి. గ్లోబల్ వాణిజ్య యుద్ధాలతో పాటు రాజకీయ సెగ.. టీడీపీ ఎన్‌డీఏ కూటమి నుంచి విడిపోయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మనం ప్రవేశపెట్టింది. దేశీయ మార్కెట్లతో పాటు ఆసియా మార్కెట్లు కూడా నష్టాలతో ట్రేడ్ అయ్యాయి. గ్లోబల్ ట్రేడ్ వార్ ప్రపంచమార్కెట్లను కుదిపేస్తోంది. దీంతో ఇన్వెస్టర్లు తమ వద్ద ఉన్న షేర్లను విక్రయించుకుంటున్నారని దేశీయ బ్రోకర్లు చెబుతున్నారు. కాగా వరుసగా గత మూడు వారాల నుంచి చూస్తే సెన్సెక్స్ 131.14 పాయింట్లు, నిఫ్టీ 31.70 పాయింట్లు నష్టపోయింది.మొత్తానికి చూస్తే శుక్రవారం నాడు రాజకీయ సెంటిమెంట్ స్టాక్ మార్కెట్లపై కనిపించింది. చంద్రబాబు నాయుడుకు చెందిన తెలుగుదేశం పార్టీ ఎన్‌డీఏ దాని భాగస్వామ పక్షాలపై అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కాగా లోకసభలో స్పీకర్ సుమిత్రా మహాజన్ అవిశ్వాస తీర్మానం చేపట్టలేమని సభ సజావుగా సాగడానికి సభ్యులు సహకరించాలని కోరడం.. గందరగోళం మధ్య స్పీకర్ సభను వాయిదా వేయడం జరిగిపోయాయి. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకంపై పూరించిన శంఖారావంతో గ్లోబల్ మార్కెట్లను కుదిపేస్తున్నాయి.మొత్తానికి చూస్తే బీఎస్ఈ 509.54 పాయింట్లు నష్టపోయి 33,176 వద్ద ముగిసింది. లోహ, చమురు సహజవాయువు, పీఎస్‌యు, విద్యుత్, ఆటో, బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు భారీ నష్టాలకు గురయ్యాయి.
నిఫ్టీ విషయానికి వస్తే 165 పాయింట్ల వరకు నష్టపోయి 10,195.15 వద్ద ముగిసింది. కాగా విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.705.40 కోట్ల షేర్లను గురువారం నాడు విక్రయించారు. సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయిన షేరు విషయానికి వస్తే టాటామోటార్స్ 3.67 శాతంతో అగ్రస్థానంలో ఉండగా.. ఏషియన్ పెయింట్స్ 3.09 శాతంతో రెండవ స్థానంలో ఉంది. నష్టపోయిన ఇతర కంపెనీలు ఇలా ఉన్నాయి. అదానీపోర్ట్స్,హీరోమోటో కార్ప్, ఎన్‌టీపీసీ, సన్‌ఫార్మా, కొటక్ బ్యాంకు, ఒఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఎల్‌అండ్‌టి, డాక్టర్ రెడ్డీస్, ఐటీసీ లిమిటెడ్, టాటాస్టీల్, మారుతి సుజుకి, టీసీఎస్, బజాజ్‌ఆటో, రిలయన్స్ ఇండస్ట్రీస్, పవర్ గ్రిడ్,హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు,ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంకు, ఇండస్‌ఇండ్‌బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, కోల్ ఇండియా షేర్లు 2.89 శాతం వరకు నష్టాలను చవిచూశాయి.
దీనికి వ్యతిరేకంగా ఎంఅండ్‌ఎం, విప్రో, హిందుస్తాన్ యూనీలీవర్, ఎస్‌బ్యాంకులు రాజకీయ సునామీని తట్టుకొని నిలబడ్డాయి 0.88 శాతం వరకు లాభపడ్డాయి. గీతాంజలి జెమ్స్ షేర్లలో యధావిధిగా అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోంది. 4.63 శాతం క్షీణించిరూ.12.35 వద్ద ముగిసింది.





సమాజ సేవ దేవుడిచ్చిన వరం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సమాజ సేవ దేవుడిచ్చిన వరమని, కష్టాల్లో ఉన్న వారికి చేయూత ఇచ్చి ఆదుకోవడమే మానవత్వమని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాణిజ్య పారిశ్రామిక, వాణిజ్య మండళ్ల సమాఖ్య (ఎఫ్టాప్సీ) అధ్యక్షుడు గౌర శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రముఖ సేవాసంస్థ పెద్దిగారి ఫౌండేషన్ వెబ్‌సైట్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ పెద్దిగారి సంతోషి, మీడియా సౌత్ సీఈవో వెంకట్ బులెమాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌర శ్రీనివాస్ మాట్లాడుతూ, పెద్దిగారి ఫౌండేషన్ ద్వారా వితంతువులకు పెన్షన్లు, ప్రతిభ ఉండి చదువుకోలేని వారికి విద్యాభ్యాసం, సామాజిక వివాహాలు నిర్వహించడం గొప్ప సేవా కార్యక్రమాలని ఆయన అన్నారు. తమ తండ్రి పెద్దిగారి రాజలింగం చూపిన బాటలో సమాజ సేవారంగంలో తాము నడుస్తున్నామని ఫౌండేషన్ ట్రస్టీ సంతోషి చెప్పారు. హైదరాబాద్‌లో పాతబస్తీకే పరిమితమైన తమ తండ్రి చేసిన సామాజిక సేవలను గుర్తించిన అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ స్వయంగా తమ ఇంటికి వచ్చి అభినందించారని ఆమె గుర్తు చేసుకున్నారు. తన తండ్రి సేవలను ఇందిరాగాంధీ ప్రశంసించడం తమకు కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని ఆమె అన్నారు. ఎలాంటి ట్రస్టు లేకుండానే గుప్తదానాలు చేస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఆమె చెప్పారు. అయితే 2012లో అధికారికంగా పెద్దిగారి ఫౌండేషన్ ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతిభా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వితంతువులకు స్వయం ఉపాధి కల్పన, వృద్ధులకు మందుల కోసం ఆర్థికసాయం తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఇప్పటిదాకా కేవలం పాతబస్తీలోని కొన్ని ప్రాంతాలకే పరిమితమైన సేవా కార్యక్రమాలను ఈ ఏడాది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నామని సంతోషి తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ అలెర్జీ రిలీఫ్ మాత్రలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఔషధ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లేబరెటరీస్ అలర్జీతో ఉపశమనం పొందడానికి అమెరికా మార్కెట్లో లివోసెట్రిజైన్ డైహైడ్రోక్లోరైడ్ మాత్రను విడుదల చేసినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. 5 మిల్లీగ్రాముల్లో ఉండే ఈ మాత్ర ద్వారా 24 గంటలపాటు అలర్జీతో బాధపడే వారికి ఉపశమనం కలిగిస్తుంది. ఉదాహరణకు కంటి నుండి నీరు కారడం, ముక్కునుండి నీరు కారడం, కంట్లో దురద, ముక్కు దురదతో పాటు తుమ్ముల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. బీఎస్ఈలో దీని షేరు 0.10 శాతం క్షీణించి రూ.2,181 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యింది.

ఎన్ఏసీఎల్‌కు అత్యుత్తమ పురస్కారం

హైదరాబాద్ : ఆగ్రో కెమికల్స్ రంగంలో ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్‌కు అత్యుత్తమ కంపెనీ -2017 సంవత్సరా నికి ఎంపికైంది. ఇంటర్నేష నల్ బ్రాండ్ కన్సెల్టింగ్ కార్పొ రేషన్ (ఐబీసీసీ) యూఎస్ఏ అందజేసింది. కాగా ఐబీసీసీ ప్రతి రంగానికి చెందిన ఒక కంపెనీని ఎంపిక చేసుకొని అవార్డులు ప్రదానం చేస్తుంటోంది. కాగా గత ఏడాదికి ఎన్ఏసీఎల్‌ను అత్యుత్తమ కంపెనీగా ఎంపిక చేసింది. సర్టిఫికేట్‌తో పాటు ట్రోఫీని కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్‌తో పాటు మార్కెట్ ప్రొడక్టు డెవలెప్‌మెంట్ జనరల్ మేనేజర్ ముఖేష్‌గార్గ్‌లు, ముంబైలో 10వ తేదీన జరిగిన ఒకకార్యక్ర మంలో మాజీ బాంబేహైకోర్టు న్యాయమూర్తి అనూప్ మోహతా నుంచి స్వీకరిం చారు.

మెట్రోరైల్ మలిదశకు రూ.400 కోట్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రోరైల్ మలి దశ పనులకుగానూ వచ్చే ఆర్థికసంవత్సరం బడ్జెట్‌లో సుమారు రూ. 400 కోట్లను కేటాయించింది. ప్రస్తుతం జరుగుతున్న మొదటి దశ పనుల్లో మూడు కారిడార్లలో పనులు జరుగుతున్నాయి. అయితే మొదటి కారిడార్ కింద నాగోల్ నుంచి మియాపూర్ వరకు గత నవంబర్ మాసంలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించిన విషయం తెలిసిందే. మిగిలిన రెండు కారిడార్ల పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులను రానున్న జూన్ మాసంలోగా పూర్తి చేయనున్నారు. ఈ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో రెండువందల కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. నగరం నాలుగు దిక్కుల నుంచి మెట్రోరైల్‌ను నడపాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో నే మెట్రోరైల్‌ను నగర శివారులోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి (శంషాబాద్ విమానాశ్రయం)అనుసంధానం చేస్తూ మెట్రో నడపాలని సిఎం కేసీఆర్ సంబంధిత అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాల మేరకు మెట్రోరైల్‌ను విమానాశ్రయం వరకు నడిపేందుకు అవసరమైన ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు.

అన్ని ఫెడరేషన్లకు నిధులిచ్చాం

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఫెడరేషన్లకు నిధులిచ్చామని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీలకు నిధుల కేటాయింపు పెరిగిందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఫెడరేషన్లకు నిధులను కేటాయించామన్నారు. శుక్రవారం ఆయన తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలతో కేసీఆర్ ప్రగతి రథం జగన్నాధుని రథం లాగ సాగుతోందని తాడూరి శ్రీనివాస్ అన్నారు. బీసీలకు బడ్జెట్‌లో సీఎం కేసీఆర్ ఎక్కువ నిధులు కేటాయించారని అన్నారు. వృత్తులను ఆదుకోవాలని, వారికి ఆర్థికసాయం చేయడం కోసం అన్ని ఫెడరేషన్లకు నిధులను కేటాయించారని అన్నారు. బీసీలకు బడ్జెట్‌లో మొదటిసారిగా రూ. 5920 కోట్లు కేటాయించడం హర్షించతగ్గ విషయమన్నారు. బీసీల సంక్షేమంతోపాటు విద్యకు ఇతర ప్రాధాన్యాత రంగాలకు కూడా నిధులను భారీగా కేటాయించారని అన్నారు. బీసీ సంక్షేమానికి కేటాయించిన నిధులను అన్నింటిని ఖర్చు చేస్తామని తాడూరి స్పష్టం చేశారు.

ప్రభుత్వంపై రైతులు తిరగబడాలి




కోదాడ, ప్రభన్యూస్ : మహారాష్ట్రలో నాలుగువేల మంది రైతులు పంటకు గిట్టుబాటు ధర కోసం 200 కిలోమీటర్ల మేర నడిచి అసెంబ్లీ ముట్టడిని చేపట్టి, తమ సమస్యల పరిష్కారం సాధించుకున్నట్లుగా తెలంగాణలోనూ రైతులు టీఆర్ఎస్ ప్రభుత్వంపై తిరగబడాలని, అప్పుడే ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతుందని రాష్ట్ర జేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. శుక్రవారం కోదాడ పబ్లిక్ క్లబ్‌లో జరిగిన వ్యవసాయ సంక్షోభం, రైతాంగ సమాలోచన అనే అంశంపై జరిగిన సమావేశంలో మాట్లాడారు. రైతులు పండించిన పంటకు కనీసం గిట్టుబాటు ధర సాధించే విధంగా చేయడమే తమ లక్ష్యమని, అందుకు సత్యాగ్రహానికైన, అమరణ దీక్షకైన వెనుకాడేదిలేదని, దళారుల వ్యవస్థ వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. గోదావరి, కృష్ణజలాలు సక్రమంగా వాడుకోవడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. రాష్ట్రంలో 35 లక్షల మంది రైతులు ఉంటే, 17 వేల ట్రాక్టర్లు, 30వేల స్ప్రేయర్ మిషన్లు సబ్సిడీపై ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు.

బడ్జెట్‌పై ఎన్ఆర్ఐల హర్షం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఎన్ఆర్ఐ టిఆర్ఎస్ యుకె అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఎన్ఆర్ఐ శాఖకు రూ. 100 కోట్లు కేటాయించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా గల్ఫ్‌లో తెలంగాణ వాసుల కష్టాలు తీర్చేందుకు ఈ బడ్జెట్ ఉపయోగపడే అవకాశం చాలా ఉందన్నారు. గత పాలకులకు ఎన్నారైల పట్ల చిత్తశుద్ధి లేదని, తెలంగాణ ఏర్పడక ముందు ఎన్నారై శాఖ బడ్జెట్ కేవలం రూ. 5 కోట్లు ఉండేదని, వారి సంక్షేమంకోసం చేసిన పనులేవీ లేవన్నారు.

పరీక్షలంటే భయపడవద్దు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: పరీక్షలంటే భయపడకుండా, సాధించగలమే ధీమాతో ముందుకు సాగాలని మాస్టర్ స్పిరిట్ లైఫ్ కోచ్ రచయిత్రి షీలా రామ్ మోహన్ విద్యార్థులకు సూచించారు. ఒత్తిడిక గురికాకుండా ఉంటే ఎటువంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. ఎస్ఎస్‌సి పరీక్షలు ప్రారంభం అయిన నేపథ్యంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసం నలంద విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ రాజా శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకేసారి పలు పనులను చేయడం వలన ఒత్తిడికి గురవుతారని అదే సందర్భంలో పరీక్షలంటే ఒకరకమైన భయం ఉంటుందని వాటిని మెదడు నుంచి తొలగించి ప్రశాంతంగా పరీక్షలను రాయాలని విద్యార్థులకు సూచించారవిద్యార్థులు నిత్యం అభ్యసిస్తూ ఇతర వాటిపై మనసు పోకుండా చూసుకోవాలని నలంద సంస్థల వైస్‌చైర్మన్ శ్రీనివాస్ రాజా అన్నారు.

ఏప్రిల్ 17 నుంచి ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ పరీక్షలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ఓపెన్ స్కూల్ ద్వారా ఎస్ఎస్‌సి పరీక్షలు రాసే వారికి ఏప్రిల్ 17 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మే 1 వరకు పరీక్షలు కొనసాగుతాయని డైరక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా అదే సమయంలో జరుగుతాయని తెలిపారు. పరీక్షలు ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఉంటాయని తెలిపారు.

విద్యార్థినిపై అత్యాచారయత్నం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో విద్యార్థినిపై అత్యాచారయత్నం ఘటన చోటు చేసుకుంది. కొందరు యువకులు ఆమెపై అత్యాచార యత్నానికి ప్రయత్నించారు. సదరు విద్యార్థి ప్రతిఘటించడంతో యువకులు పరారయ్యారు. అయితే, ఒంటరిగా కూర్చున్న జంటపై దాడి చేసిన యువకులు సదరు విద్యార్థినిపై అత్యాచార యత్నానికి ఒడిగట్టినట్లు సమాచారం. అయితే విద్యార్థిని ధైర్యంగా యువకులను ప్రతిఘటించడంతో సదరు యువకులు అక్కడ్నించీ పరారయ్యారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెలుగు భాషాభివృద్ధిపై సమీక్ష

కేంద్ర మానవ వనరులశాఖ అధికారితో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలుగు భాషాభివృద్ధిలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కేంద్రం సత్వర చర్యలు చేపట్టాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యా నాయుడు సూచించారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి రెడ్డి సుబ్రమణ్యంతో ఢిల్లీలోని తన నివాసంలో సమావేశమై కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ సహకారంతో తెలుగు భాషాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై కూలంకషంగా చర్చించారు. మైసూరులోని క్లాసికల్ లాంగ్వేజెస్ సెంటర్‌లోని డైరెక్టర్ పదవి ఖాళీగా ఉందని, దాని నియామకానికి ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి వెంటనే ఆ పదవిని భర్తీ చేయవలసిందిగా ఉప రాష్ట్రపతి ఆయనను కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లేదా తెలంగాణ రాష్ట్రాలలో కూడా ఇలాంటి కేంద్రాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. తక్షణమే ఈ విషయంపై దృష్టిసారిస్తామని రెడ్డి సుబ్రమణ్యం చెప్పారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం మరియు దేశంలో ఇంకొన్ని విశ్వవిద్యాలయాలలో ఉన్నట్టే ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్శిటీలో కూడా తెలుగు భాషా విభాగాన్ని ఏర్పాటు చెయ్యడానికి సాధ్యసాధ్యాలను పరిశీలించాలని, తెలుగు భాషా పరిజ్ఞానంపై ఆసక్తి ఉన్న విద్యార్థులు అధిక సంఖ్యలో ఉండే అవకాశం ఉందని, ఈ విషయంపై వైస్ ఛాన్సలర్‌తో మాట్లాడి ప్రతిపాదనలను సిద్ధం చెయ్యాలని ఉప రాష్ట్రపతి ఆయనకు చెప్పారు. ఈ ప్రతిపాదనపై జేఎన్‌యూ వైస్ ఛాన్సలర్‌తో మాట్లాడతానని రెడ్డి సుబ్రమణ్యం అన్నారు. కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలోని ఎన్.సి.ఇ.ఆర్.టి (నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్) కేంద్రం దక్షిణ భారతదేశానికంతటికీ కలిపి మైసూరులో ఉండగా, తాను మంత్రిగా ఉన్నప్పుడు చొరవ తీసుకుని తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణాలకు గాను ఒక కేంద్రం ఏర్పాటుకు కృషి చేసినట్లు వెంకయ్యా నాయుడు తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఏర్పాటు కానున్న ఈ సంస్థ నిర్మాణ పురోగతిని కూడా కేంద్ర కార్యదర్శితో సమీక్షించారు. భూ సేకరణ విషయంలో కొంత ఆలస్యం జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణను పూర్తి చేస్తే నిర్మాణం ప్రారంభిస్తామని కేంద్ర కార్యదర్శి చెప్పగా, వెంటనే స్పందించిన వెంకయ్య నాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ, అక్కడ భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారాన్ని రాష్ట్ర విద్యాశాఖ చెల్లిచాలా లేక రెవెన్యూ శాఖ చెల్లించాలా అనే విషయం పెండింగ్‌లో ఉందని, రెండు శాఖలను సమన్వయ పరచి త్వరితగతిన భూమిని కేంద్ర మానవ వనరుల శాఖకు బదిలీ చేస్తే మంచిదని అధికారులకు సూచించారు.

వారం రోజుల్లో ఈ విషయాన్ని పరిష్కరించి పనులు ప్రారంభించాలని ఆయన రెడ్డి సుబ్రమణ్యాన్ని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వమే మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. అయినా కొత్తగా ఏర్పాటు చేస్తున్న విశ్వవిద్యాలయమైనందున కేంద్రం నుంచి ఏమైనా సహాయమందుతుందా అని ఉపరాష్ట్రపతి అడగ్గా, సంబంధిత ప్రతిపాదనలు పంపిస్తే కేంద్రం పరిశీలిస్తుందని రెడ్డి సుబ్రమణ్యం వెల్లడించారు. ఏపీలో గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటు, కేంద్రీయ విశ్వవిద్యాలయ ఏర్పాట్లలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి తక్షణమే పరిష్కరించాలని వెంకయ్య నాయుడు సూచించారు. ఈ రెండింటికీ సంబంధించి కేబినెట్ ఆమోదం కోసం నోట్ తయారు చేసిన నోట్‌ను వివిధ మంత్రిత్వ శాఖల అభిప్రాయాల కోసం పంపించినట్లు, ఈ ప్రక్రియ ఈ నెల 26వ తారీఖుతో పూర్తవుతుదని కేంద్ర కార్యదర్శి చెప్పారు. కేబినెట్ ఆమోదం లభించిన వెంటనే గిరిజన విశ్వవిద్యాలయం, కేంద్రీయ విశ్వ విద్యాలయం ఏర్పాటు ప్రక్రియ ముందుకు పోగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయాలపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతోనూ, అలాగే కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్, సంబంధింత అధికారులతోనూ మాట్లాడి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని తదుపరి తన కార్యదర్శి డా. ఐ.వి. సుబ్బారావును ఉప రాష్ట్రపతి ఆదేశించారు. రెండు రోజుల క్రితం దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలలోని తెలుగు ఆచార్యులు ఉప రాష్ట్రపతిని కలిసి తెలుగు భాషాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ప్రశంసిస్తూ పలు సూచనలు చేయడంతో... ఇందుకు కొనసాగింపుగా ఉప రాష్ట్రపతి తదుపరి చర్యలు చేపట్టారు.

టీటీడీ సర్వీసు చార్జీలు తగ్గింపు

తిరుమల, ప్రభన్యూస్: ప్రపంచ ప్రఖ్యాత ధార్మిక సంస్థ టీటీడీ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను విని యోగించుకునే భక్తులకు బుధ వారం నుంచి సర్వీసు చార్జీలు తగ్గా యి. ఆర్జిత సేవలు, వసతి, 300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, ఈ-హుండీ, ఈ- డొనేషన్ తదితర సేవలకు ఈ తగ్గించిన చార్జీలు వర్తిస్తాయి. టీటీడీ అందిస్తున్న ఆన్‌లైన్ సేవ లకు సర్వీసు చార్జీల భారం అధికంగా ఉం దని భక్తుల నుంచి సూ చనలు, పిర్యా దు లు అందాయి. టీటీడీ ఈవో అనిల్ కుమార్‌సింఘాల్ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులతో సంప్రదింపులు జరప డంతో సర్వీసు చార్జీలు తగ్గాయి. ఆన్‌లైన్ సేవ లకు తగ్గించిన చార్జిల వివరాలు ఇలా ఉన్నాయి. క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపు చేస్తున్న భకు ్తలకు సర్వీస్‌చార్జిని 1.5 శాతం నుం చి 0.5 శాతంకు తగ్గించారు. డెబి ట్‌కా ర్డు ద్వా రా చెల్లింపులు చేస్తున్న భక్తు లకు 2000 వేల వరకు ఎలాంటి సర్వీ సు చార్జీలు లేవు. 2000 వేలకు పైన చెల్లింపులు జరిపేవారికి 1 శాతం నుంచి 0.5 శాతా నికి తగ్గించారు. అదే విధంగా నెట్ బ్యాంకింగ్‌ద్వారా చెల్లింపులు చేస్తున్న భక్తులకు సరా సరి రూ॥ 1000 కి రూ॥ 16గా వసూ లు చేస్తుండగా ఇక పై రూ॥ 7 వసూలు చేస్తారు.

నల్లగొండకు భూపాల్‌రెడ్డి, అలంపూర్‌కు మంద జగన్నాధం?

నల్లగొండకు పరిశీలనలో మరిన్ని పేర్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నల్లగొండ, ఆలంపూర్ శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు ఖాయమని భావిస్తున్న టిఆర్ఎస్.. ఎన్నికకు సిద్ధం కావాలంటూ ఆయా జిల్లాల నేతలకు ఇప్పటికే సమాచారం అందించింది. ఈ రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను బలంగా కొట్టి సాధారణ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను కోలుకోలేని దెబ్బతీయాలని, మానసికంగా పోటీకే భయపడే వాతావరణం తీసుకురావాలని టిఆర్ఎస్ యోచిస్తోంది. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇప్పటికే అక్కడ ఇన్‌ఛార్జిగా ప్రకటించిన కంచర్ల భూపాల్‌రెడ్డి పేరు వినిపిస్తుండగా, కోమటిరెడ్డిని బలంగా.. కోలుకోలేని దెబ్బతీయాలంటే అంతకంటే బలమైన అభ్యర్థిని నిలిపితే ఎలా ఉంటుందన్న ఆలోచనలో టిఆర్ఎస్ ఉంది. టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక.. ప్రతి ఎన్నికలో ప్రత్యర్థుల ఊహకందని మెజారిటీతో విజయం సాధించగా.. ఇపుడు నల్లగొండ, ఆలంపూర్‌లలోనూ ఇదే తరహా ఫలితాలు సాధించేవ్యూహంతో ఉంది. పాలేరులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రంగంలోకి దింపిన తరహాలో అనూహ్యంగా బలమైన అభ్యర్థిని దింపే అంశంపై ముఖ్యమంత్రి కెసిఆర్ కసరత్తు చేస్తున్నారు. . నల్లగొండ రాజకీయం ఇప్పటికే హాట్‌హాట్‌గా మారగా, టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపాల్‌రెడ్డి బుధవారం శాసనసభకు వచ్చి.. పలువురు నేతలను కలిశారు. నల్లగొండలో భారీవిజయం సాధించేందుకు మంత్రి జగదీష్‌రెడ్డి కూడా తనదైన శైలిలో వ్యూహరచన చేస్తున్నారు. అభ్యర్థి ఎంపికలోనూ.. ముఖ్యమంత్రి ఎంత సీరియస్‌గా ఉన్నాడనే అంశం స్పష్టమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. పాలమూరు ప్రాంతానికి చెందిన ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని తేలిగ్గానే.. కైవసం చేసుకుంటామని టిఆర్ఎస్ భావిస్తోంది. ఎస్సీవర్గీకరణపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు, ఎస్సీల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల తీరును ప్రస్తావించిన విధానంతో ఎస్సీల ప్రగతి తనతోనే సాధ్యమని తేల్చడం వెనుక ఆలంపూర్ వ్యూహం కూడా ఉందని భావిస్తున్నారు.

ఆలంపూర్ శాసనసభ స్థానానికి మాజీ ఎంపీ మందజగన్నాధం పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆయన కుమారుడి పేరు కూడా పార్టీ పరిశీలనలో ఉంది. ఈ రెండు స్థానాలను పాలేరు వ్యూహంతోనే.. బలంగా కొట్టాలని టిఆర్ఎస్ యోచిస్తున్నారు. నేతల ఊహకు అందకుండా పకడ్బందీ వ్యూహాలు రచించే సిఎం కెసిఆర్.. ఈ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి వ్యూహం ప్రకటిస్తారోనన్న ఉత్కంఠ నెలకొంది.

పాత వాహనాల రద్దుపై కసరత్తు

● జాబితాను సిద్ధం చేస్తున్న రాష్ట్ర అధికారులు ● వాహనాల జీవిత కాలం 20 ఏళ్లుగా నిర్ధారణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పాతబడిన వాణిజ్య వాహనాలను రోడ్లపై తిరగనివ్వరాదని కేంద్ర ప్రభుత్వం భావించింది. 2020 నాటికి ఈ నిర్ణయం అమలులోకి రాబోతుంది. పాత వాణిజ్య వాహనాల యజమానులకు కొంత మొత్తం పరిహారం చెల్లించేవిషయం కూడా కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. దేశ వ్యాప్తంగా రద్దు కాబడే వాహనాలు 7 లక్షల వరకు ఉంటాయని భావిస్తున్నారు వాణిజ్య వాహనాల జీవిత కాలాన్ని 20 ఏళ్లుగా నిర్ణయించారు. వ్యక్తిగత వాహనాలకు ఎలాంటి వయస్సు నిర్ణయించలేదు. ప్రైవేటు వాహనాలు ఫిట్‌నెస్ పరీక్షలో ప్రమాణాల మేరకు ఉన్నట్లు నిర్ధారించబడిన పక్షంలో కొంత కాలం పాటు నడిపించుకొనే వెసులుబాటు ఉంటుంది. ఇప్పటికే ఢిల్లీలో 10 ఏళ్లపై బడిన వాణిజ్య వాహనాలను రద్దు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 15 ఏళ్ల పై బడిన పాత వాహనాలను రోడ్డెక్కనీయరాదని గతంలో పోలీసులు, కాలుష్య నియంత్రణ మండలి నిర్ణయించాయి. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకొనవలసి ఉంటుంది.

దాదాపు 2000ల సంవత్సరం కంటే ముందే రిజిస్ట్రేషన్ చేయబడిన డీజిల్ వాణిజ్య వాహనాలను 2020 తర్వాత రోడ్ల పై తిరగనివ్వరాదని కేంద్రం సూత్ర ప్రాయంగా నిర్ణయం తీసుకుంది. కండీషన్‌లో ఉన్న వాహనాలు, నిర్దిష్ట ప్రమాణాల మేరకు ఫిట్‌నెస్ ధృవీకరణ కలిగిన డీజిల్ వాణిజ్య వాహనాల విషయంలో గడువు పొడిగించే అవకాశం ఉందని తెలిసింది. పూర్తిగా పాతబడిపోయి, ఎక్కువగా కాలుష్యం వెదజల్లుతూ, ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉన్న డీజిల్ వాణిజ్య వాహనాలను తొలి దశలోనే రద్దు చేయడానికి చర్యలు తీసుకొనే అవకాశం ఉందని రవాణా అధికారులు తెలిపారు. తెలంగాణలో 20 ఏళ్లకు పైబడిన వాహనాల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. కేంద్రం కోరిన వెంటనే వివరాలు అందచేసేందుకు సిద్ధమవుతున్నారు. కాలం చెల్లిన వాహనాలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే అధికంగా ఉంటాయని ఆర్టీఏ అధికారులు తెలిపారు. కొన్ని వాహనాలు సరకు రవాణాలో భాగంగా దేశమంతటా తిరుగుతున్నా యన్నారు. ఇటీవలి కాలంలో 15 ఏళ్ల పైబడిన కాలుష్యం వెదజల్లే వాణిజ్య వాహనాలను గ్రేటర్ పరిధిలో తిరగనివ్వరాదని భావించారు. 2000ల సంవత్సరం తర్వాత కాలుష్య రహి తంగా భారత్ వన్, భారత్ టూ, భారత్ త్రీ, ఇప్పుడు భారత్ ఫోర్ వాహనాలు తయారు చేయబడుతున్నాయి. ఈ వాహనాలు కాలు ష్యం పెద్దగా వెదజల్లవని, ప్రమాణాల మేరకు ఇంజన్‌లను రూపొందించడం జరిగిం దని అధికారులు పేర్కొన్నారు. 2000ల సంవత్సరానికి ముందు తయారు చేయబడిన వాణిజ్య వాహనాలు పెద్దగా కాలుష్యం వెదజల్లే అవకాశం ఉందన్నారు. డీజిల్ ఇంజన్ కలిగి ఉన్న అన్ని వాణిజ్య వాహనాలకు ఫిట్‌మెంట్ తప్పనిసరి అని తెలిపారు. అలాంటి వాహనాలను రద్దు చేయడం అనివార్యం అని కేంద్ర ప్రభుత్వం భావించింది. పెద్ద మొత్తంలో కాలుష్యం వెదజల్లే పాత వాహనాలను రోడ్లపై తిరగనీయకుండా కీలక నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. కాలం చెల్లిన వాహనాలను నియంత్రించడానికి వాహన జీవత కాలం 20 ఏళ్లకు పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా 2000ల సంవత్సరానికి ముందు రిజిస్ట్రేషన్ చేయించబడిన వాణిజ్య వాహ నాలు, ట్యాక్సీలు, ట్రక్కులు, బస్సులు 2020 తర్వాత రోడ్లపై తిరగకుండా నిషేధం విధించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం జరిగిందని, త్వరలోనే ప్రభుత్వ నిర్ణయం వెలువడే అవకాశం ఉందన్నారు.

రిజిస్ట్రేషన్లు భేష్

● రాబడి జోష్ ● లక్ష్యాన్ని అధిగమించిన ఆదాయం ● ఖజానాకు రూ.4 వేల కోట్ల పైచిలుకు ఆదాయం ● 18.56 శాతం వృద్ధిరేటు

ఆంధ్రప్రభ, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం స్థూల ఆర్థిక వృద్ధిలో అపూర్వ ప్రగతి దిశగా అడుగులు వేస్తోంది. ఒక్కో రెవెన్యూ రాబడి శాఖ క్రమంగా అంచనాలను మించి ఆదాయాన్ని ఖజానాకు చేరవేస్తుండటంతో ఆర్థిక ప్రగతి క్రమంగా పుంజుకుంటోంది. ఈ నేపథ్యంలో 18.6 శాతం వనరుల రాబడి వృద్ధిని సర్కార్ అంచనా వేసుకుంది. రాబడి శాఖల్లో కీలకమైన వాణిజ్య పన్నులు, అబ్కారీ శాఖలతోపాటు తాజాగా స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ కూడా గణనీయమైన వృద్ధిరేటుతో ముందుకు సాగుతోంది. నిర్దేశిత లక్ష్యసాధనను అధిగమించి భారీ రాబడిని ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో నమోదు చేసుకుని రికార్డు సృష్టించింది. వార్షిక ఏడాది చివరి నాటికి 18.56 శాతం వృద్ధిరేటును నమోదు చేసుకుని దాదాపు రూ. 4వేల కోట్లను ఆర్జించింది. అయితే ముగుస్తున్న ఆర్థిక ఏడాది వార్షిక లక్ష్యం రూ. 3వేల కోట్లే కావడం గమనార్హం.రాబడి ఊపు కొనసాగిస్తున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక ఏడాది 2018-19 లక్ష్యం రూ. 4699కోట్లకు ప్రభుత్వం పెంచింది.

కఠిన నిబంధనలను అధిగమిస్తూ...

నోట్ల రద్దు, జీఎస్టీ అమలుతోపాటు రూ. 2లక్షలకు మించిన నగదు లావాదేవీలపై కేంద్రం కఠిన నిర్ణయాలతో రిజిస్ట్రేషన్‌శాఖ ప్రస్తుత ఆర్థిక ఏడాది ఆరంభంలో కుదేలయింది. దీంతో నిర్దేశిత రూ.3వేల కోట్ల లక్ష్యం చేరిక కష్టమనే ప్రభుత్వం భావించింది. కానీ ఆ తర్వాత కొత్త జిల్లాలు, మండలాలు,రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో రియల్ రంగంలో బూమ్ వచ్చింది. దీంతో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ధీటుగా అన్ని జిల్లాల్లో భూములకు దశ తిరిగింది. క్రయవిక్రయాల జోరు పెరగడం, మార్కెట్ ధరకంటే వాస్తవ ధరలకు ప్రజలు తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో భారీగా రాబడి పెరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలు, నూతన ఐటీ పాలసీ, ఐటీఐఆర్, ఫార్మాహబ్, ఇతర పరిశ్రమల ఏర్పాటు ముమ్మరం కావడంతో రియల్ రంగంతోపాటు, స్థిరాస్తుల క్రయవిక్రయాలు జోరందుకున్నాయి.

రియల్ ఊపు...

తెలంగాణలో రియల్ వ్యాపార నిర్వహణకు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి పెట్టుబడులు తరలి వస్తున్నాయని ఆర్థిక శాఖ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోనైతే క్రయ విక్రయాలకు రెక్కలు వచ్చాయని చెప్పుకోవచ్చు. అదే విధంగా యాదగిరిగుట్ట, వరంగల్ జాతీయ రహదారి పెట్టుబడి దారులకు కాసుల పంట పండిస్తోంది. మహేశ్వరం, ఇబ్రాహీంపట్నంలలో కూడా ఐటీఐఆర్ కారణంగా రియల్ రంగం అద్భుత ప్రగతి సాధిస్తోంది. రాచకొండ, యాదాద్రిలు నల్గొండ జిల్లాకు కలిసి వస్తుండగా, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లకు ఫుడ్ పార్క్ కారణంగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. అక్టోబర్ వరకు గతేడాదితో పోలిస్తే లోటులోనే కొనసాగిన రిజిస్ట్రేషన్ ఆదాయం నవంబర్‌నుంచి భారీగా పెరిగింది. ఏప్రిల్ మాసంలో -9.41 లక్ష్యసాధన లోటుతో రూ. 274కోట్లురాగా, మే నెలలో -26.67 లోటుతో రూ.284కోట్లు, జూన్‌లో 8.06 వృద్ధితో రూ.339కోట్లు, జూలైలో 23.82 వృద్ధిరేటుతో రూ. 368కోట్లు, ఆగష్టులో -27.61శాతం లోటుతో రూ.243కోట్లు, సెప్టెంబర్‌లో 9.37 వృద్ధితో రూ.330కోట్లు, అక్టోబర్‌లో 11.21శాతం వృద్ధితో రూ.359కోట్లు, నవంబర్‌లో 31.77 శాతం వృద్ధితో రూ.359కోట్లు, డిసెంబర్‌లో 79శాతం వృద్ధిని సాధించి రూ. 400 కోట్లను ఆర్జించగా జనవరిలో 109 శాతం అదనపురాబడితో రూ.367 కోట్లు, ఫిబ్రవరి మాసంలో 88 శాతం పెరుగుదలతో రూ. 88కోట్లను ఆర్జించింది.

వెంకయ్యకు తప్పిన ముప్పు!

హైదరాబాద్/చెన్నై, ఆంధ్రప్రభ : చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో బాంబు కలకలం..సిబ్బందిని పరుగులు పెట్టించింది. వీవీఐపీల రాక కోసం ఎదురుచూస్తున్న అధికారులకు చెమటలూ పట్టేలా చేసింది. విమానాశ్రయంలో బాంబు పేలబోతోందంటూ వచ్చిన బెదిరింపులతో అప్పటికప్పుడు హై అలర్ట్ ప్రకటించారు. ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ చెన్నై వస్తున్న సమయంలో జరిగిందీ ఉదంతం. హైదరాబాద్ నుంచి చెన్నై బయలుదేరిన విమానంలో బాటిల్ బాంబు ఉందని, చెన్నై ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కాగానే పేలిపోవడం ఖాయమని గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే, అటువంటిదేమీ లేదని తేలడంతో.. ఊపిరి పీల్చుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పెద్దల్ని టార్గెట్‌గా చేసుకుని దాడులు జరగవచ్చన్న ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో ఇటువంటి ఫేక్ కాల్స్.. మరింత ఇరకాటంలో నెట్టేస్తున్నాయి.

మాయమవుతున్న గొర్రెలు

వనపర్తి ,ప్రభన్యూస్: ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ రాయితీపై 21జీవాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది.. లబ్ధిదారులు రాయితీ గొర్రెలను పెంచి వాటి పిల్లలను మాత్రమే విక్రయించాలి. తెలంగాణ రాష్ట్రం మాంసం ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్న మాటలు వనపర్తి జిల్లాలో మాత్రం దానికి విరుద్ధంగా సాగుతోంది.వాటిని ఇతర ప్రాంతాలకు విక్రయిస్తూ పథకం లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

రాష్ట్రం మాంసం ఎగుమతి చేసే స్థాయికి ఎదగడంతోపాటు గొల్లకురువ యాదవులు ఆర్థికంగా ఎదగాలని తలంచి రాయితీ గొర్రెల పథకం రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.వనపర్తి జిల్లాలో 196 గొర్రెల సహకార సంఘాలలో దాదాపు 10వేల మంది సభ్యులున్నారు.జిల్లాలో మొదటి విడతలో 11,884 మందికి 75శాతం రాయితీపై 2.42 లక్షల గొర్రెలను పంపిణీ చేసేందుకు జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.ఎంపికైన లబ్ధిదారుడు తన వాటా కింద రూ.32,750 చెల్లించాలి.రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కింద ఒక్కో యూనిట్‌కు రూ.93,320 చెల్లిస్తుంది.మొత్తం రూ.1.25 లక్షలతో 21జీవాలను లబ్దిదారులకు పంపిణీ చేస్తుంది.

పక్కదారి పడుతున్న రాయితీ గొర్రెల పథకం.....

వనపర్తి జిల్లాలో పథకం పక్కదారి పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.కొందరు దళారులు, మాంసం వ్యాపారుల కన్ను రాయితీ గొర్రెలపై పడింది.ఏయే గ్రామంలో ఎంతమందికి రాయితీ గొర్రెలు ఇచ్చారన్న వివరాలను సేకరిస్తున్నారని పలువురు అంటున్నారు.దళారులు నేరుగా లబ్ధిదారులను కలుస్తు పంపిణీ చేసిన గొర్రెలు ఇక్కడి వాతావరణానికి సరిపోవనిఎక్కువ రోజులు ఉంచుకుంటే చనిపోతాయని చెబుతూ వల విసురుతున్నారు.


చల్లబడిన వాతావరణం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అరే బియా సముద్రంలో ఏర్ప డిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతల్లో భారీ మార్పు సంభవించింది. ఎండల తీవ్రత సాధారణం కంటే 2 డిగ్రీలు తగ్గింది. కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణం ఒక్క సారిగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆకాశం మేఘా వృత్తమై కనిపించింది. నగరంలో చాలాచోట్ల చిరు జల్లులు పడ్డాయి. కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, మణి కొండ ఏరియాల్లో తేలికపాటి వర్షం కురిసింది. రాష్ట్ర వ్యాప్తంగా శని, ఆది వారా ల్లో కూడా ఉరు ములు, మెరు పులతో చిరు జల్లులు పడే అవకావం ఉన్నట్టు హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

చెన్నై-ముజఫర్‌పూర్ మధ్య ప్రత్యేక రైలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ నెల 18న చెన్నై సెంట్రల్ నుండి ముజఫర్‌పూర్ వరకు ప్రత్యేక రైలును నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. మార్గ మధ్యలోని గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, ఖమ్మం, వరంగల్, రామగుండం తదితర స్టేషన్‌లో ఈ రైలును నిలుపుదల చేయడం జరుగుతుందని వెల్లడించారు.సికింద్రాబాద్ - దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును శారదాదేవి మందిరంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మెహర్ రైల్వే స్టేషన్‌లో రెండు నిమిషాల పాటు నిలుపుదల చేయడం జరుగుతుందని మరో ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18 నుండి 31 వరకు మెహర్ స్టేషన్‌లో నిలుపుదల చేస్తున్నందున భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.దక్షిణ మధ్య రైల్వేలో పని చేస్తునన బి. వినోద్ బాబు రైల్వేస్ సాంస్కృతిక పోటీల్లో అత్యుత్తమ బహుమతిని పొందారు. వినోద్ బాబు మంచి గాయకులు, నంది అవార్డు గ్రహిత కూడా. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ ఆయనను రైల్ నిలయంలో అభినందించారు.

టీఎన్‌టీఎఫ్ అధ్యక్షునిగా మల్లారెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలం గాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడ రేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా డి మల్లారెడ్డి ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. రవీం ద్రభారతిలో జరిగిన టియుటిఎఫ్ రాష్ట్ర మహా సభల్లో మల్లారెడ్డిని రాష్ట్ర అధ్యక్షులుగా ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వర కు ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొన సాగారు. ప్రధాన కార్యదర్శిగా ఆది లాబాద్‌కు చెందిన టి లచ్చి రాంను ఎన్నుకున్నారు. కొత్త కమిటీ రెండు సంవత్సరాలపాటు 2020 వరకు కొన సాగనుంది. సహా ధ్యక్షులుగా జి స్వర్ణలత, ఎన్ రాజే శ్వరరావు, సంయుక్త కార్య దర్శులుగా ఎన్ రవీం దర్, కె శౌరి అసంతీన ట్రెజ రర్‌గా యు విఠల్ గౌర వాధ్యక్షులుగా బి దేవన్న, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి సత్యనారాయణరెడ్డి ఎన్ని కయ్యారని సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి మల్లారెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు.

నిధులు తక్కువ ప్రచారం ఎక్కువ

●కేటాయింపులపై చిన్నచూపు ●ఇబ్బందుల్లో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ●రాష్ట్రంలో విస్తరిస్తున్న ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ● ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్లలో మందులు కరువు ●హైదరాబాద్, మెదక్, నల్లగొండ,సిరిసిల్ల జిల్లిలో ఎక్కువ ●ఆదిలాబాద్,వరంగల్‌లో తక్కువ మంది వ్యాధిగ్రస్తులు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎయిడ్స్ వ్యాధి చాపకింద నీరులా రాష్ట్రంలో విస్తరి స్తోంది. ఎన్ని ప్రచార కార్యక్రమాలు నిర్వహించినా వ్యాధి గ్రస్తులు మాత్రం పెరుగుతూనే ఉన్నారు. కేంద్రం ఇచ్చే బడ్జెట్ కేటాయింపులు కూడా తక్కువగా ఉండడం వలన సిబ్బందికి జీతాల చెల్లింపుతో పాటు ప్రచార కార్యక్ర మాల నిర్వహణ సరిగ్గా నిర్వహించలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతోపాటు మందుల పంపిణీ క ూడా సక్రమంగా లేకపోవడంతో ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్లలో మందుల కొరతతో వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బం దులు చెందుతున్నారు.

తెలుగురాష్ట్రాల్లో వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువ

తెలుగురాష్ట్రాల్లో వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు ఓ సర్వేలో తేలింది. ప్రస్తుతం మన రాష్ట్రంలో లక్షకు పైగానే వ్యాధిసోకిన వారు ఉన్నట్టు తెలిసింది. అందులో 45 వేల మంది హెచ్ఐవీ సోకిన వారు ఉన్నారు. 25 వేల మంది ఆరునెలలకోసారి పరీక్షలు నిర్వహించుకోవడంతో పాటు మెడిసిన్‌ను వాడుతున్నారు. మరో 30 వేల మంది వ్యాధితో చనిపోయినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు గాంధీ, ఉస్మానియా ఆస్పత్రిలో వ్యాధిగ్రస్తులు చికిత్సను అందించేవారు. అప్పటి రికార్డుల ప్రకారం చాలామంది మిగతా రాష్ట్రాల వారు ఇక్కడకు మెడిసిన్‌తో పాటు చికిత్స నిమిత్తం వచ్చినట్టు అధికారులు పేర్కొంటున్నారు. అప్పట్లో వ్యాధిగస్తుల సంఖ్య 3 లక్షల వరకు ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రం విడిపోయిన తరువాత పేషెంట్ల సంఖ్య కూడా తగ్గినట్టు అధికారులు పేర్కొంటున్నారు. కొత్త గణాంకాల ప్రకారం లక్షకు పైగా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. కొందరు వ్యాధిగ్రస్తులు తమ పేరు బయటపడుతుందన్న భావనలో ఆయుర్వేదం, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది. ఎక్కువగా వ్యాధిగ్రస్తుల్లో వలస జీవనం సాగించే వారు ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

2030 సంవత్సరం నాటికి ఎయిడ్స్ రహిత దేశంగా..

మెదక్, నల్లగొండ, హైదరాబాద్‌లలో ఎయిడ్స్ కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. కొత్త జిల్లాల వారీగా చూస్తే సిరిసిల్ల, సంగారెడ్డి, జగిత్యాల, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని అధికారులకు అంచనాకు వచ్చారు. ఒకపక్క 2030 సంవత్సరం నాటికి ఎయిడ్స్ రహిత దేశంగా మార్చాలని కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తుండగా అందుకు భిన్నంగా తెలుగురాష్ట్రాల్లో ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోందని స్వచ్ఛందసంస్థల వారు ఆందోళన చెందుతున్నారు. ఎయి డ్స్ సోకిన వారు దానికి తగ్గట్టుగా మందుల వాడక పోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తుండ డంతో వ్యాధి ముది రి మృతిచెందుతు న్నట్టు అధికారులు పేర్కొ ంటు న్నారు. వరంగల్, ఆది లాబాద్ పాత జిల్లాల్లో ఈ వ్యాధి గ్రస్తులు తక్కు వగా ఉన్న ట్లు అధికారులు పేర్కొం టున్నాయి.

ఎప్పటికపుడు ఫోన్లకు సమాచారం

మనరాష్ట్రంలో అందుబాటులో ఉన్న మందుల వలన ఎయిడ్స్ వ్యాధి సోకినా కొన్ని సంవత్సరాలు వారి జీవితాన్ని కొనసాగించేలా ఆ మందులు పనిచేస్తున్నాయి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులను సమకూర్చారు. వ్యాధిగ్రస్తుల వివరాలను బయటకు చెప్పకుండా వారికి నెలనెలా మందులను తీసుకునేలా ఎప్పటికప్పుడు వారి ఫోన్లకు సమాచారం అందించే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కొందరు రెగ్యులర్ నెలకోసారి మందుల కోసం ఐసీటీసీ, ఏఆర్‌టీల్లో మందులను తీసు కోవడానికి వస్తుంటారు. అయితే చాలాచోట్ల మందుల కొరత వేధిస్తున్నట్టు తెలుస్తోంది. అరకొర కేటాయింపు నిధులతో పాటు మందుల పంపిణీ కూడా ఎక్కువగా లేకపోవడం వ్యాధిగ్రస్తులకు భారంగా మారింది.

పుట్టబోయే పిల్లలు సేఫ్

గర్భిణులు ఒకవేళ ఈ వ్యాధిబారిన పడితే వారికి పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధి సోకకుండా మందులు ఉన్నాయి. ఈ మందులను వాడడంతో పాటు డాక్టర్ల సూచనలు, సలహాలను పాటిస్తే పుట్టబోయే బిడ్డ క్షేమమని వైద్యులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐసీటీసీ సెంటర్లు 183 ఉండగా, ఏఆర్టీ సెంటర్లు 22 ఉన్నాయి. ఈ వ్యాధిగ్రస్తుల కోసమే ఇవి పనిచేస్తున్నాయి. వీటితో ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో మందులను అందుబాటులో ఉంచుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనే వ్యాధిగ్రస్తులు ఎక్కువ

కొత్తగా నమోదయ్యే కేసుల్లో గ్రామీణ ప్రాంతాల వారు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. పట్టణ ప్రాంతాలు దీనికన్నా కొంతమేర బెటర్ అని అధికారులు పేర్కొంటు న్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే మందులు అన్ని ఉచితం. వీటికితోడు శక్తివంతమైన మందులను ప్రభుత్వం అందజేస్తోంది. నిర్ధారణ పరీక్షలు కూడా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా నిర్వహిస్తోంది.

ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ చికిత్స

నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వద్ద ఉన్న డేటాలో పూర్తి స్థాయిలో కేసుల సంఖ్య లేదన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. కొందరు ఈ వ్యాధిసోకిన వారు చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తుండడంతో వారి వివరాలు ప్రభుత్వ వద్ద నమోదు కావడం లేదు. ప్రైవేటు వద్ద నమోదయిన వివరాలు ప్రభుత్వానికి నివేదించాలని ఉన్నా ప్రైవేటు ఆస్పత్రులను పెడచెవిన పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హైరిస్క్ గ్రూపుల్లో ఉన్న వారి సంఖ్య ఎక్కువే

న్యాకో లెక్కల ప్రకారం రాష్ట్రంలో హైరిస్క్ గ్రూపుల్లో ఉన్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తు తం హైటెక్ వ్యభిచారం కూడా ఈ వ్యాధి విస్తరించడానికి కారణంగా తెలుస్తోంది. అంతా ఫోన్‌లోనే మాట్లాడుకొని హైటెక్ వ్యభిచారం నిర్వహిస్తుండడంతో వీరిని ఎలా గుర్తించాలి, వీరికి ఎలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్న దానిపై స్వచ్ఛందసంస్థలు కుస్తీ పడుతున్నాయి. పోలీసులు పట్టుకున్నప్పుడు తప్ప ఫలానా వారు వేశ్యావృత్తిలో ఉన్నట్టు గుర్తించలేకపోతున్నారు. వీరితో పాటు స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్స్ కూడా ఈ వ్యాధిబారిన పడుతున్నట్టు అధికారుల, స్వచ్ఛంద సంస్థల లెక్కలు చెబుతున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా 850మంది ఉద్యోగులు

రాష్ట్ర వ్యాప్తంగా 850 మంది ఉద్యోగులు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ కింద పనిచేస్తున్నారు. కేంద్రం ఇచ్చే బడ్జెట్ చాలా తక్కువగా ఉంది. దీనివల్ల ప్రచారంతో పాటు జీతాల చెల్లింపునకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఏపీ, తెలంగాణ ఉమ్మడిగా ఉన్నప్పుడు నిధులు ఎక్కువగా కేటాయించేవారు. ప్రస్తుతం విడిపోయినప్పటి నుంచి 35 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తోంది. వ్యాధిగ్ర స్తుల్లో తమిళనాడు, ఏపీ, తెలంగాణలు ముం దు స్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా న్యాకో ఆధ్వర్యంలో 400-500 స్వచ్ఛందసంస్థలు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి పనిచేస్తున్నాయి. మనరాష్ట్రంలో 53 సంస్థలు పనిచేస్తున్నాయి. ఒక్కో సంస్థలో 10 మంది వరకు వలంటీర్లు పనిచేస్తారు.

వ్యాధిని గుర్తించే 5 అధునాతన యంత్రాలు త్వరలో తెలంగాణకు



డాక్టర్ ప్రీతీమీనా, ఐఏఎస్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, పీడీ

కేంద్ర ప్రభుత్వం గైడ్‌లైన్స్ ప్రకారం డీ-4 కౌంట్ తక్కువగా ఉంటే మెడిసిన్ ఎక్కువగా తీసుకోవాలి. కౌంట్ తక్కువగా కావడం వలన మనిషిలోని ఇమ్యూనిటీ తగ్గుతుంది. రోగనిరోధక శక్తిని పెంచడానికి మందులు అందుబాటులో ఉన్నాయి. అవగాహన లేకపోవడంతో చాలామంది ఈ వ్యాధిగ్రస్తులు మృతిచెందుతున్నారు. వ్యాధిని గుర్తించడానికి అధునాతన యంత్రాలు (వైరల్ లోడ్ మిషన్లు) న్యాకో త్వరలోనే రాష్ట్రానికి పంపించ నుంది. ఆ యంత్రం వలన వ్యాధిగ్రస్తులను తొందరగా గుర్తించవచ్చు. గతంలో అయితే 4-5 పరీక్షలు చేయాల్సి వచ్చేది. ఈ యంత్రాల ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంజీఎం (వరంగల్) తదితర ఆస్పత్రులకు ఈ మిషన్లను అందజేస్తాం.

రామసేతును రక్షిస్తాం

●సుప్రీంకోర్టుకు వెల్లడించిన కేంద్రం



న్యూఢిల్లీ: భారతదేశం, శ్రీలంక మధ్యనున్న రామసేతుకు ఎటువంటి నష్టం జరగబోదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రభుత్వం రామసేతును తొలగించబోదని, దాని పరిరక్షణకు సహకరిస్తుందని స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య సేతు సముద్రం కెనాల్ ప్రాజెక్టును అమలుచేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తామని పేర్కొంది. కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో 'దేశ ప్రయోజనాల దృష్ట్యా ఆడమ్స్ బ్రిడ్జ్/రామసేతుకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా సేతుసముద్రం షిప్ చానల్ ప్రాజెక్టుకు ఇంతకుముందు చేసిన ఏర్పాట్లకు ప్రత్యామ్నాయాన్ని అన్వేషించాలని భారత ప్రభుత్వం భావిస్తోంద'ని పేర్కొంది. రామసేతుపై నిర్ణయం తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గత నవంబర్‌లో సమయం మంజూరు చేసింది. రామసేతును ధ్వంసం చేసి సేతు సముద్రం ప్రాజెక్టును నిర్మిస్తారా? ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చెప్పాలని సుప్రీం కోరింది.రామసేతు విషయంలో మతపరమైన విశ్వాసాలు ఉన్నందున ప్రాజెక్టు కట్టకూడదని, దానికి జాతీయ వారసత్వ హోదా ఇవ్వాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేయగా, కేసు విచారణ కొనసాగుతోంది.

తన వ్యాధిని వెల్లడించిన ఇర్ఫాన్‌ఖాన్

న్యూరో ఎండోక్రిన్ ట్యూమర్



ముంబై: ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్ ఖాన్ తన వ్యాధి గురించి శుక్రవారం వెల్లడించారు. తనకు నాడీ సంబంధమైన అంతఃస్రావి గ్రంథిలో ట్యూమర్ (న్యూరో ఎండోక్రిన్ ట్యూమర్) ఉందని, ఇది అత్యంత అరుదైనదని పేర్కొన్నారు. ఈ వ్యాధి చికిత్స కోసం విదేశాలకు వెళుతున్నట్లు కూడా చెప్పారు. ఇర్ఫాన్ తన అధికారిక ట్విటర్ పేజీలో పోస్ట్ చేశారు. అత్యంత అరుదైన వ్యాధితో ఇర్ఫాన్ బాధపడుతున్నారని, అదొక క్యాన్సర్ అంటూ విపరీతమైన ఊహాగానాలతో ప్రచారం జరిగిందని, న్యూరో బ్రెయిన్‌కు సంబంధించినది మాత్రమే ఉండబోదని తెలిపారు. అయితే, ఈ వ్యాధి గురించి పూర్తిగా తనకూ తెలియదని, 10 రోజుల్లో వివరాలను వెల్లడిస్తామని, దీనిపై వేరే ప్రచారం చేయొద్దని తెలిపిన విషయం విదితమే. అన్న ప్రకారం ఆయన తన ట్విటర్ ఖాతా ద్వారా విషయాన్ని వెల్లడించారు.విదేశాలకు చికిత్స కోసం వేళుతున్నట్లు ప్రకటించిన ఇర్ఫాన్ 'నా చుట్టూ ఉన్నవారి ప్రేమ, బలం నన్ను కొత్త ఆశలోకి తీసుకొచ్చాయి. నన్ను దేశం వెలుపలికి తీసుకెళుతోంది. మీ అందరి దీవెనలు నాకు పంపిస్తూనే ఉండండి. మరిన్ని విషయాలు చెప్పేందుకు తిరిగొస్తానని ఆశిస్తున్నాన'ని పేర్కొన్నారు.

న్యూరో ఎండోక్రిన్ ట్యూమర్ అంటే ఏమిటి?

నాడీకి సంబంధించిన కణితి(ట్యూమర్) వేగంగా లేదా నెమ్మదిగా లేదా ఊహించని విధంగా పెరగొచ్చు. శరీరంలోని ఇతర భాగాలకు కూడా పాకొచ్చు. చాలామందికి దీని లక్షణాలు అంత త్వరగా తెలియవు. గుర్తించలేరు. ఏదైనా ఘటన జరిగి దాని ద్వారా పరీక్షలు చేస్తే బయటపడుతుంది. చర్మం కందిపోయినట్లుగా కనిపించడం, లేదా రక్తంలో షుగర్ లెవల్స్ అమాంతం పెరిగిపోవడం జరుగుతాయి. ఇక వైద్యం అనేది కణితి తీవ్రతను బట్టి ఉంటుంది. రేడియేషన్ లేదా కీమోథెరపీ ద్వారా మాత్రమే చికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది.

సయీద్ సంస్థ నిషేధంపై లాహోర్ హైకోర్టు ఆదేశం

లాహోర్: ముంబాయి దాడుల ప్రధాన సూత్రధారి హఫీజ్ సయీద్‌కి చెందిన జమాత్ ఉద్ దవా (జేయూడీ)ని,దాని ధార్మిక విభాగాన్ని ఎందుకు నిషేధించారో పదిహేను రోజులలోగా వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పాక్ ప్రభుత్వాన్ని లాహోర్ హైకోర్టు ఆదేశించింది. తన సంస్థలను పాక్ ప్రభుత్వం నిషేధించడాన్ని,బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడాన్ని సవాల్ చేస్తూ సయీద్ లాహోర్ కోర్టులో తన తరఫు న్యాయవాది ఎకె డోగార్ ద్వారా పిటిషన్ దాఖలు చేశారు.తమ సంస్థలను నిషేధిస్తూ ఫిబ్రవరి 10వ తేదీన ఫెడరల్ ప్రభుత్వ హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వును కొట్టి వేయాని ఆయన ఆ పిటిషన్‌లో కోరారు.దానిపై విచారణ జరిపిన లాహోర్ హైకోర్టు మార్చి 29నాటికి అఫిడవిట్ ని దాఖలు చేయాల్సిందిగా ఫెడరల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. జేయూడి అనుబంధ ధార్మిక సంస్థ అయిన ఫలేహ్-ఏ-ఇన్సానియత్ అనేక ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తోందనీ, ఇంతవరకూ 72 వేల మందికి సాయాన్నిఅందించిందని సయీద్ ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ సంస్థకు ఉగ్రవాద సంస్థలతో సంబంధం లేదని కూడా ఆయన పేర్కొన్నారు.దానిపై స్పందించిన కోర్టు మార్చి 29వ తేదీ నాటికి అఫిడవిట్ సమర్పించాల్సిందిగా ఫెడరల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.


వర్క్ పర్మిట్ నిబంధన కొనసాగించండి

వాషింగ్టన్: హెచ్1 బీ వీసా దారుల భార్యలు కూడా చట్టబద్ధంగా అమెరికాలో ఉద్యోగాలు చేసుకోవడానికి అనుమతి ఇస్తూ బరాక్ ఒబామా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వర్క్ పర్మిట్ నిబంధనను కొనసాగించాల్సిందిగా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు సిలికాన్ వ్యాలీకి చెందిన ఆరుగురు డెమోక్రాట్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. బరాక్ ఒబామా ఈ నిబంధనను 2005లో తీసుకుని వచ్చారు.ఈ నిబంధన వల్ల భారత అమెరికన్లకు ఎక్కువ ప్రయోజనం కలుగుతోంది.లక్షా నాలుగువేల మంది పైగా హెచ్ -1 బీ వీసా దారులు ఈ నిబంధన వల్ల ప్రయోజనం పొందుతున్నారని కాంగ్రెస్ సభ్యులు అన్నా ఎషో,జోయి లాఫ్‌గ్రాన్,రోఖన్నా, మార్క్ డెసోల్నర్ ప్రభృతులు ట్రంప్‌కి సంయుక్తంగా ఒక లేఖ రాశారు. వీరిలో చాలా మంది సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్నారనీ,కుటుంబ సభ్యుల్లో ఒకరి జీతం మీదనే ఆధారపడి జీవనం కష్టమనీ, అందువల్ల ఈ నిబంధనను కొనసాగించాలని ట్రంప్‌ని వారు ఆ లేఖలోకోరారు.

శాస్త్రవేత్తల పరిశోధనలు క్షేత్రస్థాయికి విస్తరించాలి

ఇంఫాల్: శాస్త్రవేత్తలు తమ పరిశోధనలు ల్యాబ్‌ల నుంచి క్షేత్రస్థాయి వరకు చేరేలా కృషి చేయాలని ప్రధాని నరేంద్రమోదీ కోరారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ 105వ ప్రారంభోత్సవ సదస్సులో ప్రధాని మాట్లాడుతూ భారతదేశానికి అత్యున్నత సంప్రదాయం, సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. ఈ రెండూ సైన్స్ అండ్ టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ పరిశోధనల ఫలాలు ప్రయోగశాలలు నుంచి క్షేత్రస్థాయికి చేర్చాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధికి మరియు సంపన్నతకు సాంకేతికతను వినియోగించడంలో దేశాన్ని భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా సిద్ధంగా ఉంచాలన్నారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, పౌరులకు బ్యాంకింగ్ సౌకర్యాల విస్తరణను టెక్నాలజీ అనుమతిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. యువత శాస్త్రీయ స్వభావాన్ని పెంచుకోవటానికి సహాయపడే శాస్త్ర మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని చర్చించడానికి శాస్త్రవేత్తలు ప్రతి సంవత్సరం సుమారు 100గంటల సమయం 100మంది 9నుంచి 12వ తరగతి విద్యార్థులతో గడపాలని ఇది తన వ్యక్తిగత అభ్యర్థన అన్నారు.

ఎన్ఎస్ఏ వేటుకు ట్రంప్ నిర్ణయం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు (ఎన్ఎస్ఏ) లెఫ్టినెంట్ కల్నల్ మెక్ మాస్టర్ ని తొలగించేందుకు నిర్ణయించారు. ఉత్తర కొరియా అధినేతతో చర్చలకు ముందుగా కొత్త ఎన్ఎస్ఏని నియమించాలని ట్రంప్ నిర్ణయించినట్టు అందుకోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్టు అమెరికన్ మీడియా కథనం.అయితే, ఆయనను అవమానకరంగా తొలగించకుండా, వీలైనంత గడువు ఇవ్వాలనీ,ఆయనకు దీటైన వ్యక్తి కోసం ట్రంప్ అన్వేషిస్తున్నారని వాషింగ్టన్ పోస్టు పేర్కొంది.అయితే, జాతీయ భద్రతా మండలిలో మార్పులు చేయడానికి ట్రంప్ ఆలోచనలు చేస్తున్నట్టు, నిర్ణయం కూడా తీసుకున్నట్టు అమెరికన్ పత్రికల్లో వచ్చిన వార్తలను వైట్ హౌస్ ప్రతినిధి సరాహ్ శాండర్స్ ఖండించారు.ట్రంప్, మెక్ మాస్టర్ ల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని ఆమె అన్నారు. ట్రంప్ అధికారాన్ని చేపట్టిన వెంటనే జాతీయ భద్రతా సలహాదారుగా మైఖేల్ ఫ్లెన్‌ని నియమించారు.రష్యా రాయబారితో తన సంభాషణల గురించి ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ ని తప్పుదోవ పట్టించినందుకు మైఖేల్ ఫ్లెన్‌ని ట్రంప్ తొలగించారు.

మాట మార్చింది వారే

●బాబు సర్కార్‌పై జైట్లీ ఫైర్




న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కేటగిరి హోదాకు దీటుగా ఒక ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడానికి కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ప్యాకేజీ పంపిణీకి ఒక యంత్రాంగం ఏర్పాటుకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం కోసం అంతులేకుండా వేచి చూసిందని శుక్రవారం తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ నియమ, నిబంధనలపై 2016, సెప్టెంబర్‌లోనే ఒక అంగీకారం కుదిరిందని చెప్పారు. కాని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలోనే నిధుల స్వీకారానికి మార్గంలో ఒక మార్పును సూచించిందని తెలిపారు. అందుకు కేంద్రం అంగీకరించినప్పటికీ అప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రాలేదని జైట్లీ వివరించారు. ఒక పరిష్కారాన్ని ముందు ఉంచడం జరిగింది. వనరులు కావాలా లేక రాద్ధాంతం చేయాలా అనేది ఆంధ్రప్రదేశ్ నిర్ణయించుకోవాలి అని ఆర్థిక మంత్రి తెలిపారు. రాష్ట్రానికి హామీ ఇచ్చిన నిధులను ఇవ్వడానికి కట్టుబడిన కేంద్రం, తన వంతుగా ఎలాంటి జాప్యం చేయలేదని చెప్పారు. బాహ్య ఎయిడెడ్ ప్రాజెక్టుల రూపేణా నిధులు రావాలని, అందులో 90 శాతాన్ని కేంద్రం, 10 శాతాన్ని రాష్ట్రం తిరిగి చెల్లించే విధంగా ఆంధ్రప్రదేశ్ సూచించగా, అందుకు తాము అంగీకరించినట్టు జైట్లీ వివరించారు. కానీ ఈ ఏడాది జనవరిలో తన వైఖరి మార్చుకున్న రాష్ట్రం నాబార్డు ద్వారా నిధులు ఇవ్వాలని కోరిందని తెలిపారు. అలా చేయటం వల్ల దాని ద్రవ్య లోటు పెరుగుతుందని, రుణాలిచ్చే అవకాశాన్ని నియంత్రిస్తుందని రాష్ట్రానికి కేంద్రం సూచించినట్టు జైట్లీ చెప్పారు. ఆ క్రమంలో నాబార్డు నుంచి నిధుల బట్వాడా కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పివి) ఏర్పాటుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. కేంద్రం అలాంటి నిధుల్లో 90 శాతం మేరకు తిరిగి చెల్లించాల్సి ఉంటుందని ఆర్థిక మంత్రి చెప్పారు. ఫిబ్రవరి ఏడవ తేదీన వారి(ఏపీ) అధికారులు వివరాలతో వస్తామని తెలిపారు. కానీ ఇప్పటిదాకా ఒక్కరు కూడా లేదు అని జైట్లీ అన్నారు. వారు వస్తారని మేము కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూశావని ఆయన చెప్పారు. జనవరిలో మార్పు చేసింది ఆంధ్రప్రదేశ్ తప్ప తాము కాదని స్పష్టం చేశారు.

దేశంలో నీటి కొరత లేదు



బంద్రభన్: దేశంలో నీటి కొరత లేదని.. ఉన్న నీటినీ శాస్త్రీయ పద్ధతుల్లో సంరక్షించుకుంటే నీటి కష్టాలే ఉండవని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న నదీ మహోత్సవాన్ని ప్రారంభించిన ఆయన.. సరైన నీటి నిర్వహణ ప్రణాళికలను అమలు చేస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని పేర్కొన్నా రు.నీరు, అడవులు, భూమి, జంతువులు వెలకట్ట లేనివని.. అవి దేవుడు మనకిచ్చిన వరమని గడ్కరీ కొనియాడారు. దేశంలో నీటి పరిర క్షణకు పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి సంరక్షణను ప్రతీ ఒక్క రూ బాధ్యతగా స్వీకరిం చాల ని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించుకుని వ్యర్థా లను కూడా సంపదగా మార్చుకునేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.


విడాకుల కోసం ట్రంప్ కోడలు దరఖాస్తు



న్యూయార్క్: అమెరికా అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమా రుడు జూనియర్ ట్రంప్ నుంచి విడాకులు కోరుతూ అతడి భార్య వానెస్సా మాన్‌హటన్ కోర్టులో దరఖాస్తు దాఖలు చేశా రు. పన్నెండేళ్ళ క్రితం వారి వివాహం అయిం ది. జూనియర్ ట్రంప్ ఒక ప్రక టన చేస్తూ తమ ఇద్దరి మధ్య సత్సంబంధాలు ఉన్నా య నీ,విడిపోవడానికి ప్రత్యేక కార ణాలేవీ లేవని అన్నా రు.వా నెస్సా కూడా గతంలో మో డల్ గా పని చేశారు.

న్యాయస్థానాల సమాంతర విచారణ ఉండదు

●పీఎన్బీ స్కామ్‌పై సుప్రీం కోర్టుకు స్పష్టం చేసిన కేంద్రం



న్యూఢిల్లీ: పీఎన్బీ కుంభకోణం కేసులో సమాంతర విచారణ, కోర్టు పర్యవేక్షణలో విచారణ చేపట్టడం ఉండదని కేంద్రం స్పష్టం చేసింది. పీఎన్‌బీ స్కాం విచారణ పురోగతిని సీల్డ్‌కవరులో సమర్పించాలని సీబీఐకి సుప్రీంకోర్టు చేసిన సూచనను కేంద్రం తోసిపుచ్చింది. ఈ కేసుపై దర్యాప్తు సంస్థలు విచారణ ప్రారంభించకముందే పిల్‌లతో ప్రజలు న్యాయస్థానాలను ఆశ్రయించడంపట్ల అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్ దాఖలు చేసి విచారణ పురోగతి వివరాలు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించడం న్యాయసమ్మతమేనా అని సీజే దీపక్‌మిశ్రా, జస్టిస్ కన్విల్కార్, జస్టిస్ చంద్రచూడ్‌లతో కూడిన బెంచ్‌ను ఆయన ప్రశ్నించారు.ఈ తరహా పిటీషన్లు దర్యాప్తు సంస్థల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తాయని వేణుగోపాల్ సుప్రీంకు నివేదించారు. స్కామ్‌పై స్వతంత్ర విచారణ చేపట్టాలని, నీరవ్‌మోదీని భారత్‌కు రప్పించాలంటూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది వినీత్ దండా దాఖలు చేసిన పిటీషన్‌ను అటార్నీ జనరల్ వ్యతిరేకించా రు. కాగా 11,400 కోట్ల పీఎన్‌బీ కుంభకోణం కేసులో సీబీఐ ఇంతకుముందే రెండు ఎఫ్ఐ ఆర్‌లను నమో దు చేసింది. బిలియనీర్ నీరవ్ మోదీ అతని బంధువు చోక్సీలపై గత జనవరి 31న మొదటి ఎఫ్ఐఆర్, ఫిబ్రవరి నెలలో మరో ఎఫ్ఐఆర్ మొత్తం రెండు ఎఫ్ఐఆర్‌లను రిజిస్టర్ చేసింది. ఇదిలా ఉండగా పిల్ దాఖలు చేసిన న్యాయవాది తన పిటిషన్‌లో బకాయిల ఎగవే తదారులనుంచి నిర్ణీత కాలంలో రికవరీ చేసేలా నిబంధనలు రూపొందించాలని, అవసరమైతే డిఫాల్టర్ల ఆస్తులను జప్తు చేసి బహిరంగ మార్కెట్లో వేలంవేసి బకాయిలు రాబట్టుకునేలా మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు.

దలేర్ మెహందీ దోషి

●తేల్చిన పాటియాలా కోర్టు



పాటియాలా: ప్రముఖ బాంగ్రా పాప్ గాయకుడు దలేర్ మెహందీని మ నుషుల అక్రమ రవాణా కేసులో పాటియాలా కోర్టు దోషిగా తేల్చింది. తన మ్యూజికల్ ట్రూప్ విదేశాల్లో చేసే కార్యక్రమాల్లో భాగంగా అక్కడికి వెళ్లే వా రితో పాటు కొంతమందిని అక్రమంగా విదేశాలకు తీసుకెళ్లినట్టుగా 20 03లో దలేర్ మెహందీ, అతని సోదరుడు షంషేర్ సింగ్‌లపై కేసు నమో దైంది. యూఎస్, యూకే, కెనడాలతో పాటు మరికొన్ని దేశాలకు దలేర్ మను షు లను తీసుకెళ్లినట్టుగా ఆరోపణలు వచ్చాయి. దలేర్‌కు వ్యతిరేకంగా 31 కేసు లు నమోదు కావటంతో గతంలో పాటియాలా పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన దలేర్ ఇన్నేళ్లుగా విచా రణను ఎదుర్కొంటున్నారు. తాజాగా దలేర్‌ని దోషిగా తేల్చిన పాటియాలా కోర్ట్ అయనకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ప్రస్తుతం దలేర్‌తో పాటు ఆయన సోదరుడు షంషేర్ సింగ్ పాటియాలా కోర్టు కస్టడీలో ఉన్నారు.

రోజుకు 6.25 లక్షల చైల్డ్ స్మోకర్లు

న్యూఢిల్లీ: దేశంలో సిగరెట్ తాగే వారిలో చిన్నారుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. రోజుకు 6.25 లక్షల మంది చిన్న పిల్లలు సిగరెట్ తాగుతున్నట్లు గ్లోబల్ టొబాకో అట్లాస్(జీటీఏ) అధ్యయనంలో వెల్లడైంది. దేశంలో రోజుకు 4 లక్షల 29వేల 500 మంది మగపిల్లలు, లక్షా 95వేల 500 మంది ఆడపిల్లలు సిగరెట్ తాగుతున్నట్లు జీటీఏ పేర్కొంది. సరైన సంరక్షణ లేని పిల్లలే ఎక్కువగా సిగరెట్ కు బానిసలౌతున్నట్లు వెల్లడించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని గ్లోబల్ టొబాకో అట్లాస్ హెచ్చరించింది. ఓ నివేదిక ప్రకారం 2016 సంవత్సరంలో 82.12 బిలియన్ల సిగరెట్లు తయారైనట్లు తెలిసింది. ప్రపంచంలో పొగాకు ఉత్పత్తుల ఆదాయం ఇతర ఆదాయంతో పోలిస్తే ఆరో స్థానంలో ఉన్నట్లుసమాచారం. భారత్‌లో పొగాకు ఉత్పత్తుల ద్వారా వ చ్చే ఆదాయం స్థూల జాతీయ ఆదాయంలో 15 శాతంగా తేలింది.

కార్తీ బెయిల్‌పై తీర్పు వాయిదా

●రిజర్వులో ఉంచిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం బెయిల్ పిటీషన్‌పై తీర్పును ఢిల్లీ హైకోర్టు రిజర్వ్‌లో ఉంచింది. సీబీఐ కార్తీ చిదంబరంపై దాఖలు చేసిన ఐఎన్ఎక్స్ మీడియా కేసు విషయంపై ఆయన్ని అరెస్టు చేయటంతో కార్తీ ఢిల్లీ హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. జస్టిస్ ఎస్‌పి గార్గ్ సీబీఐ, కార్తీ వ్యక్తిగత న్యాయవాది వాదనలు విన్నారు. అనంతరం బెయిల్ విషయంపై తీర్పును రిజర్వులో ఉంచారు. కాగా సీబీఐ తమ వాదనలు వినిపిస్తూ కార్తీకి బెయిలు మంజూరు చేస్తే సాక్ష్యాధారాలను మార్చివేయటం, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున బెయిలు మంజూరు చేయవద్దని న్యాయమూర్తిని కోరింది. సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి కార్తీ బెయిల్ పిటీషన్ తోసిపుచ్చటంతో ఆయన బెయిల్‌కోసం ఢిల్లీ హైకోర్టులో పిటీషన్ వేశారు. ఇరువర్గాల వాదన విన్న హైకోర్టు న్యాయమూర్తి గార్గ్ తమ తీర్పును రిజర్వులో ఉంచారు.

శాండ్... గోల్డ్

ఇసుకతో ఖజానాకు భారీ ఆదాయం



- సున్నపురాయి గనులకు అంతర్జాతీయ లీజు
- అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం
- త్వరలో అత్యున్నత మైనింగ్ పాలసీ
- ఒక్క ఫోన్ కాల్‌తో ఇసుక రేటు
- రాక్‌శాండ్ వినియోగం పెంపుదల
- అధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో సున్నపురాయి గనుల లీజును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని గనులశాఖ మంత్రి కేటీ రామారావు అధికారులను ఆదేశించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన సూచించారు. అక్రమ మైనింగ్‌లను సహించేది లేదని, ఎంతటి వారైనా ఒత్తిడికి గురికావద్దని ఆయన అధికారులకు ధైర్యం చెప్పారు. గనుల శాఖపై ఉన్నతాధికారులతో కేటీఆర్ శుక్రవారం సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, గనులశాఖ డైరెక్టర్ సుశీల్ కుమార్, టిఎస్-ఎండిసి ఎండి మల్సూర్, గనులశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, గతఏడాదిగా గనులశాఖలో అనేక కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం దువల్ల అక్రమ మైనింగ్ నిరోధించ గలిగామని చెప్పారు. వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో 354 తనిఖీలు నిర్వహించామని, 79 ఉల్లంఘనలు గుర్తించి వారిపై చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. దీంతో పాటు రాష్ట్రంలో గనుల లీజు తీసుకుని కార్య కలాపాలు నిర్వహించని 477 లీజులను రద్దు చేశామన్నారు.

గనులశాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని, గనుల పర్యవేక్షణలో జియో ఫెన్సింగ్, జియోట్యాగింగ్, ఉపగ్రహ చిత్రాల ఉపయోగం, డ్రోన్లను ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. త్వరలో తీసుకురానున్న మైనింగ్ పాలసీలో దేశంలోని అత్యుత్తమ విధానాలను చేకూర్చాలని, ఈ పాలసీని చట్ట రూపంలో తీసుకువస్తామని చెప్పారు. ఈ-ఆక్షన్ ద్వారా ద్వారానే గనులు, ఇసుక లీజులు జరగాలని, ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

పర్యావరణ సమతుల్యత కోసం రాక్ శాండ్ వినియోగాన్ని పెంచాలని, ప్రభుత్వం చేపట్టిన సాగునీటి, ఆర్‌అండ్‌బీ శాఖల నిర్మాణాల్లో దీన్ని వినియోగం పెంచేందుకు ఆయా శాఖల ఇంజనీరింగ్ శాఖాధిపతులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఖనిజాభివృద్ధి సంస్థ కూడా రాక్ శాండ్ క్రషర్ల ఏర్పాట్లను పరిశీలించాలని ఆదేశించారు. పలు జిల్లాల్లో చేపట్టిన శాండ్ ట్యాక్సీ విధానం విజయవంతమైనందున రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఒక ఫోన్‌కాల్‌తోనే రాష్ట్రంలోని ఎవరికైనా ఇసుక ఏ ధరతో లభిస్తుందో తెలిసేలా విధానం ఉండాలని కేటీఆర్ చెప్పారు.

ఈ ఆర్థిక సంవత్సరం గనులశాఖ రూ.3,166 కోట్ల ఆదాయ లక్ష్యంగా పెట్టుకోగా, ఫిబ్రవరి చివరినాటికే రూ.3,500 కోట్లు వచ్చిందని మంత్రి తెలిపారు. ఇందులో ఇసుక ఆదాయ లక్ష్యం రూ.388 కోట్లు కాగా, రూ.538 కోట్లు వచ్చిందని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించినందునే ప్రజా సంపద ప్రభుత్వానికి చేరిందని ఆయన అన్నారు. ఖనిజాల ఆదాయం ప్రజల ఆస్తి అని, అది వారి అభివృద్ధికే ఉపయోగపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మైనింగ్ ఆదాయంలోని లీకేజీలను సాధ్యమైనంత ఎక్కువగా అరికడతామని కేటీఆర్ అన్నారు. బయ్యారంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు, ఈ ప్లాంట్‌కు ఇనుప ఖనిజం కేటాయింపుపై చర్చించారు.

ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై కేంద్రాన్ని అనేకసార్లు కోరినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేటీఆర్ చెప్పారు. దీనికి సంబంధించి త్వరలోనే కేంద్ర గనులశాఖ, స్టీల్‌శాఖ మంత్రులను కలుస్తామని ఆయన చెప్పారు.

సర్కారు కరుణిస్తే
వేతన సవరణ

- 57 వేల మంది ఆర్టీసీ సిబ్బంది వేడుకోలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇప్పట్లో వేతన సవరణ సాధ్యం కాదని ఆర్టీసీ ఉన్నతాధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప వేతన సవరణ భారం భరించే పరిస్థితిలో ఆర్టీసీ లేదన్నారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఉంటుందన్నారు. వార్షిక బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధుల కేటాయింపు ఏ మాత్రం ఆశాజనకంగా లేవన్నారు. కొంత వరకు సంస్థ అవసరాలు తీరుస్తాయన్నారు. జూన్ 2015లో జరిగిన వేతన ఒప్పందం ఆర్టీసీకి భారంగానే కొనసాగిందన్నారు. కార్మికులు 43 శాతం ఫిట్మెంట్ కోరితే ప్రభుత్వం 44 శాతం ఫిట్మెంట్‌లో వేతన సవరణ జరిపిందని గుర్తు చేశారు. దీనితో పాటుగా 2,376 మంది డ్రైవర్లు, 1,625 మంది కండక్టర్ల సర్వీసులను క్రమబద్ధీకరించడంతో ఆర్టీసీకి వేతనాల చెల్లింపు పెను భారంగానే మారిందన్నారు. వ్యయ నియంత్రణ కొంత వరకు సానుకూల ఫలితాలను ఇచ్చినప్పటికీ పల్లె వెలుగు, సిటీ బస్సుల నష్టాలను అధిగమించలేకపోతున్నామని అధికారులు తెలిపారు. ఆర్టీసీకి ఏటా రూ. 450 కోట్ల వరకు నష్టాలు వస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఆర్టీసీ అప్పులు రూ. 2,275 కోట్లకు చేరుకున్నాయి. ఏటా రూ. 350 కోట్లకు మించి రుణాలు తిరిగి చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఆర్టీసీని ఆదుకునేందుకు ప్రతి నెలా రూ. 75 కోట్లు నష్టాలను ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన ప్రకటన ఆచరణలో అమలుకు నోచుకోలేదు. సిటీ బస్సుల నష్టాలను కొంత వరకు జీహెచ్‌ఎంసీ భరిస్తుందని చేసిన ప్రకటన కూడా అటకెక్కింది. కొత్త బస్సుల కొనుగోలుకు ప్రభుత్వ గ్యారంటీతో చేసిన అప్పులను తిరిగి చెల్లించడానికి మాత్రమే ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంది. ఆర్టీసీకి రూ. 1000 కోట్లు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించింది. కాని, ప్రభుత్వం రూ. 975.54 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పొందుపర్చింది. ఈ మొత్తాలు కూడా అప్పులు తీర్చడానికి, కొత్త బస్సులు కొనడానికి, రాయితీల చెల్లింపులకు మాత్రమే సరిపోతుంది. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో పెట్టిన మేరకు కూడా ఆర్టీసీకి నిధులు విడుదల కాని పరిస్థితి నెలకొంది. 2017 - 18 ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీకి రూ. 994.71 కోట్లు కేటాయించగా, 2018 - 19లో రూ. 975.54 కోట్లు కేటాయించారు. అందులో రాయితీల చెల్లింపులకు గాను రూ. 520 కోట్లు కేటాయించగా ఆర్టీసీకి ఇప్పటి వరకు రూ. 290 కోట్లు మాత్రమే ఆర్టీసీకి అందాయి. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట మేరకు ఆర్టీసీకి కొంత కాలం పాటు ప్రతి నెల రూ. 75 కోట్ల సహాయం అందించాలని, వేతన సవరణ ప్రభుత్వమే ముందుకు రావలసి ఉంటుందని పేర్కొన్నారు. ఆర్టీసీలో సుమారు 57 వేల మంది సిబ్బంది ఉన్నారు. వారందరికీ మెరుగైన వేతనాలు చెల్లించడం జరుగుతుందని సీఎం కేసీఆర్ 2016 జూన్ 23న ప్రకటించారు. ఆర్టీసీకి నెల నెల ఆర్థిక సహాయం అందచేస్తామని కూడా ఆనాటి సభలో బహిరంగంగానే వెల్లడించారు.

ఢిల్లీలో కోమటిరెడ్డి లొల్లి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మూడు రోజుల కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన కాంగ్రెస్ సీనియర్ నేత కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలంగాణా భవన్‌లో ఉండడానికి గదుల గురించి అధికారులను అడగ్గా, కోమటిరెడ్డి మాజీ ఎమ్మెల్యే అయినందున ఆయనకు గదులు ఇవ్వవద్దంటూ తమకు ఆదేశాలు అందాయని వారు వెల్లడించారు. దీంతో కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండిపడ్డారు. ఒక సీనియర్ ఎమ్మెల్యే అని కూడా చూడకుండా తెలంగాణా భవన్ అధికారులు తనను అవమానించారని అసహనం వ్యక్తం చేశారు. దళిత ఎమ్మెల్యే సంపత్ ఢిల్లీలో ఎక్కడ ఉంటారని, తమపై కక్ష కట్టే కేసీఆర్ ప్రభుత్వం ఇలా చేస్తోందని మండి పడ్డారు. తెలంగాణ కోసం తాము కూడా పోరాడామంటూ అప్పటి విషయాలను కోమటి రెడ్డి గుర్తు చేసుకున్నారు.

వీడియోలు ఇవ్వండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ నెల 12న శాసన సభలో గవర్నర్ ప్రసంగం సమయంలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విడియో పుటేజీలు ఇవ్వాలని మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. శుక్రవారం అసెంబ్లీ కార్యదర్శికి ఆర్టీఐ చట్టం ద్వారా దరఖాస్తు చేశారు.

మిడ్ మానేరు నిర్వాసితులకు పరిహారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన మానువాడ గ్రామ నిర్వాసితులకు ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న భూముల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2006-07లో ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గ్రామంలోని 80 శాతానికిపైగా ప్రజలు భూములు కోల్పోయి నిర్వాసితులుగా మారారని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించే విషయంలో నిర్లక్ష్యం చేసిందని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుకు శుక్రవారం ఈ మేరకు రాసిన లేఖలో వివరించారు.

పవన్ ఆరోపణలు అర్థరహితం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర విభజన హామీలను అమలు చేయని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీని ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి ఆరోపించారు. తెలుగు ప్రజలకు ఉపయోగపడేందుకే ఎన్‌డిఎలో చేరామని, కానీ నాలుగేళ్ళు గడిచినా తెలుగు రాష్ట్రాలకు విభజన చట్టంలోని హామీలను అమలు చేయడం లేదని శుక్రవారం మీడియాతోఅన్నారు. యువ నాయకుడు, మంత్రి లోకేష్‌పై పవన్ కళ్యాణ్ నిరాధార ఆరోపణలు చేయడం అర్థరహితమని ఆయన అన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టుతో ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడం సరికాదని, పవన్ ఆరోపణలను రావుల తీవ్రంగా ఖండించారు.

కేటాయింపులు ఘనం.. నిధులు శూన్యం

- తెదేపా మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా బడ్జెట్‌లో ముస్లింలకు భారీగా కేటాయింపులు చూపించి, నిధులు విడుదల చేయడం లేదని తెలుగుదేశంపార్టీ తెలంగాణ మైనారిటీసెల్ అధ్యక్షుడు మహమ్మద్ తాజుద్దీన్ ఆరోపించారు. ఎన్నికల్లో తెరాస ముస్లింలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, ఓట్ల కోసమే మళ్ళీ కొత్త హామీలు ఇస్తోందని శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో దుయ్యబట్టారు. ముస్లిం సమస్యలను పట్టించుకోవడం లేదని, వక్ఫ్ భూముల కబ్జాలను విడిపించడం లేదని, ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటించి కనీస నిధులు కూడా విడుదల చేయడం లేదని ఆయన ఆరోపించారు.

కమలం కనుసన్నల్లో కేసీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : బీజేపీ కనుసైగలతోనే టీఆర్ఎస్ నడుచుకుంటోందని సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడ్డి అన్నారు. దేశంలో మూడో ప్రత్యామ్నాయ ఫ్రంట్‌ను వల్లిస్తున్న సీఎం కేసీఆర్.. బీజేపీ సర్కార్‌కు వ్యతిరేకంగా పెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా టీఆర్ఎస్ ఎంపీలు సభ ఆర్డర్‌లో లేకుండా ఆందోళనలు చేయడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విభజన హామీల అమలు కోసం విపక్షాలు పార్లమెంట్‌లో పోరాటం చేస్తుంటే..టీఆర్ఎస్ ఎంపీల వైఖరి మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని ఆయన విమర్శించారు.

తెలంగాణ గడ్డపై కాషాయ జెండా

- తెదేపా నిష్క్రమణతో నష్టం లేదు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగురాలని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ అన్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేస్తూనే....ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో పెద్దఎత్తున ప్రచారం కల్పించాలన్నారు.

రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలోభాగంగా శుక్రవారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన భాజపా పదాధికారులు,ఓబీసీ మోర్చా, మీడియా కమిటీ,ఐటీ, సోషల్ మీడియా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ 2019లో జరిగే ఎన్నికల్లో తెలంగాణలోను పార్టీ అధికారం లోకి వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న కర్నాటక ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందన్నారు. ఈ గెలుపు తరువాత దక్షణాది రాష్ట్రా ల్లో పెనుమార్పులు సంభవిస్తాయన్నారు. అవన్నీ భాజపాకు అనుకూలంగా ఉంటాయన్నారు. టీడీపీ ఎన్డీయే నుంచి వెళ్ళిపోయినంత మాత్రాన ఒరిగిది ఏమీ లేదని, దాని ప్రభావం ఏమీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్, శాసనసభా పక్షనేత జి. కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేరామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు,. మాజీ ఎమ్మెల్యే బద్దంబాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చింతా సాంబమూర్తి, ప్రేమేందర్‌రెడ్డి, జి. మనోహర్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మం, వరంగల్ రూరల్లో పర్యటన

రెండో రోజు పర్యటనలో భాగంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ శనివారం ఖమ్మం, వరంగల్ రూరల్ జిల్లాల్లో పర్యటిస్తారు. ఈసందర్భంగా పార్టీ బూత్ స్థాయి, జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాల్లో ఆయన పాల్గొంటారు.

జనసేన, వైకాపాలతో మాకేం పని?



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వానికి దేశంలో ప్రత్యామ్నాయమే లేదని భాజపా రాష్ట్ర శాసన సభా పక్ష నాయకుడు కిషన్ రెడ్డి అన్నారు. చిన్న పార్టీల వల్ల దేశంలో అస్థిరత్వం ఏర్పడుతుందే తప్ప అభివృద్ధికి దోహదం చేయదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ తిరిగి కేంద్రంలో భాజపా అధికారంలోకి రావడం తథ్యమన్నారు. అసెంబ్లీ మీడియా హాల్లో మీడియాతో మాట్లాడుతూ ఏపీలో భాజపాపై తెదేపా చేస్తున్న విమర్శలను చూస్తుంటే విస్మయం కలుగుతోందన్నారు. జనసేన, వైసీపీలతో భాజపా లాలూచీ పడాల్సిన అవసరం ఏముందో తెదేపా నేతలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్రాన్ని అడగడంలో ఎలాంటి తప్పు లేదన్నారు. కానీ భాజపా పార్టీపై లేనిపోని ఆరోపణలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు సక్రమంగా జరగలేదని, వీటిపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తానన్నారు.

మోడీతో కేసీఆర్ దోస్తీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రధాన మంత్రి నరేంద్రమోడితో సీఎం చంద్రశేఖర్‌రావు లాలూచి పార్లమెంట్ సాక్షిగా బయట పడిందని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్రంలోనీ బీజేపీ ప్రభుత్వంపై టీడీపీ, వైసీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా టీఆర్ఎస్ అడ్డుపడటమే ఇందుకు నిదర్శనమని శనివారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో ఏపీకి చెందిన ఇరు పార్టీల ఎంపీలు ఆందోళనకు టీఆర్ఎస్ ఎంపీలు మద్దతు ఉంటుందని చెప్పారని ఆయన గుర్తు చేశారు. మరో వైపు బీజేపీకి వ్యతిరేకంగా కొత్త కూటమిని ఏర్పాటు చేస్తామంటున్న కేసీఆర్.. ఇప్పుడు టీడీపీ, వైసీపీల అవిశ్వానికి మద్దతివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అవిశ్వాసం ప్రవేశపెట్టిన సమయంలో టీఆర్ఎస్ ఎంపీలు గందరగోళం చేయకపోతే... అవిశ్వాసం చర్చకు వచ్చేదన్నారు. ఈ అవిశ్వాసం వల్ల ఏపీతో పాటు తెలంగాణకు కూడా ప్రయోజనం ఉండేదన్నారు. లోక్‌సభలో శిఖండి పాత్ర వహిస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు విభజన హామీలను సాధించడంలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు.

సినీ గాయకుడు కె.బి.కె మోహన రాజు కన్నుమూత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అలనాటి తెలుగు సినీ నేపథ్య గాయకుడు కొండా బాబూ కృష్ణ మోహనరాజు(84) శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన1934లో విజయవాడలో జన్మించారు. మోహన రాజుకు నలుగురు కుమారులు. ఓ కూతురు ఉన్నారు. 1960-70 దశకంలో తెలుగులో పలు సినీ గీతాలను ఆలపించారు. 1968లో వచ్చిన ''పూలరంగడు'' సినిమాలో... చిగురులు వేసిన కలలన్నీ పాట నేపథ్య గాయకుడిగా ఆయనకు ఎనలేని గుర్తింపును తీసుకొచ్చింది. బాపూజీ మన బాపూజీ (విధివిలాసం), అన్న వదినా (పెద్దన్నయ్య), ఎవరికి వారే ఈలోకం (సాక్షి), మరు మల్లెలు (పెళ్లి కాని పెళ్లి), ప్రేమించే మనసొకటుంటే (మహాత్ముడు), పొడలా పొడలా గట్ల నడుమా (మా భూమి), రాధను నేనైతే (ఇన్‌స్పెక్టర్ భార్య)తో పాటు పలు సినిమాల్లో వందకు పైగా అర్థవంతమైన గీతాలను మోహనరాజు ఆలపించారు. ఆల్ ఇండియా రేడియో, సిని మా, దూర దర్శన్‌లలో తన గళంతో ఐదు దశాబ్దాలుగా తెలుగు ప్రేక్షకుల్ని అలరించారు. గాయనీ గాయకులతో ఎంతో సన్నిహితంగా ఉండే మోహన రాజు మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని సినీరంగ ప్రముఖులు తెలిపారు.

కోమటిరెడ్డి, సంపత్‌ల కేసు విచారణ షురూ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అసెంబ్లీ నుంచి తమను బహిష్కరించడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎ.సంపత్ కుమార్‌లు దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో వాదనలు వినిపించాలని హైకోర్టు ప్రతివాదులను ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంలో పిటిషనర్లు లేవనెత్తిన వివిధ అంశాలపై వాస్తవాలు వెల్లడించేందుకు గడువు కావాలని తెలంగాణ అడ్వకేట్ జనరల్ అభ్యర్థన మేరకు న్యాయమూర్తి తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేశారు.

నా వెనకెవ్వరూ లేరు..
ప్రజలే నాకు డైరెక్షన్

- నేనే ప్రజల పార్టనర్‌ను
- విభజన హామీలు తుంగలో తొక్కారు
- రాజ్యాంగాన్ని ఉల్లంఘించారు
- పరీక్షల తర్వాత ఉద్యమ కార్యాచరణ
- ఊరూరా ఉద్యమం: పవన్ కల్యాణ్



అమరావతి, ఆంధ్రప్రభ : ఈరోజు నేను ఎవరి డైరెక్షన్‌లో పనిచేయడం లేదు..ప్రజల కోసం ప్రజా డైరెక్షన్‌లోనే పని చేస్తున్నానని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. శుక్రవారం విజయవాడలో ఆయన వామపక్ష నేతలు పి. మధు. కె. రామకృష్ణలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ మధ్య వైసీపీ అధినేత జగన్ టీడీపీ డైరెక్షన్‌లో పని చేస్తు న్నానని అన్నారు. మళ్లీ ఇప్పుడు బీజేపీ డైరెక్షన్‌లో పనిచేస్తున్నానంటున్నారు..ఏమిటండీ..నాకు ఎవరి డైరెక్షన్‌లో పనిచేయాల్సిన అవసరం లేదు..నాకు ప్రజా సంక్షేమమే ముఖ్యం. రాష్ట్ర విభజన హామీల సాధన కోసం ఎంత దాకైనా వెళతాను..ప్రజలకు మేలు జరగడానికి అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. రాజ్యంలో సంపాదన కోసం ప్రజా సమస్యలను తుంగలో తొక్కారని, విభజన హామీలు ఇచ్చి, నెరవేర్చకుండా యూ టర్న్ తీసుకున్నారని అన్నారు. చివరికి ఏపీకి తీవ్ర అన్యాయం చేశారని, ఈ విషయం తనను ఎంతగానో బాధించిందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రత్యేక ప్యాకేజీ తీసుకుని, ప్రజలకు అన్యాయం చేశారని అన్నారు. తాను ఆనాడు ఏ పదవి ఆశించకుండానే కేంద్రానికి మద్దతు ఇచ్చానని అన్నారు. 25 మంది ఎంపీలను బ్లాక్‌మెయిల్ చేయవచ్చునేమో కానీ 5 కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలను బ్లాక్ మెయిల్ చేయడం కుదురదని, చేయలేరని పేర్కొన్నారు.

కమ్యూనిస్టులంటే అపార గౌరవం

తనకు చిన్నప్పటి నుంచి వామపక్ష భావ జాలమంటే ఎంతో ఇష్టమని, ఎందుకంటే మా నాన్నగారు కమ్యూనిస్టు భావ జాలమున్నవారన్నారు. అందుకే కమ్యూనిస్టు భావజాలమంటే ఇష్టపడి గౌరవిస్తానని అన్నారు. బలమైన పోరాటాలు చేసే సత్తా కమ్యూనిస్టుల సొంతమన్నారు. నాది కూడా సోషలిస్ట్ భావజాలమేనని అన్నారు. అందుకే వారంటే తనకెంతో అపారమైన గౌరవమన్నారు. 2009 ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి పని చేసే అవకాశం వచ్చినా కుదురలేదన్నారు. తాను ఏ పార్టీకి మద్దతు ఇచ్చినా అది కేవలం ప్రజల కోసమేనని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కమ్యూనిస్టు పార్టీలు క్రియాశీలక పాత్ర పోషించాయన్నారు, ఒక వామపక్ష పార్టీ తెలంగాణకు అనుకూలమైనా, మరో వామపక్ష పార్టీ విభజనను వ్యతిరేకించిందన్నారు. అయినా ఈ రెండు పార్టీలంటే తనకు గౌరవమన్నారు. సమాజంలో పొలిటికల ఎకౌంట్‌బులిటీ ఉండాలన్నారు. కానీ నేడది లోపించిందన్నారు,అందుకే రోడ్లమీదకు వచ్చి,పోరాటాలకు సిద్ధమయ్యామని చెప్పారు.

రాజధానిలో కలుషిత జలమా?

గుంటూరును మెడికల్ ఎమర్జెన్సీగా ప్రకటించాలి

గుంటూరు, ప్రభ న్యూస్ : అమరావతి రాజధాని గుంటూరులో 14 మంది కలుషిత నీరు తాగి చనిపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శించారు. శుక్రవారం విజయవాడ నుంచి గుంటూరుకు వచ్చి జీజీహెచ్‌లో అతిసార వ్యాధితో బాధపడుతున్న బాధితులను ఆయన పరామర్శించి, బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. కలుషిత నీరు కారణాలను బాధిత కుటుంబాలను, డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి పాత గుంటూరులోని లాల్‌జాన్ బాషా ఫంక్షన్ హాల్‌లో ఉన్న అతిసార బాధితులను పరామర్శించి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ అతిసార వ్యాధితో మరణించిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే గుంటూరు జిల్లాను మెడికల్ ఎమర్జెన్సీగా ప్రకటించేలా తక్షణమే ఆదేశాలు జారీ చేయా లన్నారు.

ప్రభుత్వం 48 గంటల్లో స్పందించకపోతే దీక్ష చేపడతానని, అవసరమైతే బంద్‌కు పిలుపునిస్తా రన్నా రు. జనసేన తరుపున హరిగోకుల జయదీప్ ప్రభుత్వం దృష్టికి అన్ని విషయాలు తీసుకువెళ్తారని పవన్ స్పష్టం చేశారు.

అవిశ్వాస తీర్మానంపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారని విలేకరులు పవన్‌ను ప్రశ్నించగా ప్రత్యేక హోదాపై ఏ పార్టీకి క్లారిటీ లేదని దీనిపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు.

కేసీఆర్‌ను మాదిగలు నమ్మరు

- వర్గీకరణ సాధనకు 21నుంచి ఢిల్లీలో ఆందోళనలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు.. ఈ నెల 21 నుంచి ఢిల్లీ కేంద్రంగా పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు దీక్షలు చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తెలిపారు. అంతకు ముందే 17, 18న రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలను కలిసి వర్గీకరణపై పార్లమెంట్‌లో పోరాటం చేయాలని విజ్ఞప్తి చేస్తామని ఆయన వివరించారు. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు, ఆందోళనలు, దీక్షలు నిర్వహించనున్నట్లు కృష్ణ మాదిగ తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ సాక్షిగా అన్ని అబద్దాలే మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. వర్గీకరణపై కేంద్రంలో కదలిక వస్తుందని సామాజిక న్యాయ శాఖ మంత్రి విజయ్‌సాంప్లా ఎంపీ నంది ఎల్లయ్య అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన విషయాన్ని కేసీఆర్ గమనించాలన్నారు. వర్గీకరణకు నాయకత్వం వహిస్తానన్న కేసీఆర్ లాంటి మోసగాళ్లను మాదిగలు నమ్మరని ఆయన విమర్శించారు.

జైపాల్‌రెడ్డి స్థాయి మరిచారు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఎలా అగ్రగామిగా నిలిచిందో చాటిచెప్పేలా ఉన్న బడ్జెట్ చూసి ఓర్వలేకపోతున్న కాంగ్రెస్ నాయకులు పిల్లి శాపనార్థాలు పెడుతున్నారని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకకర్ ధ్వజమెత్తారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో మీడియా మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో దొంగ దీక్షలు, గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెరవెనుక విద్యలలో కాంగ్రెస్ ఆరితేరిందని, అలాంటి విద్యలు టిఆర్ఎస్‌కు తెలియవని సంపత్ కుమార్ వ్యాఖ్యలను ఉద్దేశించి కర్నె మాట్లాడారు. ప్రలోభాలకు గురి చేసి పార్టీలో చేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. హత్యారాజకీయాల గురించి కోమటిరెడ్డి మాట్లాడటం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారం అందుకున్న జైపాల్‌రెడ్డి తన స్థాయికి తగ్గట్లు మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.

వచ్చే ఎన్నికల్లో తెరాసతో కలవం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాజిక సమతుల్యత లోపించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఎస్సీ, ఎస్టీ బీసీల జానాభా ప్రకారం టికెట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయబోయే ఫ్రంట్‌ను స్వాగతిస్తున్నామని, కానీ కేసీఆర్ మాటలపై అనేక అనుమానాలు ఉన్నాయని తమ్మినేని విమర్శించారు. శుక్రవారం మీడియాతో మాట్లాతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీతో సీపీఎం పార్టీ కలిసి పని చేసే పరిస్థితి లేదన్నారు. నాలుగేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజా ఉద్యమాలను అణిచివేశారని ఆయన విమర్శించారు.

వారిని ఎంబీసీ ఉప కులాలుగా గుర్తించాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంచార జాతులుగా ఉండి బిక్షాటన చేస్తున్న వారిని ఎంబీసీ ఉప కులాలుగా గుర్తించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి కోరారు. శుక్రవారం సీఎం చంద్రశేఖర్‌రావుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా లేఖ రాశారు. బీసీల్లోని సంచార జాతుల వర్గానికి చెందిన కులాల వారికి సామాజిక న్యాయం జరగడం లేదన్నారు. సంచార జాతుల్లోని 30 కులాల వారికి ఎంబీసీలో ఇప్పటి వరకు గుర్తింపు ఇవ్వలేదన్నారు. వీరు ఏ గ్రేడ్‌కు చెందిన వారనేది ప్రశ్నార్థకంగా మారిందని సీఎంకు రాసిన లేఖలో చాడా పేర్కొన్నారు. సంచార జాతుల గుర్తింపుపై బీసీ, ఎంబీసీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే చింతమనేనికి హైకోర్టులో ఊరట

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పశ్చిమ గోదావరి జిల్లా, దెందులూరు శాసనసభ్యుడు చింతమనేని ప్రభాకర్ కు హైకోర్టులో ఊరట లభించింది. నేరస్తుడిగా నిర్ధారిస్తూ భీమడోలు కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు వెలువరించారు. 2011 సంవత్సరంలో రచ్చబండ కార్యక్రమం సందర్భంగా ఆనాటి రాష్ట్ర మంత్రి వట్టి వసంతకుమార్ పై దాడి చేశారన్న అభియోగంతో చింతమనేని, తదితరులపై కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన భీమడోలు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు చింతమనేని ప్రభాకర్ కు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ గత నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. కింది కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఏలూరు మొదటి అదనపు సెషన్స్ కోర్టులో ఎమ్మెల్యే అప్పీల్ దాఖలు చేశారు. దానిపై విచారణ జరిపిన సెషన్స్ జడ్జి ..భీమడోలు కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్ష అమలును మాత్రమే నిలుపుదల చేశారు. అయితే దోషిగా నిర్ధారించడాన్ని మాత్రం నిలుపుదల చేసేందుకు నిరాకరించారు. ఆ అధికారం తమ పరిధిలోనిది కాదని స్పష్టం చేశారు. దీంతో చింతమనేని హైకోర్టును ఆశ్రయించారు.

కేంద్రంపై తిరుగు బావుటా

● ఒకే రోజు రెండు అస్త్రాలు సంధించిన తెదేపా.. ● ఎన్డీయేకు రాంరాం, మోదీ సర్కారుపై అవిశ్వాసం
● జాతీయస్థాయికి విభజన హామీల పోరు ● అవిశ్వాస తీర్మానాలతో ఇరకాటంలో బీజేపీ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఒక రాష్ట్రానికే పరిమితమైన సమస్య ఇప్పుడు ఏకంగా దేశ రాజకీయ సమీకరణాలనే మార్చేసింది. ఒక్క రోజులో చోటు చేసుకున్న పరిణామాలు కేంద్ర ప్రభుత్వ పీఠాలనే కదిలించాయి. ఇన్నాళ్లూ తమకు ఎదురే లేదన్న రీతిలో దూకుడు ప్రదర్శించిన భారతీయ జనతా పార్టీని తొలిసారిగా డిఫెన్సులో పడింది. అంకెల గారడీలో సంఖ్యా బలం తగ్గిపోయి బొటాబొటీ సొంత మెజారిటీకి పరిమితమైంది. మిత్రులు తోడు లేకుండే కష్టాలు తప్పని పరిస్థితికి చేరింది. ప్రత్యేక హోదా సహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో ఉద్యమించిన ఏపీ ఎంపీలకు క్రమక్రమంగా బలం పెరిగింది. ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు విడివిడిగా పోరాడినా, చివరకు ఉమ్మడి లక్ష్యం కోసం పరోక్షంగా కలవక తప్పలేదు. ఈ పార్టీలు పరస్పరం ఒకరిపై ఒకరు బురదజల్లుకుంటూనే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని కంగారు పెట్టించాయి. వాయిదా సాకుతో తాత్కాలికంగా బయటపడినా, అసలు పరీక్ష సోమవారం ఎదురుకానుంది. గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇవ్వడంతో దేశ రాజకీయాలు వేడెక్కాయి. నిజానికి ఆ పార్టీ ముందు ప్రకటించిన ప్రకారం ఈనెల 21న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాల్సి ఉండగా, పార్లమెంటు సమావేశాలను అంతకంటే ముందే ముగించనున్నట్టు వార్తలు రావడంతో వైకాపా తమ నిర్ణయాన్ని ముందుకు జరిపాయి. శుక్రవారం సభలో చర్చకొచ్చేలా గురువారం నోటీసు ఇచ్చిన వెంటనే రాజకీయాలు వేగంగా మారిపోయాయి. తొలుత రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఇరకాటంలో పడింది. ఈ తీర్మానానికి మద్ధతివ్వాలా వద్దా అనే సంకట పరిస్థితిని ఎదుర్కొంది. తొలుత వైకాపా అవిశ్వాస తీర్మానానికి తాము మద్ధతిస్తామని ప్రకటించింది. అయితే ఈ నిర్ణయంతో తమకు రాజకీయంగా ఎలాంటి ప్రయోజనం ఉండదని, వైకాపాను అనుసరించినట్టు అవుతుందని ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. ఫలితంగా తెల్లారేసరికి పరిణామాలు మరింత వేగంగా మారాయి. యావద్దేశం దృష్టిని తమవైపు తిప్పుకోవాలన్న ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ ఒకే రోజు రెండు అస్త్రాలు సంధించింది. ఈ క్రమంలో ముందు ఎన్డీయే కూటమి నుంచి బయటికొచ్చేస్తున్నామని ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వానికి మద్ధతు ఉపసంహరించుకుంటున్నట్టు లేఖలు కూడా రాసింది. ఈ చర్యతో యావద్దేశం దృష్టి తెలుగుదేశం పార్టీపై పడింది. ఇదే అదనుగా ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం అవిశ్వాస తీర్మానం నోటీసుతో మరో అస్త్రాన్ని ప్రయోగించారు. ఈ చర్యతో అందరి దృష్టి లోక్‌సభపై పడింది.

అవిశ్వాస తీర్మానానికి పలు పార్టీల మద్ధతు
అనుకూలం 168, ప్రతికూలం 333

కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆగ్రహంతో ఉన్న పలు పార్టీలకు తమ అసమ్మతిని వ్యక్తం చేయడానికి అవిశ్వాస తీర్మానం ఒక వేదికగా మారింది. వైకాపాతో పాటు తెలుగుదేశం పార్టీ కూడా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో వివిధ పార్టీలు తమ మద్ధతు ప్రకటించాయి. సభలో కాంగ్రెస్, కమ్యూనిస్టులతో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు లేచి మద్ధతుగా నిలిచారు. అయితే సభలో అన్నా డీఎంకే, టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన కారణంగా తీర్మానానికి మద్ధతుగా నిలిచిన ఎంపీల సంఖ్య లెక్కించే పరిస్థితి లేకపోయింది. ఈ గందరగోళాన్ని సాకుగా తీసుకున్న స్పీకర్, సభను సోమవారానికి వాయిదా వేయడంతో తాత్కాలికంగా బీజేపీ గట్టెక్కింది. అవిశ్వాస తీర్మానంతో ప్రభుత్వం పడిపోతుందన్న భయం లేనప్పటికీ, ఆ తీర్మానాన్ని సభ చర్చకు స్వీకరించిన పక్షంలో, అన్ని రాజకీయ పార్టీలకు మాట్లాడే అవకాశం వస్తుంది. తద్వారా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలతో విరుచుకుపడే వెసులుబాటు ప్రతిపక్షాలకు చిక్కుతుంది. ఈ పరిస్థితి అధికార పార్టీ బీజేపీకి ఇబ్బందికరమే కాబట్టి అవిశ్వాస తీర్మానాన్ని స్వీకరించకుండా తప్పించుకోడానికి చూస్తోంది. శుక్రవారం అవిశ్వాస తీర్మానాలను స్వీకరించకపోవడంతో వైకాపా, తెదేపాలు సోమవారం కోసం మరోసారి నోటీసులు ఇచ్చాయి. ఈ క్రమంలో అవిశ్వాస తీర్మానానికి అనుకూల, ప్రతికూల బలాబలాలను ఓసారి లెక్కిస్తే.. సాంకేతికంగా వైకాపాకు 9 మంది సభ్యులున్నా, అందులో ఎస్పీవై రెడ్డి, కొత్తపల్లి గీత చాలాకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. తాజాగా బుట్టా రేణుక కూడా తెదేపా గూటిలో చేరిపోయారు. తెలంగాణకు చెందిన మరో ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెరాసతో జట్టు కట్టారు. దీంతో వారి సొంత బలమే 5గురు సభ్యులకు పరిమితమైంది. తెలుగుదేశం పార్టీ విషయానికొస్తే వారికి ఉన్న 16 మంది ఎంపీలకు తోడు, బుట్టా రేణుకను కలుపుకుంటే 17 మంది అవుతారు. రాష్ట్రం మొత్తమ్మీద 25 మంది ఎంపీలకు బీజేపీ ఎంపీలు ఇద్దరిని, కొత్తపల్లి గీతను మినహాయిస్తే 22 మంది అవిశ్వాస తీర్మానానికి అనుకూలం అని చెప్పవచ్చు. ఇక జాతీయ స్థాయిలో లెక్కలేస్తే, 48 మంది సభ్యులున్న కాంగ్రెస్ పార్టీ, 9 మంది సభ్యులున్న సీపీఎం, 34 మంది సభ్యుల తృణమూల్ కాంగ్రెస్, 20 మంది సభ్యుల బీజేడీ కూడా అవిశ్వాస తీర్మానానికి మద్ధతు ప్రకటించాయి. వీరికి తెదేపా, వైకాపా నేతలను కూడా కలుపుకుంటే 133 మందికి చేరారు.

ఒక రాష్ట్ర ఉద్యమం... కదిలొచ్చిన దేశం

పార్లమెంటులో పార్టీల బలాబలాలు, అవిశ్వాస తీర్మానంపై లెక్కలు వేసుకోవాల్సిన పరిస్థితికి ప్రత్యేక హోదా ఉద్యమం తీసుకొచ్చింది. నిజానికి ఒక రాష్ట్రానికే పరిమితమైన ఈ ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి ఒకే వైఖరితో ఉంది. ఎట్టిపరిస్థితుల్లోనూ హోదా ఇవ్వడం సాధ్యం కాదంటూ మొండికేసికూర్చుంది. ఎన్ని రకాలుగా ఆందోళన చేస్తున్నా, కేంద్ర మంత్రివర్గం నుంచి తెదేపా వైదొలిగినా కేంద్రం నుంచి స్పందన లేదు. చివరకు ఎన్డీయే నుంచి వైదొలిగినా ఆ పార్టీ ఏమాత్రం దిగిరాలేదు. పోతే పోనీ అన్న రీతిలో తెలుగుదేశం పార్టీని ఎప్పుడు వదిలించుకుందామా అన్నట్టుగానే బీజేపీ నేతలు సైతం వ్యవహరించారు. ఇదే సమయంలో ప్రత్యేక హోదా ఉద్యమానికి పొరుగురాష్ట్రం తెరాస, జాతీయ పార్టీ కాంగ్రెస్ మినహా మిగతా ఎవరూ కూడా మద్ధతు పలకలేదు. ఇంకా చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే మాకూ ఇవ్వాల్సిందేనంటూ బిహార్, ఒడిషా వంటి రాష్ట్రాల నేతలు డిమాండ్ చేశారు. దీంతో ప్రత్యేక హోదా విషయంలో తెలుగు ఎంపీల పోరాటం జాతీయ స్థాయి మద్ధతు కూడగట్టలేకపోయిందనే విమర్శలు ఎదుర్కొంది. అయితే వైకాపా, తెదేపాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. సందర్భం ఏదైనా సరే, అవిశ్వాస తీర్మానానికి మద్ధతు ప్రకటిస్తూ కొన్ని పార్టీలు ముందుకొచ్చాయి. జాతీయస్థాయిలో ఇది చర్చనీయాంశంగా మారింది. కేంద్రంపై గతం కంటే మరింత ఒత్తిడి పెరిగింది.

ఉప ఎన్నికలతో మారిన సంఖ్యాబలం

2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 282 స్థానాల్లో గెలుపొంది మిత్రులెవరి అవసరం లేకుండానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సంఖ్యను సాధించింది. కానీ ఈ మధ్యకాలంలో వేర్వేరు కారణాలతో ఏర్పడ్డ ఖాళీలకు జరిపిన ఉప ఎన్నికల్లో వరుసగా తమ పాత స్థానాలు కోల్పోతూ వచ్చింది. తాజాగా జరిగిన ఉత్తర్‌ప్రదేశ్ ఉప ఎన్నికల్లో రెండు సీట్లు కోల్పోయాక సంఖ్యాబలం 282 నుంచి 274కు పడిపోయింది. ఇందులో స్పీకర్‌ను మినహాయిస్తే 273. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన కనీస బలం కూడా ఇదే. అంటే సొంత బలం బొటాబొటీ మెజారిటీకి పరిమితమైంది. గతంలో ఒక్క ఓటు కారణంగా వాజపాయి ప్రభుత్వం పడిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ఆ ప్రమాదం లేకున్నా పార్టీలో శతృఘ్న సిన్హావంటి తిరుగుబాటు నేతలు కూడా ఉన్నారు. ఇదే బాటలో అసమ్మతితో ఉన్న ఎంపీలు చాలా మందే ఉన్నారని, శతృఘ్న సిన్హాతరహాలో నోరెత్తడానికి వారంతా భయపడుతున్నారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఒకవేళ విపత్కర పరిస్థితుల్లో సొంతపార్టీ బలంపైనే ఆధారపడాల్సి వస్తే, ఇలాంటి తిరుగుబాటు ఎంపీల కారణంగా బీజేపీ సర్కారు కూలిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు. ప్రస్తుతం తెలుగుదేశం దూరమైనా, శివసేన సైతం అలిగినా, ఎన్డీయే ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదు. కాకపోతే అవిశ్వాస తీర్మానం సందర్భంగా సొంత పార్టీ అసమ్మతి బయటపడితేనే కష్టం.



గవర్నర్‌తో ఎస్సీ, ఎస్టీ కమిషన్ భేటీ

మర్యాదపూర్వకంగా కలిశాం : చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ సభ్యులతో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కమిషన్ ఏర్పడ్డ తర్వాత మొదటిసారి గవర్నర్‌ను కలిశారు. ఈ భేటీలో చాలా విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారని, వాటిని పాటించి ముందుకు వెళతామని ఈ సందర్భంగా శ్రీనివాస్ తెలిపారు. భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు 100 శాతం ఎస్సీ, ఎస్టీలకు అందేలా చూసే బాధ్యత మాపై ఉందన్నారు. అందుకు కావాల్సిన సూచనలు, సలహాలు గవర్నర్ మాకు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రతి ఒక్క దళితునికి సంక్షేమ పథకాల ద్వారా ఫలితం దక్కేలా కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు అనేక పథకాలు ప్రవేశపెట్టారని, కమిషన్ తరపున ఆయనకు కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కమిషన్ నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఇప్పుడు జీవంపోసి ముందుకు వెళతామన్నారు. ఈ కమిషన్‌కు త్వరలోనే వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 31 జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని జిల్లాల్లో నిధులు సక్రమంగా ఖర్చు పెట్టేందుకు విజిలెన్స్ కమిటీలు నియమిస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కొత్త పద్ధతులలో నిధులను, సంక్షేమ పథకాలను కిందిస్థాయి వరకు చేరేలా కృషి చేసామన్నారు. ప్రజలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌పై భరోసా కల్పిస్తామన్నారు.

మిత్ర పక్షాలను బలహీన పరుస్తున్న బీజేపీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మిత్రపక్షాలను బలహీనపర్చి తాను బలపడాలన్న కుటిల వ్యూహంతో భారతీయ జనతా పార్టీ వ్యవహరిస్తోందని తెలుగుదేశం పార్టీ ఎంపీలు మండిపడ్డారు. వరుసగా 10వ రోజు పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. ప్రతి రోజూ ఏదో ఒక వేషధారణలో వచ్చే చిత్తూరు ఎంపీ శివప్రసాద్ శుక్రవారం మత్స్యకారుడి వేషంతో వచ్చారు. చేతిలో ఒక వలను కూడా పట్టుకొచ్చిన శివప్రసాద్, ఆ వలతో మోడీకి గాలం వేస్తానని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎంత పోరాడినా, ఏం చేసినా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడాన్ని తెదేపా ఎంపీలు తప్పుబడుతున్నారు. అంచెలంచెలుగా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ముందు తమ నేతలు మంత్రి పదవులకు రాజీనామాలు చేశారని, అయినా సరే స్పందన లేకపోయిందని ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ ఎన్డీయేలో భాగస్వామిగా కొనసాగినందున అవిశ్వాస తీర్మానం పెట్టలేకపోయామని, ఎన్డీయే నుంచి బయటికొచ్చిన మరుక్షణమే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని ఎంపీలు చెప్పుకొచ్చారు. నిజానికి వైకాపా ప్రవేశపెట్టిన తీర్మానంపై తమకు నమ్మకం లేదని, ఎందుకంటే ఆ పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రధాని కార్యాలయంతో మంతనాలు సాగిస్తూ ఈ తీర్మానం పెట్టారని అన్నారు. గాంధీ విగ్రహం వద్ద ధర్నా అనంతరం సభలోకి వెళ్లగా, స్పీకర్ సభ సజావుగా లేదన్న సాకుతో వాయిదా వేయడంతో ఆ వెంటనే ఎంపీలు విజయ్ చౌక్ దగ్గరికొచ్చారు. ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. తమిళనాడు, ఈశాన్య రాష్ట్రాల్లో స్థానిక మిత్రపక్షాలను బలహీనపరిచి తాను ఎదిగే ప్రయత్నం బీజేపీ చేసిందని, అదే క్రమంలో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ చేస్తుందని మండిపడ్డారు. సభలో సభ్యులంతా ఎంత ఆందోళన చేస్తున్నా, ఎంత గందరగోళం నెలకొన్నా మనీ బిల్లును మాత్రం పాస్ చేశారని, ఇప్పుడు అవిశ్వాస తీర్మానం విషయం వచ్చేసరికి సభలో గందరగోళం ఉందంటూ సాకులు చెబుతున్నారని దుయ్యబట్టారు. ఈ పాలన ఏక వ్యక్తి నియంతృత్వంగా ఉందని, ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని జయదేవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహాత్మాగాంధీ వర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నల్గొండ జిల్లాల్లో గల మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎం యాదగిరి నియమితులయ్యారు. కామర్స్ ప్రొఫెసర్ అయిన ఎం యాదగిరి ప్రస్తుతం తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేస్తున్నారు. మహాత్మాగాంధీ రిజిస్ట్రార్‌గా నియమించినట్టు తెలంగాణ యూనివర్సిటీకి ఉత్తర్వులు అందడంతో ఆయనన యూనివర్సిటీ నుంచి రిలీవ్ చేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు.

ఇంటింటికీ 'తెలంగాణ చరిత్ర'

ఉగాది నాడు పంపిణీకి భాషా సాంస్కృతికశాఖ చర్యలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగు వెలుగును, తెలంగాణ చరిత్రను క్రోడీకరిస్తూ ప్రభుత్వం రూపొందించిన సాంస్కృతిక కరదీపికను రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ చేరవేసేందుకు భాషా, సాంస్కృతికశాఖ చర్యలు చేపట్టింది. నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన 68 పేజీలతో కూడిన బుక్‌లెన్‌ను పంపిణీ చేయనున్నారు. తెలంగాణ భౌగోళిక పరిస్థితులు, తిథులు, వారాలు, నక్షత్రాలు, రాశులు, వర్ణమాల, కార్తెలు, ప్రాచీన కాలగమనం, రాష్ట్ర చిహ్నాలు, కళలు, పండుగలు, పాటలు, ఆటలు, నీతి పద్యాలు ఇలా 20 రకాల అంశాలు ఇందులో క్లుప్తంగా ఉంటాయి. ఈ కరదీపికను ముఖ్యమంత్రి ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూపొందించారు. ఉగాది పండుగ సందర్భంగా మార్చి 18కల్లా కరదీపికను ప్రతి ఇంటికి చేరవేయడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధంచేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు 80 లక్షల పుస్తకాలను పంపించినట్లు భాషా, సంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. మిగతా 30 లక్షల పుస్తకాలను స్థానికంగా జిల్లా స్థాయిలో ముద్రించుకోవాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు. పుస్తకాల పంపిణీ బాధ్యతలు సైతం జిల్లా కలెక్టర్లకే అప్పగించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ సిబ్బంది ద్వారా ప్రతి మండలం, ప్రతి గ్రామంలోని ప్రతి గడపకు చేరవేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలుగు మహాసభల సందర్భంగా కేసీఆర్ చేసిన సూచన మేరకే తెలంగాణ తెలుగును పరిచయంచేసే కోణంలో కరదీపిక సిద్ధంచేశారు.

అవిశ్వాసం చేపట్టని లోక్‌సభ

● సభ సజావుగా లేదని వాయిదా వేసిన స్పీకర్
● సోమవారానికి మరో అవిశ్వాసం నోటీసు ఇచ్చిన టిడిపి, వైఎస్సార్సిపి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభ చర్చకు చేపట్టలేదు. సభా కార్యక్రమాలను నిర్వహించే సజావుగా లేనందున వీటిని చేపట్టలేమని స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. దాంతో అవిశ్వాస తీర్మానం నోటీసుపై ఎటువంటి చర్చ జరగకుండానే సభ సోమవారానికి వాయిదా పడింది. లోక్‌సభ సమావేశాలు శుక్రవారం ఉదయం 11గంటలకు ప్రారంభంకాగానే విపక్షాల ఆందోళనతో 12కు వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభం కాగానే స్పీకర్ సుమిత్రా మహాజన్ తనకు అందిన అవిశ్వాస తీర్మానాలను చదివారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవి.సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం అవిశ్వాస తీర్మానాలను ఇచ్చారని ఆమె సభకు తెలిపారు. సభ సజావుగా ఉంటే దీనిపై తదుపరి చర్యలు చేపడతామని ఆమె ప్రకటించారు.

అవిశ్వాసానికి మద్దతిచ్చిన కాంగ్రెస్, వామపక్షాలు

తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను స్పీకర్ సుమిత్రా మహాజన్ సభలో చదివి వినిపించారు. వాటికి ఎంతమంది మద్దతు ఇస్తున్నారన్న దాన్ని పరిగణనలోకి తీసుకుని చర్చిస్తామని స్పీకర్ చెప్పడంతో కాంగ్రెస్, సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ సహా వివిధ పార్టీల సభ్యులు తమ తమ స్థానాల్లో లేచి నిలబడ్డారు. సోనియాగాంధీ స్వయంగా తమ సభ్యులను లేచి నిలబడాలని కోరారు.

సభ ఆర్డర్‌లో లేకుండా బడ్జెట్ ఎలా పాస్ చేసుకున్నారు : వైఎస్సార్సిపి ఎంపీలు

అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు తీసుకోకపోవడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గందరగోళం మధ్యనే బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ఎలా పాస్ చేసుకుందని ఎంపీ వైవీసుబ్బారెడ్డి ప్రశ్నించారు. ప్రత్యేకహోదా కోసం తాము నాలుగేళ్లుగా ఆందోళన చేస్తున్నామని అయినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. అవిశ్వాస తీర్మానంపై కేంద్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరించిందన్నారు.

2019 లక్ష్యంగా ఏఐసీసీ ప్లీనరీ

● తీర్మానాలపై స్టీరింగ్ కమిటీ సమావేశం
● ప్లీనరీలో నేడు రాహుల్ ప్రసంగం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : 2019 ఎన్నికల తయారీ లక్ష్యంగా ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించింది. రెండు రోజుల పాటు చర్చించాల్సిన విషయాలపై స్టీరింగ్‌కమిటీ సభ్యులతో చర్చించింది. శుక్రవారం కానిస్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అధ్యక్షత వహించారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే సహా స్టీరింగ్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, వ్యవసాయం, విదేశాంగ విధానం, తదితర అంశాలపై ప్లీనరీలో తీర్మానాలు ఆమోదించాలని నిర్ణయించారు. ఈ అంశాలపై చర్చించేందుకు ప్రత్యేకంగా పలు సబ్ గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. శనివారం ఇందిరాగాంధీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు పార్టీ జెండా ఆవిష్కరించి రాహుల్ గాంధీ ఏఐసీసీ ప్లీనరీ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. మరణించిన నాయకులకు సంతాపం, స్వాతంత్ర సమరయోధులకు నివాళులు అర్పించిన అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రారంభ ఉపన్యాసం చేయనున్నారు. పార్టీలో యువరక్తం ఎక్కించడం, కార్యకర్తలకు ఎక్కువ భాగస్వామ్యం కల్పించాలని రాహుల్ గాంధీ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. 2019 ఎన్నికల కోసం పార్టీ యంత్రాంగాన్ని సంసిద్ధం చేసేందుకు ఏఐసీసీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

ప్రత్యేక హోదాపై తీర్మానం : ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి

కాంగ్రెస్ ప్లీనరీ లో రాజకీయ తీర్మానంలో ఏపీ ప్రత్యేక హోదా అంశాన్ని పెట్టామని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి తెలిపారు. యూపీఏ హయాంలో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని భాజపా విస్మరించడాన్ని ఖండిస్తూ రాజకీయ తీర్మానంలో ఏపీ అంశాన్ని పొందుపరిచామన్నారు. కాంగ్రెస్ ప్లీనరీ ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశాన్ని ప్రత్యేకంగా పెట్టడం చరిత్రాత్మకమని అభివర్ణించారు. ప్లీనరీలో రాజకీయ, వ్యవసాయ, నిరుద్యోగ, మహిళలు, ఎస్సీ, ఎస్టీ పేదరిక నిర్మూలన, అవినీతి అంశాలపై తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు.

బీజేపీపై చార్జీషీట్

అయిదు అంశాల్లో బీజేపీ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ చార్జీషీట్‌ను రూపొందించి. ఈ పుస్తకాలను ఏఐసీసీ సభ్యులందరికీ ప్లీనరీలో పంపిణీ చేయనున్నారు. యువతకు ఉపాధి, మహిళలు, విద్య, ఎస్సీ, ఎస్టీల సమస్యలు, వ్యవసాయం తదితర రంగాల్లో మోడీ ప్రభుత్వం వైఫల్యాలపై పుస్తకాన్ని రూపొందించారు.

వ్యవసాయంపై దృష్టి : టీపీసీసీ చీఫ్ ఉత్తమ్

కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో చర్చించే సబ్జెక్ట్స్ కమిటీలో చర్చలు జరిపామని తెలంగాణ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. రాబోయే కాంగ్రెస్ సర్కారు వ్యవసాయ రంగంపై ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పామన్నారు. ధాన్యం కొనుగోలుకు మద్దతు ఇవ్వాలని కోరామని తెలిపారు.

విద్యారంగంలో పెనుమార్పులు

● ప్రమాణాలు పెంపొందించడమే సర్కారు ధ్యేయం
● ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ లింబాద్రి

షాద్‌నగర్, ఆంధ్రప్రభ: ఉన్నత విద్యలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయని ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య లింబాద్రి చెప్పారు. విద్యారంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ముందుకు సాగాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక సర్దార్ వల్లభబాయ్ పటేల్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లింబాద్రి సీఎం కేసీఆర్ కన్న బంగారు తెలంగాణ కలలను విద్యార్థులు సాకారం చేయాలని పిలుపునిచ్చారు. ఐటి రంగంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యారంగం కూడా ప్రక్షాళన జరగాలని ఆయన చెప్పారు. ఉన్నత విద్యలో ప్రమాణాలను పాటించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమై అందులో రాణించాలని ఇందుకు పూర్తిస్థాయిలో తర్ఫీదు పొందాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

విద్యార్థి జీవితంలో డిగ్రీ విద్య ఎంతో ముఖ్యమైనదని ఇక్కడి నుంచే జీవితంలో స్థిరపడే అవకాశాలు ఉంటాయని చెప్పారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎంతో బాగా రాణిస్తున్నారని జాతీయ స్థాయిలో అనేక ర్యాంకులను సాధిస్తూ పట్టణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన చెప్పారు. ఎస్వీపీ డిగ్రీ కళాశాల యాజమాన్యం తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారన్న విషయం తెలిసి ఎంతో ఆనందించామని చెప్పారు. తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఈ కళాశాల మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఇందుకు విద్యార్థులు బాగా కష్టపడి చదవాలని కోరారు. ఈ సమావేశానికి హాజరైన మరో ముఖ్య అతిథి రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యుడు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, తాను పేదరికాన్ని జయించి ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. డిగ్రీ విద్యను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు విద్యార్థులు అధిరోహించాలని కోరారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని డిగ్రీ చివరి సంవత్సరంలోనే పోటీ పరీక్షలకు హాజరై అత్యున్నత స్థాయి ఉద్యోగం పొందేందుకు అవకాశం ఉందని చెప్పారు.

డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు శ్రద్ధగా చదవడంతో పాటు ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని కోరారు. డిగ్రీ పూర్తయిన వెంటనే పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసి వాటికి హాజరు కావాలని జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ముందుకు సాగితే ఆశించిన లక్ష్యాలను నెరవేర్చుకోవచ్చని ఆయన చెప్పారు. తాను కూడా పాలమూరు జిల్లా వాస్తవ్యుడనని షాద్‌నగర్ పట్టణానికి నాకు అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. వార్షికోత్సవం సందర్భంగా కళాశాల యాజమాన్యం నిర్వహించిన ఆటల పోటీల్లో రాణించిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతి ప్రదానం చేశారు. డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించడంతో పాటు వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం తరపున విశ్వనాథ్, మనోహర్‌రెడ్డి, స్వామి, భవానీ శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి.

హస్తానికి 'ప్రాంతీయ' సెగలు

• దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు • జాతీయ పార్టీలపై నమ్మకం కోల్పోతున్న ప్రాంతీయ పార్టీలు • కాంగ్రెస్ నాయకత్వానికి నో అంటున్న బీజేపీ వ్యతిరేక పార్టీలు • నూతన కూటమి ఏర్పాటు దిశగా మంతనాలు కొత్త నాయకత్వం కోసం ఆరాటం

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులుండరన్నది పాత నానుడే అయినా మారుతున్న కాలానికీ, రాజకీయా పార్టీలకు వర్తిస్తూ వస్తోంది. 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కంకణం కట్టుకున్న కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ చతురతను ప్రదర్శిస్తున్నప్పటికీ ప్రాంతీయ పార్టీల నుంచి మాత్రం అనుకున్నంత స్థాయిలో స్పందన రావడం లేదు. గతానుభవాల దృష్ట్యా జాతీయ పార్టీని నమ్ముకునే కంటే ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుతోనే బీజేపీకి గట్టిగా సమాధానం ఇవ్వాలన్నది ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల అభిమతంగా తెలుస్తోంది.ఈ నేపథ్యంలో 2019 సాధారణ ఎన్నికల్లో రాజకీయాలు ఎలా ఉండబోతాయన్నదే సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

న్యూఢిల్లీ: ఉత్తర్ ప్రదేశ్ ఉప ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపబోతున్నాయి.2019 సాధారణ ఎన్నికల్లో ఈ ఫలితాల ప్రభావండుంటుందా..? అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు..వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని కూడా ఖంగుతినిపించిన ఈ ఫలితాలు.. ప్రాంతీయ పార్టీలకు అనుకూలంగా మారాయి. అయితే 2019 సాధారణ ఎన్నికల్లోనూ ప్రాంతీయ పార్టీల హవా నడుస్తుందన్నది విశ్లేషకుల అంచనా. దేశవ్యాప్తంగా బీజేపీని వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీలను ఏకం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అది సాధ్యమయ్యే పనికాదని చెబుతున్నారు. గతానుభవాల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ మినహా మిగతా ప్రాంతీయ పార్టీలన్నీ ఏకమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని విశ్లేషిస్తున్నారు.

కొత్త కూటమి దిశగా అడుగులు

ఉత్తర్ ప్రదేశ్ ఉప ఎన్నికల్లో ఎస్పీ- బీఎస్పీ పార్టీల ఐక్యతతోనే ఈ విషయం తేటతెల్లమైందని...ప్రాంతీయ పార్టీల ఐక్యతతోనే బీజేపీకి కంచుకోటలాది గోరఖ్ పూర్, పుల్పూరు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ విజయ ధుందుభి మోగించాయని చెబుతున్నారు. ఇలాగే దేశ వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలను పక్కనబెట్టి..కొత్త కూటమిగా ఏర్పాటైతే 2019 సాధారణ ఎన్నికల ఫలితాలు భిన్నంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రాంతీయ పార్టీలను ఏకం చేసేందుకు తాను సిద్ధమని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ లాంటివారు ఆయన వ్యాఖ్యలను స్వాగతించారు. ఒకవేళ కేసీఆర్ దేశ రాజకీయాల్లో చక్రం తిప్పేందుకు వడివడిగా అడుగులు వేస్తే ప్రాంతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను దీటుగా ఎదుర్కోవచ్చని అంటున్నారు. బీజేపీని వ్యతిరేకిస్తున్న పార్టీలన్నీ కాంగ్రెస్ తో జతకట్టాలని అనుకోవడం లేదని..అదే జరిగితే 2019 ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే దేశ రాజకీయాలను శాసించగలవని విశ్లేషిస్తున్నాయి.

కాంగ్రెస్‌పై ప్రాంతీయ పార్టీల విముఖత

ఇటీవల 20 ప్రతిపక్ష పార్టీలకు కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ విందు ఇవ్వడంలోనూ బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకంచేసే ఉద్దేశమే ఉందని తేటతెల్లమైనప్పటికీ ప్రజలు మాత్రం హస్తంపార్టీని నమ్ముతారా అనే అనుమానం ఆయా ప్రాంతీయ పార్టీల అధినేతల మదిని తొలుస్తోంది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో జతకట్టే కంటే నూతన కూటమిని ఏర్పాటు చేసి బీజేపీపై పోరాటం చేయడమే మంచిదన్న అభిప్రాయంలో ఎక్కువమంది ప్రాంతీయ పార్టీల నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అదే జరిగితే అది కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బే. అయితే కాంగ్రెస్ కమ్యూనికేషన్ ఇన్‌చార్జి రణ్ దీప్ సూర్జేవాలా ఇటీవల



బీజేపీపై విమర్శలు ఎక్కుపెడుతూ.. ప్రజలు మోడీ బ్రాండ్ రాజకీయాలపై నమ్మకం కోల్పోయారని.. మోడీ మాటల గారడీ తప్ప మరేమీ చేయడం లేదని అభిప్రాయాలకు వచ్చిన ప్రజలు దేశంలో మరో ప్రత్యామ్నాయం ఎదురుచూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే భారత ప్రజాస్వామ్య విలువలను కాపాడగలదన్నారు. రాజకీయాలు ఎప్పుడూ ఒక్కరికంగా ఉండవన్న ఆయన మాటలకు కూడా 2019 ఎన్నికల ప్రధాన పార్టీతో పాటు ప్రాంతీయ పార్టీల బలాబలాలను ప్రదర్శించేందుకు కేంద్ర బిందువుకావచ్చన్నది విశ్లేషకుల అభిప్రాయం.ఇక మరో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైపాల్ రెడ్డి.. తెలంగాణ రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ మాటలను స్టంట్ అని..ప్రజలను మోసం చేయడమే కేసీఆర్ మరో డ్రామా ఆడుతున్నారని వ్యాఖ్యానించడం ఆసక్తికరంగా మారింది. ఓవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రాంతీయ పార్టీలన్నింటినీ ఏకం చేసి 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్న తరుణంలో జైపాల్ రెడ్డి..కేసీఆర్‌పై చేసిన విమర్శలు ఇతర ప్రాంతీయ పార్టీల నాయకులకు కూడా మింగుడుపడటం లేదు. ఒకవేళ ప్రాంతీయ పార్టీల కూటమికి కేసీఆర్ నాయకత్వం వహిస్తే కాంగ్రెస్‌ను వారంతా పక్కనబెట్టేందుకు ఇలాంటి వ్యాఖ్యలు కారణంగా చూపే అవకాశాలూ లేకపోలేదు.

అస్తిత్వం కోసం ఆరాటం

ఉత్తర ప్రదేశ్ లో ఎస్పీ- బీఎస్పీ, ఏపీలో తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్, తెలంగాణలో టీఆర్ఎస్, మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ, పశ్చిమబెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్, తమిళనాడులో అన్నాడీఎంకే, బీహార్ లో ఆర్జేడీ లాంటి ప్రాంతీయ పార్టీలు కీలక భూమికను పోషిస్తున్నాయి. ఈ పార్టీలన్నీ ఏకతాటిపైకి వస్తే కాంగ్రెస్ పార్టీని దూరంగా ఉంచే అవకాశాలే ఎక్కువ అని విశ్లేషకుల అంచనా.ప్రాంతీయంగా ఎవరికి వారు తమ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నించే నాయకులు కాంగ్రెస్ మాట వినే పరిస్థితిలో లేరు. మరి ఈ పరిస్థితుల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీలను ఏకం చేస్తుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

సైకిల్ లేకున్నా నో ప్రాబ్లమ్!



• 50 మంది మద్దతు ఇస్తేనే విశ్వాసం
• సభలో ఎన్డీఏ దేనికైనా రెడీ • మెజారిటీపై బీజేపీ ధీమా

న్యూఢిల్లీ: జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డిఎ)తో తెలుగుదేశం పార్టీ(టిడిపి) తెగదెంపులు చేసుకోవడంతో దిగువ సభలో ఎన్‌డిఎ పూర్తి బలం 314కు చేరుకుంది. ఎన్‌డిఎ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమిని వీడిన తొలి పార్టీ టిడిపి కావడం విశేషం. భారతీయజనతాపార్టీ(బిజెపి) 2014లో బ్రహ్మాండమైన విజయంతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి స్వంతంగా 282 స్థానాలు గెలుచుకుంది. బిజెపి, టిడిపి, శివసేన, ఎల్‌జెపి, ఎస్‌ఎడి, తదితర రాజకీయ పక్షాలతో కూడిన ఎన్‌డిఎ మొత్తం 336 స్థానాలను సంతరించుకుంది. అయితే దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత కూటమి స్వయంగా ఇరకాటంలో చిక్కుకుంది. 536 మంది సభ్యుల లోక్‌సభలో బిజెపి బలం ఇద్దరు నామినేటెడ్ సభ్యులను కలుపుకొని 274కు పడిపోయింది.

ఇటీవల యూపీలో గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్, బీహార్‌లో అరారియా లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో బిజెపి ఓటమిపాలైంది. అంతేకాక యూపీలో కైరానా, పాల్‌ఘూర్, మహారాష్ట్రలో భండారా-గోండియా స్థానాలకు ఉపఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ మూడు స్థానాల్లో గెలుపుపై బిజెపి కోటి ఆశలు పెట్టుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్‌డిఎ నుంచి టిడిపి నిష్క్రమించడంతో దిగువ సభలో కూటమి మొత్తం బలం 314కు పడిపోయింది. 2014లో కేంద్రంలో ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన కూటమితో తెగదెంపులు చేసుకున్న భాగస్వామ్య పక్షంగా టిడిపి నిలిచింది. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఒక అవిశ్వాస తీర్మానంపై నోటీసును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక నోటీసు ఇచ్చిన ఒక రోజు తర్వాత టిడిపి ఈ నిర్ణయం తీసుకుంది. లోక్‌సభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 9 మంది ఎంపీలు ఉండగా, టిడిపికి 16 మంది ఉన్నారు. సభలో కనీసం 50 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చినప్పుడు మాత్రమే దానిపై చర్చకు అనుమతిస్తారు. తీర్మానాన్ని చేపట్టిన పక్షంలో సభ దానిపై చర్చిస్తుంది. ఓటింగ్ జరుపుతుంది. అత్యధిక సభ్యులు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన పక్షంలో తీర్మానాన్ని సభ ఆమోదిస్తుంది. ప్రభుత్వం తప్పనిసరిగా వైదొలగాల్సి ఉంటుంది. టిడిపి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు తీర్మానానికి మద్దతు ఇచ్చినప్పటికీ ఎన్‌డిఎ సర్కారుకు ఎలాంటి ముప్పు ఉండదు. లోక్‌సభలో దాని సంఖ్యా బలం అవసరమైన మెజార్టీ కన్నా అధికంగానే ఉంటుంది.

సంఖ్యా బలంతో ఉన్న ప్రభుత్వం దేన్ని చేపట్టడానికైనా సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ ఇప్పటికే స్పష్టం చేశారు.

ప్రస్తుతం బిజెపికి అనుకూల పక్షాలుగా లోక్‌జనశక్తి పార్టీ(6), అకాలీదళ్(4), రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ(3), అప్నా దళ్(2), జెడి-యు(2), ఎఐఎన్‌ఆర్‌సి, జెకెపిడిపి, ఎన్‌పిపి, పిఎంకె, ఎస్‌డిఎఫ్, స్వాభిమాని పక్షచెరి ఒక స్థానంతో ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అన్నాడిఎంకె పార్టీకి 37 మంది ఎంపీలు ఉన్నారు. అన్నాడిఎంకె 2014 ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా పోటీ చేసింది. కానీ దాని మిత్రపక్షంగా కనిపిస్తున్నది. అయితే ఎన్‌డిఎకు టిడిపి తన మద్దతు ఉపసంహరించుకోవడంతో అందరి దృష్టి శివసేనపైన పడింది. ప్రస్తుతం ఆ పార్టీ ఏం చేస్తుందనే ఆసక్తి నెలకొంది. శివసేన కూటమి నుంచి తప్పుకుంటానని మోడీ సర్కారును ఇప్పటికే బెదిరించింది. అంతేకాక 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తానని తేల్చి చెప్పింది. ఒకవేళ శివసేన టిడిపి తరహాలో మద్దతును ఉపసంహరించుకున్న పక్షంలో 314గా ఉన్న ఎన్‌డిఎ సంఖ్యా బలం 296కు పడిపోతుంది. అంటే మ్యాజిక్ ఫిగర్ అయిన 273కు కేవలం 23 అధికంగా ఉంటుంది.

ఎన్డీఏకు శివసేన గుడ్‌బై?

• తెదేపా అవిశ్వాస తీర్మానానికి మద్దతు
• హస్తినలో మారుతున్న రాజకీయ సమీకరణాలు
• చంద్రబాబు చుట్టూ ప్రాంతీయ పార్టీల్లో కదలిక



లోక్‌సభలో పార్టీల బలాబలాలు

బిజెపి	274	కాంగ్రెస్	48
అన్నాడిఎంకె	37	ఎఐటిసి	34
బిజెడి	20	ఎస్ఎస్	18
టిడిపి	16	టిఆర్ఎస్	11
వైకాపా	9	సిపిఎం	9
ఎస్పి	7	ఎల్‌జెఎస్‌పి	6
ఎన్‌సిపి	6	ఆర్‌జెడి	4
ఎస్ఎడి	4	ఎఎపి	4
ఎఐయుడిఎఫ్	3	స్వతంత్రులు	3
ఆర్ఎస్ఎల్‌పి	3	ఐఎన్ఎల్‌డి	2
ఐయుఎంఎల్	2	జడి(ఎస్)	2
జెడి(యు)	2	జఎంఎం	2
అప్నాదళ్	2	ఎఐఎంఐఎం	1
ఎఐఎన్ఆర్‌సి	1	సిపిఐ	1
కెసి(ఎం)	1	జఅండ్‌కెఎన్‌సి	1
జెఅండ్‌కెపిడిపి	1	ఆర్ఎస్‌పి	1
ఎస్‌డిఎఫ్	1	ఎన్‌పిపి	1
పిఎంకె	1	ఎస్‌డబ్ల్యుపి	1
	390		149

మొత్తం : 539

న్యూఢిల్లీ: ఎన్డీఏ కూటమి బీటలు వారుతోంది. మొన్న మంత్రివర్గం నుంచి బయటకొచ్చిన తెలుగుదేశం పార్టీ తాజాగా ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగింది. మంత్రిమండలిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. తెదేపా ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, సమాజ్‌వాదీ, ఎన్సీపీ, ఎంఐఎం, వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి. తాజాగా ఎన్డీఏ చిరకాల మిత్రపక్షమైన శివసేన కూడా మద్దతు పలికింది. ఈ నేపథ్యంలో ఎన్డీఏ నుంచి శివసేన కూడా బయటకు వచ్చినట్లేనని, అందుకు ఇదే సరైన సమయమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. శివసేన అధినేత ఉద్ధవ్ థాకరే శనివారం లేదా సోమవారం ఉదయం పార్టీ అత్యున్నత కమిటీ సమావేశమై హస్తినలో మారుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్లు ఆ పార్టీ అధికార ప్రతినిధి వెల్లడించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి మెజారిటీతో కొనసాగుతోంది. తెలుగుదేశం బయటకొచ్చినప్పటికీ, కూటమిలో శిరోమణి అకాలీదళ్(4), ఎల్జేపీ(3), అప్నాదళ్(2), జేడీయూ(2), ఎన్‌పీపీ, పీఎంకే, ఎస్‌డీఎఫ్, ఎఐఎన్ఆర్‌సీ, జేకే పీడీపీ, ఎస్‌డీఎఫ్, స్వాభిమాన్ పక్ష పార్టీలకు ఒక్కొక్క సభ్యుడు. మొత్తం ఎన్డీఏ 336 స్థానాల్లో టీడీపీ (16), శివసేన (18) బయటకొస్తే... ఎన్డీఏ బలం 304కు పడిపోతుంది. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మరికొన్ని పార్టీలు జతకలిస్తే... పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకం. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేది లేనిది ఇంకా స్పష్టం చేయలేదు. పార్టీ అధిష్టానం నిర్ణయానుసారమే తాము నడుచుకుంటామని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత జితేందర్ రెడ్డి, ఎంపీ వివేక్ ఢిల్లీలో మీడియా సమావేశంలో వెల్లడించారు. బీజేపీకి సొంతంగా 274 మంది సభ్యుల బలం ఉంది. ప్రభుత్వానికి ఢోకా లేదు. అయితే రానున్న సాధారణ ఎన్నికల దృష్టిలో పరిశీలిస్తే... ఎన్డీయే కూటమికి ప్రధానంగా బీజేపీకి ఎదురుదెబ్బ తప్పదని సంకేతాలు చెబుతున్నాయి.

బాబు నేతృత్వంలో కూటమి?

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రంగంలోకి దిగిన తనకున్న రాజకీయ చతురతతో వ్యవహరిస్తే... ప్రాంతీయ పార్టీలు అత్యధికంగా ఓ కూటమిగా ఏర్పడే అవకాశముంది. ప్రధానంగా ఎన్డీఏ కూటమిలోని శిరోమణి అకాలీదళ్, శివసేనలతో పాటు ప్రతిపక్ష కూటమిలోని తృణమూల్ కాంగ్రెస్, తటస్థంగా ఉన్న వామపక్షాలు, బిజూజనతాదళ్, సమాజ్‌వాదీ, ఆమ్ ఆద్మీ, జేడీయూఎస్ తదితర పార్టీలు జట్టు కట్టే అవకాశముందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

యూపీఏ బలోపేతం సాధ్యమేనా?

కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం వారం రోజులుగా యూపీఏని బలోపేతం చేసే అంశంపై దృష్టిసారించింది. చిరకాల మిత్రపక్షమైన ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌తో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంతనాలు జరిపారు. యూపీఏ కన్వీనర్‌గా శరద్ పవార్ వ్యవహరించే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు యూపీఏకు అంశాల వారీ మద్దతు ఇస్తున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతోనూ కాంగ్రెస్ అధినాయకత్వం చర్చలు జరుపనున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. యూపీఏ కూటమిలో వామపక్షాలు ఉంటే... మమతాబెనర్జీ వెనకంజ వేసే అవకాశముందని ఓ వాదన వినిపిస్తోంది. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి వామపక్షాలు ప్రధానంగా సీపీఎం సుముఖంగా లేదు. ఇటీవల కోల్‌కతాలో నిర్వహించిన పొలిట్‌బ్యూరోలో ఇదే అంశంపై చర్చ జరిగింది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో కలిసి నడుద్దామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రతిపాదనలకు పొలిట్‌బ్యూరోలో ఆమోదం లభించలేదు. కాంగ్రెస్, బీజేపీలకు సమదూరం పాటిస్తూ... వామపక్ష కూటమి బలోపేతం చేయడం దృష్టి సారించాలని తీర్మానించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌తో జతకట్టడం కంటే... రాష్ట్రాల ప్రయోజనాలే పరిరక్షణే లక్ష్యంగా సాగే ప్రాంతీయ పార్టీలతో కలిసి ముందుకు సాగడం మంచిదనే అభిప్రాయంతోనే మమతా బెనర్జీ ఉందని తెలుస్తోంది. ఎన్డీఏ కూటమి నుంచి టీడీపీ వైదొలగిన నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి ఇదే అంశాన్ని ప్రస్తావించింది. బిజూజనతాదల్ అధినేత, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా అటు కాంగ్రెస్, ఇటు బీజేపీకి సమదూరం పాటిస్తున్నారు. జాతీయ స్థాయిలో చంద్రబాబు కూటమి ఏర్పాటుకు నడుంబిగిస్తే... నవీన్ పట్నాయక్ కూడా జై కొడతాడని సమాచారం. సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయం సింగ్ యాదవ్, తన చిరకాల మిత్రుడు చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నానని తన మనసులోని మాటను మరోమారు బయటపెట్టాడు. ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా ప్రాంతీయ పార్టీలు కూటమి కడితే, తాము ఆలోచిస్తామని సంకేతాలిచ్చాడు. ఇటీవల యూపీలో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో బద్ధశత్రువులైన ఎస్పీ, బీఎస్పీ దోస్తీతో అధికార బీజేపీని మట్టికరిపించిన విషయాన్ని గుర్తుచేస్తూ అఖిలేష్ ఈ వ్యాఖ్యలు చేశాడు. కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా మరో కూటమి ఏర్పాటుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నానని ఇటీవల టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అటు చంద్రబాబు, ఇటు కేసీఆర్ కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా కూటమి కడితే పరిస్థితి ఎలా ఉంటుందో కాలమే నిర్ణయించాలి.


జాతీయ పార్టీలపై సన్నగిల్లుతున్న విశ్వాసం

అమరావతి, ఆంధ్రప్రభ: జాతీయ పార్టీలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్నాయి.. ప్రాంతీయ పార్టీలు అవసరం లేదనీ, ఉండకూడదనే ఆలోచన తప్పు.. ఉభయ పార్టీలు జాతీయ దృక్పథం లేకుండా వ్యవహరిస్తున్నాయి.. రాష్ట్రాల్లో సమస్యలు సృష్టించి, బలహీన పర్చాలనే పద్ధతి మంచిదికాదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం అసెంబ్లీ సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి విలేకరులతో ఇష్టాగోష్టిలో మాట్లాడుతూ విపక్ష వైకాపా, జనసేనాని పవన్‌కళ్యాణ్‌ల వ్యవహార శైలిపై మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై అసహనం వ్యక్తం చేశారు. విలేకరులతో పలు విషయాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల వెనుక ఉన్నవారి విషయం కూడా త్వరలోనే బయటకు వస్తుందన్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయాలపై కూలంకుషంగా మాట్లాడారు. పార్టీల పట్ల ప్రజల్లో నమ్మకం లేకపోయినా ఫర్వాలేదనీ, కానీ ద్వేష భావం ఉండకూడదన్నారు. ద్వేష భావం కలిగితే చాలా ప్రమాదమన్నారు. ఈ విషయంలో రెండు జాతీయ పార్టీలు జాగ్రత్తగా వ్యవహరించాలని హితవు పలికారు.


రిజర్వేషన్ల హక్కు రాష్ట్రాలదే

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఒకే దేశం - ఒకే నీతి నినాదంతో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఎంపీలు చేపట్టిన ఆందోళనతో పార్లమెంటు బడ్జెట్ మలి దశ సమావేశాల రెండవ వారం ముగిసింది. ప్రతి రోజూ పార్లమెంటు ఆవరణలో వేర్వేరు చోట్ల ధర్నా చేస్తున్న ఎంపీలు, శుక్రవారం పార్లమెంటు భవనం ప్రధాన ద్వారం వద్ద ప్లకార్డులు పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు. అనంతరం సభ ప్రారంభమయ్యాక సభ లోపల కూడా ఆందోళన కొనసాగించారు. అయితే మధ్యాహ్నం గం. 12.00 సమయంలో సభ పునః ప్రారంభమయ్యాక ఏపీ నేతలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు స్పీకర్ ముందుకు వచ్చిన సమయంలో అన్నాడీఎంకే ఎంపీలతో పాటు టీఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చారు. రోజూ మాదిరిగానే నినాదాలతో హోరెత్తించారు. ఈ ఆందోళననే సాకుగా చూపుతూ స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. దీంతో ఏపీ ఎంపీల్లో కొందరు తెరాస పరోక్షంగా బీజేపీకి మద్ధతిచ్చినట్టయిందని వ్యాఖ్యానించారు. అయితే మళ్లీ ఇదే పరిస్థితి సోమవారం పునరావృతం కాకుండా టీఆర్ఎస్ నేతలతో చర్చలు జరుపుతామని ఏపీ ఎంపీలు అన్నారు. ఆందోళన సందర్భంగా టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత ఏపీ జితేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తాము దేశమంతటా ఒకే పద్ధతి, ఒకే న్యాయం ఉండాలని కోరుతున్నామని తెలిపారు. రిజర్వేషన్ల విషయంలో ఒక రాష్ట్రంలో ఒక విధంగా, మిగతా రాష్ట్రాల్లో మరో విధంగా ఉండడం ఎంతమేర సమంజసమని ప్రశ్నించారు. రిజర్వేషన్లతో పాటు పనికి ఆహార పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని కూడా తాము చాలా రోజులుగా కోరుతున్నామని, కానీ కేంద్రం ఈ విషయాన్ని సైతం పెడచెవిన పెడుతోందని ఆరోపించారు.

• లోక్‌సభలో వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు • ప్లకార్డులతో ప్రదర్శన



తెరపైకి ఫెడరల్ ఫ్రంట్



అమరావతి, ఆంధ్రప్రభ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వివిధ ప్రాంతీయ పార్టీలతో కూడిన ఫెడరల్ ఫ్రంట్ కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వం వహించే అవకాశాలున్నాయి. ఈ మేరకు రాజకీయ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. కేంద్ర మంత్రి వర్గం నుంచి మంత్రులను తప్పించడం, ఎన్డీయేతో తెగదెంపులు చేసుకోవడం, తాజాగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం వంటి కీలక పరిణామాల నేపథ్యంలో తెలుగుదేశం వ్యవహారం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఫెడరల్ ఫ్రంట్‌పై పార్లమెంటు సెంట్రల్ హాలులో ఎంపీల మధ్య చర్చలు కూడా ప్రారంభం కావడం గమనార్హం. తాజా పరిణామాల నేపథ్యంలో కూటమి అంటూ ఏర్పడితే చంద్రబాబు తప్ప సారథ్యం వహించగలిగిన నాయకుడు మరొకరు లేరనే రీతిలో కొత్త చర్చకు తెరలేవడం విశేషం. గతంలో కూడా ఇలాంటి కూటమిని విజయవంతంగా నిర్వహించిన విషయం బాబుకు ప్లస్ పాయింట్‌గా మారింది. అకాలీదళ్ పార్టీ నేత నరేష్ గుజ్రాల్ శుక్రవారం తెలుగుదేశం ఎంపీలతో ఇదే విషయమై చర్చించారు కూడా కాగా ఒకవైపు ఫెడరల్ ఫ్రంట్ వ్యవహారంపై చర్చ ప్రారంభం కాగా మరోవైపు టిడిపి నేతలతో వివిధ పార్టీల టచ్‌లోకి రావడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో మాట్లాడేందుకు నేతలు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఇప్పటికే చంద్రబాబుతో మాట్లాడించాలని టిడిపి నేతలను పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ కోరినట్లు తెలిసింది. శనివారం లేదా సోమవారం తెలుగుదేశం కీలకమైన నిర్ణయాలు తీసుకునే దిశగా వెళుతోంది, ఈ రోజు రాజకీయాల్లో బలంగా ప్రచారం జరిగింది. కాగా తాము ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఇతర పార్టీల మద్దతును కూడగట్టే ప్రయత్నాల్లో తెలుగుదేశం ఉన్నది. పలు పార్టీలకు చెందిన నేతలందరు చంద్రబాబుతో సంప్రదింపులు ప్రారంభించారు. మజ్లీస్ అధ్యక్షుడు, ఆ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, టీడీపీ ఎంపీల అవిశ్వాస నోటీసుపై సంతకం చేశారు. ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీల మద్దతు కోరుతూ వారు సంతకాలు తీసుకునే పనిలో టిడిపి ఎంపీలు ఉన్నారు. సమాజ్ వాద్ పార్టీ అధ్యక్షుడు ములాయం సింగ్ యాదవ్ చంద్రబాబునాయుడుకు శుక్రవారం సాయంత్రం ఫోన్ చేసి మాట్లాడినట్లుగా తెలిసింది.

బీజేపీతో కలిసి వైసీపీ కుట్ర



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: వైఎస్సార్సీపీ ఎంపీలు బీజేపీతో కలిసి కుట్ర చేస్తున్నారని టీడీపీ ఎంపీలు మండిపడ్డారు. పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ముందు ఢిల్లీలోని సీఎం రమేష్ నివాసంలో ఎంపీలు సీఎం రమేష్, తోట నర్సింహం విలేకరులతో మాట్లాడారు. రాజధానిలో జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు సీఎం చంద్రబాబుకు వివరిస్తున్నామని, హామీల కోసం పోరాడుతున్నామని సీఎం రమేష్ అన్నారు. కేంద్రం మంత్రులు రాజీనామా సమర్పించినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. వైసీపీ అవిశ్వాస పెడుతున్నా, వారి మీద నమ్మకం లేకే తాము ఆ పని చేయాల్సి వస్తోందని చెప్పారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రధానమంత్రి కార్యాలయంలో దొరికిపోయారని, పీఎం కార్యాలయ అధికారులు ఫొటోలు తీయడంతో ఆయన పారిపోయారని సీఎం రమేష్ తెలిపారు. అనంతరం అవిశ్వాస తీర్మానం విషయంలో చంద్రబాబు అధ్యక్షతన ఎంపీల సమక్షంలో కీలక నిర్ణయం తీసుకున్నామని తోట నర్సింహం వెల్లడించారు. అప్పట్లో అవిశ్వాస తీర్మానం పెట్టకపోవడానికి కారణం బీజేపీతో భాగస్వాములుగా ఉండడమేన్నారు. రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకుంటుందేమోనని ఇన్నాళ్లూ వేచి చూశామని ఆయన చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను సవతి తల్లిగా చూస్తూ, వ్యంగ్యారోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎలాగైనా రాష్ట్రాన్ని గట్టెకించాలని చంద్రబాబు చూస్తున్నారని తోట వెల్లడించారు. అవిశ్వాస తీర్మానం బీజేపీకి సరైన గుణపాఠమని ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

అవిశ్వాస సంచలనం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా కోసం తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు జాతీయ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. ఏకంగా తెలుగుదేశం పార్టీ ఎన్‌డీఏ నుంచి బయటకు రావడం రాజకీయవర్గాలు, జాతీయ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టీడీపీ ఎన్‌డీఏ నుంచి బయటికి రావడం కొత్త సమీకరణలకు దారి తీయనుంది. ఇప్పటికే మోడీ ప్రభుత్వంపై కారాలు మిరియాలు నూరుతున్న శివసేన ఎన్ని రోజులు ఎన్‌డీఏలో ఉంటుందనేది అనుమానంగానే ఉంది. తమ అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా టీఎంసీ అధినేత్రి, సీఎం మమత బెనర్జీకి ఫోన్ చేసి అడిగినట్లు తెలిసింది. ఈ కొత్తస్నేహం కొత్త రాజకీయ సమీకరణలకు దారి తీయనుందనే అంచనాలొస్తున్నాయి. ఇప్పటికే యూపీ, బీహార్ లలో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడంతో రాబోయే ఎన్నికల ఫలితాలకు ఇవి సంకేతాలని విపక్షాలు అంచనా వేస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఫ్రంట్ ఏర్పాటు చేయాలని మమతా బెనర్జీ చాలా రోజుల నుంచి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ మేరకు వివిధ ప్రాంతీయ పార్టీల నేతలతో చర్చలు జరుపుతున్నారు. రాబోయే రోజుల్లో ఇది జాతీయస్థాయిలో కొత్త కూటమికి దారితీయనుంది. తృణమూల్ కాంగ్రెస్, బీజేడీ, ఎస్పీ, బిఎస్పీ, టీడీపీ తదిరత ప్రాంతీయ పార్టీలతో కలిపి మమతా బెనర్జీ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేసే అవకాశముందని తెలుస్తోంది. ఇప్పటికే అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్, వామపక్షాలు, టిఎంసి మద్దతు ఇచ్చిన నేపథ్యంలో నోటీసుపై చర్చ జరిపేందుకు అవసరమైన సభ్యుల బలం ఏర్పడింది. అయితే సభ సజావుగా లేదనే కారణంతో స్పీకర్ సభను వాయిదా వేస్తున్నారు. మిగిలిన రాజకీయ పక్షాలు అన్నాడిఎంకె, టీఆర్ఎస్ సభ వెల్‌లోకి రాకుంటే అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే అవకాశముంటుంది. అయితే సభలో తమకు పూర్తి సంఖ్యాబలం ఉందని బీజేపీ చెపుతోంది. అవిశ్వాస తీర్మానంపై భయపడాల్సిన అవసరం లేదంటోంది. ఈ తీర్మానం దారుణంగా ఓడిపోతుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి జివిఎల్ నరసింహరావు చెప్పారు. రాజకీయ కారణాలతోనే టీడీపీ తమపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిందన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ ఎత్తుగడ అని అన్నారు.

టీడీపీ పెద్ద తప్పు చేసింది



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలుగు దేశం పార్టీ ఎన్డీఏ భాగస్వామ్యం నుంచి వైదొలగాలని తీసుకున్న నిర్ణయం తమకేమీ ఆశ్చర్యం కలిగించలేదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహరావు ప్రకటించారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో టీడీపీ ఎన్నికలలో గెలవడం సాధ్యం కాదని కేంద్రం మీద ఏదో ఒక సాకు నెట్టి దురుద్దేశంతోనే బయటకు వెళ్లిపోయారని ఆయన విమర్శించారు. కేంద్రం చేసిన పనులన్నిటిని ప్రజల ముందు పెడతామని జీవీఎల్ తెలిపారు. కేంద్రం ఐదేళ్లలో చేయాల్సిన పనులు మూడేళ్లలోనే పూర్తి చేసిందని, ఐఐఎం, ఎయిమ్స్ వంటి విద్యా సంస్థలు రాష్ట్రానికి ఇచ్చామని గుర్తు చేశారు. 28 సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దల ను కలిసినా పనులు జరగలేదని పదే పదే చెప్పి చంద్రబాబు తన అసమర్థతను బయ ట పెట్టుకున్నారని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీజేపీ భాగస్వామ్యం నుంచి టీడీపీ వైదొలిగి పెద్ద తప్పు చేసిందని, దీని వల్ల తమ పార్టీకి ఎలాంటి నష్టం జరగదని తేల్చి చెప్పారు. తామింత వరకూ ఏ ఒక్క పార్టీని వదులుకోలేదని, ఇదే తమకు మంచి అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు. అబద్ధాల రాజకీయాలను ప్రజలు ఒప్పుకోరని జీవీఎల్ నరసింహరావు విమర్శించారు. 2019లో బీజేపీ గొప్ప రాజకీయ శక్తిగా ఏపీలో ఎదిగే అవకాశముందని, టీడీపీ రాష్ట్రంలో దారుణంగా ఓడిపోతుందని ఆయన జోస్యం చెప్పారు. బీజేపీ అంటే ఎంత భయమో, ఎంత శ్రద్ధో ఇప్పుడు అర్థం అవుతోందని జీవీఎల్ ఎద్దేవా చేశారు.

హోదా కోసమే ఆత్మ గౌరవ పోరాటం

అమరావతి, ఆంధ్రప్రభ: తెలుగు ప్రజల పట్ల, నవ్యాంధ్ర అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు నిర్ణయించి ఎన్‌డీయే నుంచి వైదొలిగామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలియజేశారు. రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంపై శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తాము పెడుతున్న అవిశ్వాసానికి దేశంలోని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటిస్తున్నాయని తెలిపారు. అవినీతి పరులకు అపాయింట్‌మెంట్లు, ఇంటర్వ్యూలు ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ నీతివంతమైన పాలన దేశానికి ఎలా అందించగలరని ప్రశ్నించారు. పార్లమెంటు సాక్షిగా చేసిన చట్టాలను, రాజ్యసభలో ఇచ్చిన హామీలను నెరువేర్చమని అడుగుతుంటే రాష్ట్రంలో టీడీపీని బలహీన పరిచే కుట్రలు ఎన్‌డీయే పెద్దలు చేస్తుండటం దారుణమన్నారు.

క్రీడాప్రభ


ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా షట్లర్ పి వి సింధు, పురుషుల విభాగంలో ప్రణయ్ మాత్రమే టోర్నీలో మిగిలారు. సింధు టోర్నీలో జైత్ర యాత్రను కొనసాగిస్తూ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఛాంపియన్ ఎన్ ఒకుహారాపై విజయం సాధించి సెమీస్‌లోకి అడుగు పెట్టగా.. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించి భారత అభిమానుల ఆశలను సజీవంగా ఉంచారు



ఇద్దరే మిగిలారు

• సెమీస్‌లోకి సింధు, క్వార్టర్స్‌లో ప్రణయ్
• నిరాశపరిచిన కిదాంబి శ్రీకాంత్

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో మహిళ సింగిల్స్ పోటీల్లో భారత తరపున టోర్నీలో నిలిచిన ఒక ఒక్క క్రీడాకారిణి పి వి సింధు తనపై భారత అభిమానులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా ముందుకు సాగుతోంది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో పివి సింధు తడాఖ చూపింది. ప్రపంచ ఛాంపియన్ జపాన్‌కు చెందిన నజోమి ఒకుహారాను 20-22, 21-18, 21-18 తేడాతో ఓడించి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి సెట్‌ను కోల్పోయిన సింధు అధైర్య పడకుండా రెండో సెట్‌లో పుంజుకుని సెట్‌ను కైవసం చేసుకుంది. మూడో సెట్లో కూడా అదే జోరును కొన సాగించి సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. పురు షుల విభాగంలో భారత్ షట్లర్ హెచ్ ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకోగా, కిదాంబి శ్రీకాంత్ ఓటమితో టోర్నీ నుంచి వైదొల గాడు. పాదంలో కాయలు కాయగా చికిత్సకోసం విరా మం తీసుకొని తిరిగి బరిలోకి దిగిన అన్ సీడెడ్ ప్రణయ్, మాజీ ప్రపంచ నం.3, 2014 ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం గెలుచుకున్న ఇండోనేషియా షట్లర్ టామి సుగియార్తోను 21-10, 21-19 తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. కాగా ప్రపంచ ర్యాంక్‌లో మూడో స్థానంలో ఉన్న శ్రీకాంత్ అన్ సీడెడ్ చైనా షట్లర్ హ్యూంగ్ యుక్సియాంగ్ చేతిలో 21-11, 15-21, 22-20 తేడాతో ఓడిపోయాడు. 52 నిమిషాలు కొనసాగిన వీరి మ్యాచ్ నువ్వా నేనా అన్నట్లు సాగింది. 'ప్రారంభంలో బాగా ఆడలేకపోయాను. మిగతా రెండు గేముల్లో పుంజుకున్నాను. కొన్ని తేలికగా వచ్చే పాయింట్లను మి స్ కావడంతో మ్యాచ్ కోల్పోవాల్సి వచ్చింది అని కిదాంబి' అన్నాడు.



లెక్కలేనన్ని ఫాల్ట్‌లు- కిదాంబి నిరసన


అంపైర్ నాపై కినుక వహించాడో మరి వేరే ఉద్దేశంతోనే ఏమైతేనేం నా తప్పిదాలను గుర్తిస్తూ పోయాడు. ఇది హస్యాస్పదం గా ఉంది అనిశ్రీకాం త్ అన్నాడు. 'ముందు రోజు అడిన మ్యాచ్‌లో అంపైర్ నా ఫాల్ట్ లను గుర్తించలేదు. ఈ మ్యాచ్‌లో లెక్క లేనన్ని తప్పిదాల ను గుర్తించాడు. ఇది చాలా హాస్యాస్పదం' అని విచారంగా శ్రీకాం త్ వ్యాఖ్యానించాడు. తొలి గేమ్‌లో సర్వీస్ తప్పిదాలు చాలా నే చేశాను. నేను అలా జరగా లని కోరు కోలేదు. ముం దురోజు ఒక్క ఫాల్ట్ కూడా చేయ లేదు. ఈ మ్యా చ్‌లో పరిస్థితి మారి పోయింది.ఒక టోర్నీలో ఆ వి ధంగా జరగకూడదు. ఒక నిబంధన ఉం డాలి అనిశ్రీకాంత్ అన్నాడు.

డబ్బుల్స్‌లో సాత్విక్, శెట్టి ఓటమి

డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకి రెడ్డి, చిరాగ్ శెట్టిలు తమ శాయశక్తులా పోరాడినప్పటికి ఫలితం లేకపోయింది. వీరు రెండో సీడెడ్ నెదర్లాండ్ ద్వయం మాతియాస్ బో, కార్‌స్టెన్ మోజెనెసెన్ చేతిలో 21-16, 16-21, 23-21 తేడాతో ఓటమి చెం దారు. సాత్విక్, చిరాగ్‌లు కీలకమైన మూడో సెట్లో సర్వీస్ తప్పిదాలు జరిగాయని ఒప్పుకుంటూ... 'ప్రతీ 2 లేదా 3 పాయింట్లకు మా ఫాల్ట్‌ను అంపైర్ గుర్తించాడు. అది కీలకసమయం. అది దురదృష్టకరం' అని అన్నారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణయ్ జెర్రీ చోప్రా, ఎన్ సిక్కి రెడ్డి జంట కూడా ఓటమి బాటనే పట్టారు. 24 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో చైనా జంట వాంగ్ యిల్యు, హాంగ్ డొంగోపింగ్‌ల చేతిలో 21-6, 21-10 తేడాతో ఓడిపోయారు.

అన్ని ఈవెంట్లలో కొత్త సర్వీస్ రూల్స్

'కొన్నేళ్లుగా మేము సర్వీస్ నింబంధనలను మెరుగు పర్చాలని ఆలోచిస్తున్నాము. ఇందుకోసం మండలి సభ్యులమంతా కలసి అన్ని రకాల పరిశోధనలు జరిపి విస్తృతంగా చర్చించాము. చివరికి కొత్త సర్వీస్ నిబంధనను ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య(బీడబ్ల్యుఎఫ్) టోర్నీలన్నింట్లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయిం చాము. ఈ కొత్త విధానంపై మా సభ్య దేశాలనుంచి సకారాత్మక అభిప్రాయాలు వస్తాయని ఆశిస్తున్నాము' అని బీడబ్ల్యుఎఫ్ అధ్యక్షుడు పాల్ ఎరిక్ హోయర్ అన్నాడు. తొలిసారిగా ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో దీన్ని ప్రయోగాత్మక అమలుచేసి పరిశీలిస్తాము. అనంతరం గ్రేడ్ 1 గ్రేడ్ 2 ఈవెంట్లతో పాటు థామస్, ఉబర్ కప్ ఫైనల్స్, నాన్జింగ్‌లో జరుగనున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అమలు చేయనున్నారు. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌ను ఈ కొత్త నిబంధన అమలు నుంచి మినహాయించారు.



సర్వీస్ నిబంధనల్లో మార్పే ఇందుకు కారణం

బీడబ్ల్యుఎఫ్ ఈ ఏడాది అన్ని ప్రముఖ టోర్నమెంట్లలో సర్వీస్ నిబంధనల్లో మార్పు తేవాలని నిర్ణయించింది. మార్చి 1 నుంచి ప్రయోగాత్మకంగా ఈ నిబంధ నలను అమలు కు శ్రీకారం చుట్టింది.

కొత్త నిబంధన ప్రకారం.. ' సర్వీస్ చేసే సమయంలో షటిల్ రాకెట్‌ను తాకే ముందు కోర్ట్ ఉపరితలం నుంచి 1.15 మీటర్ల ఎత్తులో ఉండాలి' అంపైర్లు సర్వీస్ తప్పిదాలను గుర్తించడానికి జడ్జి ముందు రెండు గ్లాస్ ప్యానెళ్లతో కూడిన ఒక పోల్‌ను ఏర్పాటు చేస్తారు. ఇవి పోల్స్ రెండు వైపులా కోర్టు మైదానం నుంచి 1.15 మీటర్ల ఎత్తులో ఉంటాయి. ఈ రెండు గ్లాస్ ప్యానెళ్ల రెండు వైపులా ఆకుపచ్చ రంగులో గీతలను మార్క్ చేస్తారు. సర్వీస్ నిర్ణీత ఎత్తును దాటితే జడ్జి తప్పిదంగా ప్రకటిస్తాడు.

క్రీడాకారుల వ్యతిరేకత

ఇందులో భాగంగా ఈ నెల ప్రారంభంలో జరిగిన జర్మన్ ఓపెన్‌లో దీన్ని అమలు చేశారు. కొత్త సర్వీస్ నిబంధనను భారత డబుల్స్ క్రీడాకారిణి ఎన్ సిక్కిరెడ్డి విమర్శించింది. అంతేకాక అంపైర్ వివాదాస్పద నిర్ణయాలను ఎత్తిచూపుతూ ఒక వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్‌చేసింది. 'బీడబ్ల్యుఎఫ్ సర్వీస్ జడ్జీలు మా కెరియర్‌తో ఆడుకుంటున్నా రు. ఈ స్థాయికి చేరుకోవడానికి మేము ఎన్నో ఏళ్లుగా శ్రమించాము. బీడబ్ల్యుఎఫ్ మా ఆవేదనను పట్టించుకోవడం లేదు' అని సిక్కిరెడ్డి వాపోయింది. తాజాగా ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్‌లో అమలు చేస్తోంది. సింగిల్స్‌లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ నెదర్లాండ్స్ షట్లర్ విక్టర్ అలెక్సెన్ కూడా వ్యతిరేకిస్తూ వీడియోల ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. తాను 1.94 మీటర్ల ఎత్తు ఉంటానని పేర్కొంటూ 1.15 మీటర్ల ఎత్తును మెయిన్ టెయిన్ చేస్తూ సర్వీస్ చేయడం కష్టంగా ఉంటుందని వ్యాఖ్యానించాడు. కొత్త నిబంధన వల్ల తప్పుడు నిర్ణయాలకు అవకాశముందని పి వి సింధు, లిన్ డాన్, లీ చోంగ్ వెయ్ తదితర దిగ్గజ షట్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొడుగ్గా ఉన్న ఆటగాళ్లపై వివక్ష చూపడానికే ఈ కొత్త నిబంధన తెచ్చారని డెన్మార్క్ కోచ్, కెన్నెత్ జొన్నాస్సెన్, భారత కోచ్ పుల్లెల గోపీ చంద్ వ్యాఖ్యానించాడు.

భారత్ వర్సెస్ బంగ్లా

శ్రీలంకకు షాక్



కొలంబో: ట్రైసిరీస్‌లో బంగ్లాదేశ్ మరోసారి సంచల నం సృష్టించింది. ఇదివరకే లంకపై 215 పరుగులు భారీ స్కోరు ఛేదించిన బంగ్లా జట్టు మరోసారి అదే జట్టుపై ఛేజింగ్‌లో విజయాన్ని సాధించింది. సిరీస్‌లో ఇప్పటి వరకూ బ్యాట్ ఝులిపించని మహ్మ దుల్లా సెమీఫైనల్ లాంటి మ్యాచ్‌లో తన క్లాస్ చూపి స్తూ కేవలం 18 బంతుల్లో 43 పరుగులతో అజేయం గా నిలిచి చరిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఆఖర్లో మహ్మదుల్లా అదరగొడితే ఆరంభంలో తమీమ్ ఇక్బాల్(50).. మిడిల్‌లో ముష్ఫికర్ రహీమ్(28)లు తమవంతు పాత్ర పోషించారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన లంక జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. కీపర్ కుశాల్ పెరీరా(61), కెప్టెన్ తిసార పెరీరా(58) రాణించారు.

ఆఖర్లో కొనసాగిన డ్రామా

ఆడేది లేదంటూ మొండికేసిన బంగ్లా

అది ఆఖరి ఓవర్. విజయానికి బంగ్లాదేశ్‌కు 12 పరుగులు కావాలి. ఆ దశలో బౌలర్ ఉదాన వరుసగా రెండు షార్ట్ పిచ్ బంతులు వేశాడు. రెండు బంతుల్లోనూ పరుగులేమీ రాకపోగా నాన్ స్ట్రైక్‌లో వున్న మహ్మదుల్లా స్ట్రైక్ కోసం ప్రయత్నించడంతో ఒక వికెట్ కూడా కోల్పోవాల్సింది. అంపైర్ వైడ్ కానీ, నో బాల్ కానీ ప్రకటించకపోవడంతో.. కెప్టెన్ షకిబుల్ ఆవేశంతో ఊగిపోతూ బ్యాట్స్‌మెన్‌ని వెనక్కి రావాల్సిందిగా ఆదేశించాడు. మహ్మదుల్లా, రూబెల్ హుసేన్‌లు పెవిలియన్ వైపుగా వడివడిగా అడుగులు వేస్తుండగా.. మ్యాచ్ నిర్వాహకులు సర్దిచెప్పడంతో కాసేపు డ్రామా తర్వాత మ్యాచ్ కొనసాగింది. ఆ తర్వాతి బంతినే ఆఫ్ సైడ్ ఆవల వచ్చిన బంతిని మహ్మదుల్లా ఫోర్‌గా మలచడం, తర్వాతి బంతికి రనౌట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకుని రెండు పరుగులు సాధించడం.. రెండు బంతుల్లో 6 పరుగులు చేయాల్సిన దశలో సిక్స్ బాది ఒక బంతి మిగిలివుండగానే విజయం అందించడం చకచకా జరిగిపోయాయి. మహ్మదుల్లా మ్యాచ్ గెలిపించిన విధానానికి కామెంటరీ బాక్స్‌లో వున్న బ్రెట్‌లీ నోరెళ్లబెట్టడం కనిపించింది.

శ్రీలంక 159-7

బంగ్లాదేశ్ 160-8(19.5)

నరైన్ బౌలింగ్‌పై మళ్లీ అనుమానాలు

కరాచి: వెస్టిండీస్ మిస్టరీ స్పిన్నర్ నరైన్ మరోసారి అనుమానాస్పద బౌలింగ్ యాక్షన్‌తో వార్తల్లో నిలిచాడు. ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో ఆడుతున్న నరైన్ బంతిని విసురుతున్నాడం టూ మ్యాచ్ అధికారులు గుర్తించారు. ఇదే విషయమై పాకిస్తాన్ మాజీ కీపర్ కెప్టెన్ మొయిన్ ఖాన్ కూడా అభ్యంతరం వ్యక్తం చేయడం జరిగింది. మరోసారి అతను బంతిని విసురుతున్న ట్టు గుర్తిస్తే పాకిస్తాన్ లీగ్‌లో బౌలింగ్ చేసే అవకాశా న్ని అతడు కోల్పోతా డు. అదే జరిగితే ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఇబ్బందులు తప్పవు. నరైన్ తప్పుకోవాల్సి వస్తే ఇప్పటికిప్పుడు నరైన్‌కు ప్రత్యామ్నాయం వెదకడం ఆ జట్టుకు సమస్యే. సూపర్ బౌలింగ్‌తో పాటూ వేగంగా పరుగులు చేయగలగడం నరైన్ బలం. నరైన్ బౌలింగ్‌పై అనుమానాలు లేవనెత్తడం ఇదే మొదటిసారి కాదు. గతంలో బంతిని విసురుతున్నాడన్న ఆరోపణల కారణంగా క్రికెట్‌కు దూరమైన నరైన్ తదనంతరం బౌలింగ్ యాక్షన్‌ను మార్చుకుని తిరిగి పొట్టి క్రికెట్‌లో మ్యాచ్ విన్నర్‌గా ఎదిగిన విషయం తెలిసిందే.

దాల్మియాపై పుస్తకం

• దాల్మియాకు అరుదైన గౌరవం

• పుస్తకం విడుదల చేసిన లంక బోర్డు

కోల్‌కతా: బీసీసీఐ మాజీ అధ్యక్షుడు జగ్‌మోహన్ దాల్మియాకు అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంక క్రికెట్ బోర్డు ఆయనపై ఓ పుస్తకం విడుదల చేసింది. 'ఎ ట్రిబ్యూట్ టు జగ్గు' పేరుతో పుస్తకాన్ని విడుదల చేసి నివాళి అర్పించింది. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ల అయిన సందర్భంగా శ్రీలంక క్రికెట్ బోర్డు ఈ రకంగా దాల్మియాను స్మరించుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన లంక క్రికెట్ బోర్డు ప్రెసిడెంట్ తిలంగ దాల్మియాను ధర్మం వైపు నిలబడిన ఒక హీరోగా కీర్తించారు. శ్రీలంక వాసి కాని వారిలో ఆ దేశ క్రికెట్ అభివృద్ధికి తోడ్పడిన వ్యక్తి దాల్మియా అని బోర్డు పేర్కొంది. పుస్తకాన్ని దాల్మియా తనయుడు అవిషేక్‌కు అందించారు. అవిషేక్ ప్రస్తుతం క్రికెట్ అసోషియేషన్ ఆఫ్ బెంగాల్‌కు సెక్రటరీగా పనిచేస్తున్నారు. మొత్తంగా భారత క్రికెట్‌నే గాక, ప్రపంచ క్రికెట్‌నే కొత్తపుంతలు తొక్కించిన వ్యక్తిగా దాల్మియాకు పేరుంది. 2001-04 మధ్యలో తొలిసారి బీసీసీఐ పగ్గాలు చేపట్టిన దాల్మియా... తదనంతరం 2013లో అప్పటి అధ్యక్షుడు శ్రీనివాసన్ అవినీతి ఆరోపణలపై తప్పుకోవడంతో తాత్కాలిక అధ్యక్షుడిగా పనిచేశారు. తర్వాత 2015లో మరోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టి.. ఆఫీసులో వుండగానే మరణించారు.

సెమీస్‌లో ఫెదరర్, వీనస్

ఇండియన్ వెల్స్ టోర్నీ



ఇండియన్ వెల్స్: డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్ ఇండియన్ వెల్స్ టోర్నీ లో సెమీస్‌కు చేరా డు. ఈ సీజ న్‌లో వ్యక్తిగ త ఉత్తమ ప్రదర్శనను చాటాడు. శుక్ర వారం జరిగిన సింగిల్స్ మ్యాచ్‌లో ఫెదరర్ దక్షిణ కొరియాకు చెందిన చుంగ్ హ్యేంగ్‌పై 7-5, 6-1 తేడాతో విజయం సాధించాడు. ఈ సీజన్‌లో వరుసగా ఆడిన 16 మ్యాచు ల్లో విజయాలు నమోదుచేసిన ఫెదరర్ ఆరోసారి ఇండియన్ వెల్స్ టైటిల్ సొంతం చేసుకునే లక్ష్యంగా ముం దుకు సాగు తున్నా డు. 2006 ఏటీపీ సీ జ న్ క్యాలెం డర్ లో కూడా ఫెదరర్ 16 వరుస విజయాలను నమోదు చేశా డు. సెమీ ఫైనల్లో ఫెదరర్ క్రొయేషి యాకు చెందిన బోర్నా కోరిక్‌తో ఆడను న్నాడు. కోర్నిక్ ఏడో సీడెడ్ కెవిన్ అండర్సన్‌ను 2-6, 6-4,7-6 (7/3) తేడాతో ఓడించాడు. గంట 23 నిమిషాలపాటు కొనసాగిన క్వార్టర్స్ ఫైనల్ మ్యాచ్‌లో ఫెద రర్ ఒక డబుల్ ఫాల్ట్‌తో 70శా తం తొలి సర్వీస్ పాయిం ట్లను గెలుచుకున్నాడు. చుంగ్ సర్వీస్ ను నాలుగు సార్లు బ్రేక్ చేశాడు.

17 ఏళ్ల తర్వాత సెమీస్‌లోకి

ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ విజేత వీనస్ విలియమ్స్ ఈ టోర్నీలో సెమీస్‌లోకి చేరింది. 2001 నుంచి ఈ టోర్నీకి దూర మయిన వీనస్ ఈ ఏడాది బరిలోకి దిగి టోర్నీ సెమీస్‌లో కి చేరి అభిమానుల్లో ఆనందాన్ని నింపింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌కు చెందిన స్యూరెజ్ నవార్రోపై 6-3, 6-2 తేడాతో విజయం సాధించింది. సెమీస్‌లో వీనస్ రష్యా క్రీడాకారిణి 20 ఏళ్ల డారియా కసత్‌కినాను ఢీకొన నుంది.

టెన్నిస్‌కు టామీ హాస్ గుడ్‌బై

ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు టామీ హాస్ తన 20 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికాడు. 39 ఏళ్ల హాస్ టెన్నిస్‌లోనే గాక క్రీడాప్రపంచంలోనే వయసును జయించిన ఆటగాళ్లలో ముందు వరసలో వుంటాడనడంలో సందేహం లేదు. ఫెదరర్, హెవిట్, నల్బందియన్ లాంటి ఆటగాళ్ల తరంలో మంచి ఆటగాడిగా పేరు తెచ్చుకున్నాడు. ఫెదరర్ అంతటి ఆటగాడిగా పేరులేకపోయినా గతంలో పలుసార్లు ఫెదరర్‌ని ఓడించిన ఘనత అతని సొంతం. ఇప్పటికీ ఫెదరర్, హాస్‌ల మధ్య మ్యాచ్ అంటే అభిమానులు ఎగబడతారు. అదే ఆటతీరుతో ర్యాంకింగ్స్‌లో ఒకానొక సమయంలో రెండవ ర్యాంకులో కొనసాగాడు. గ్రాండ్‌స్లామ్‌లు గెలవలేకపోయినా 15 ఏటీపీ టైటిల్స్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

కామన్ వెల్త్‌ను బహిష్కరిద్దాం

• షూటర్లకు జస్పాల్ రాణా పిలుపు
• ఆప్షనల్ గేమ్‌గా పరిగణించడంపై నిరసన

న్యూఢిల్లీ: 2018 కామన్‌వెల్త్ గేమ్స్‌ను బహిష్కరించాలంటూ ప్రముఖ షూటర్ జస్పాల్ రాణా పిలుపునిచ్చాడు. 2022 కామన్‌వెల్త్ గేమ్స్ నుంచి షూటింగ్‌ను ఆప్షనల్ గేమ్‌గా పరిగణించేలా నిర్ణయం తీసుకోవడంపై రాణా మండిపడ్డాడు. భారత్‌కు పతకాలు వచ్చే అంశాలన్నింటినీ ఇలా తొలగిస్తూ వస్తే ఎలా అని రాణా ప్రశ్నించాడు. "2018 కామన్‌వెల్త్‌లో భారత షూటర్లు పాల్గొనవద్దు. గతంలో చైనా ఆటగాళ్లు నాలుగు ఒలింపిక్స్ పాటూ ఆడకుండా.. మొత్తం టోర్నీని క్లీన్ స్వీప్ చేశారు. కామన్‌వెల్త్ గేమ్స్ ప్రతిష్టాత్మకమైనవే అయినా.. అందులో భారత షూటర్లకు పెద్ద పోటీ ఉండడం లేదు. 2018లో పోటీ చేయకపోతే పోయేదేమీలేదు. రానున్న రోజుల్లో ఆప్షనల్ గేమ్ చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకించండి" అని కోరాడు. 2022 నుంచి షూటింగ్‌ను ఆప్షనల్ గేమ్‌గా ప్రకటిస్తూ కామన్‌వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ నిర్ణయం తీసుకుంది. ఆప్షనల్ గేమ్ అంటే.. ఏ దేశంలో అయితే గేమ్స్ జరుగుతాయో ఆ దేశం నిర్ణయం మేరకు సదరు క్రీడావిభాగంలో పోటీలు నిర్వహించడం ఆధారపడివుంటుంది. బర్మింగ్‌హామ్‌లో జరగనున్న 2022 కామన్‌వెల్త్ గేమ్స్‌లో షూటింగ్‌లో పోటీలు నిర్వహించాలా లేదా అన్న విషయంపై నిర్ణయాన్ని బ్రిటన్‌కే వదిలేస్తారు. తర్వాతి పోటీల్లోనూ అదే పరిస్థితి వుంటుంది. ఇలాంటి వ్యవస్థ మీద జస్పాల్ రాణా తన నిరసన వ్యక్తం చేస్తున్నాడు. అర్జున అవార్డు గ్రహీత అయిన జస్పాల్ రాణా ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్‌లో పలు బంగారు పతకాలు సాధించాడు.



షమికి మళ్లీ అవకాశం!


• ఫిక్సింగ్ చేయకపోతే ఓకే
• ఐపీఎల్‌లో ఆడించటం డేర్‌డెవిల్స్ ఇష్టం
• వ్యక్తిగత విషయాలను పట్టించుకోం: బీసీసీఐ



న్యూఢిల్లీ: భార్య హసీన్ ఆరోపణల కారణంగా బీసీసీఐ కాంట్రాక్టు కోల్పోయిన క్రికెటర్ మొహమ్మద్ షమికి తిరిగి జట్టులోకి రానున్నా డా అంటే అవకాశాలైతే పుష్కలం గా వున్నట్టే కనిపిస్తోంది. ఫిక్సింగ్ ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే అతడిని తిరిగి జట్టులోకి తీసుకోవ డం తప్ప మరో అవకాశం లేదన్న రీతిలో బీసీసీఐ స్పందించింది. వ్యక్తిగత ఆరోపణల మీద అతడిని క్రికెట్‌కు ఎన్నో రోజులు దూరంగా వుంచలేమని భారత క్రికెట్ బోర్డు తెలిపింది. అందునా కోల్‌కతా పోలీసులు ఆ విషయంలో విచారణ చేస్తున్నందున ప్రస్తుతం ఫిక్సింగ్ ఆరోపణల మీద మాత్రమే చర్యలు తీసుకునే అధికారం వుంటుందని పేర్కొంది. వ్యక్తిగత ఆరోపణలపై చర్యలు తీసుకోవడంపై పలువర్గాల నుంచీ విమర్శలు ఎదురైన సంగతి తెలిసిందే. అదే సమయంలో క్లబ్ క్రికెట్ లాంటి ఐపీఎల్‌లో షమిని ఆడించాలా, లేదా అన్నది అతడిని కొనుగోలు చేసిన ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు సంబంధించిన విషయంగా అత్యున్నత క్రికెట్ బోర్డు అభిప్రాయ ఎడింది. అంటే ప్రస్తుతం షమి భవిష్యత్తు నీరజ్ కుమార్ కమిటీ నివేదికపై ఆధారపడి వున్నట్టు లెక్క. షమి ఫిక్సింగ్ చేసినట్టుగా కమిటీ నిర్ధారిస్తే అతడి కెరీర్ ముగిసినట్టే!

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively
Interaction
For
Ever
I
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
శనివారం
17 మార్చి 2018



ఫొటో యాత్ర!

అక్షరాలలాగే ఫొటోలు కూడా ఆసక్తికరమైన కథలను చెబుతాయి. ఇంకా చెప్పాలంటే అక్షరాల కంటే చిత్రాలు మరింత అందంగా కథలు చెప్పగలుగుతాయి. ఇక్కడ కనబడుతున్నవన్నీ అలాంటి కథలు చెప్పే ఫొటోలే. పైగా ఒక ఊరు ఒక ప్రాంతం ఒక దేశం కాదు...భిన్నదేశాలకు చెందిన మహిళా మణుల ఫొటోలు ఇవి. ఒక్కో ఫొటో ఒక్కో జీవిత చిత్రణ. అంతేకాదు...ఆయాదేశాల సామాజిక సాంస్కృతిక అంశాలను సైతం ఈ చిత్రాలు చిత్రిక పడుతున్నాయి. ఇవన్నీ ఒక పుస్తకంలోనివి కావటం విశేషం. ఆ పుస్తకం పేరు 'ది అట్లాస్ ఆఫ్ బ్యూటీ'. ఈ పుస్తక రచయిత మిహేలా నొరాక్. రొమేనియాకు చెందిన ఫొటోగ్రాఫర్... ఈమె. 50దేశాలు తిరిగి 500మంది మహిళల ఫొటోలతో...'ది అట్లాస్ ఆఫ్ బ్యూటీ' ని రూపొందించింది. భిన్నత్వంలోని బ్యూటీని ఆవిష్కరించడమే తన ఆశయమని...భిన్నత్వాన్ని సౌందర్యంగా భావిస్తే వివక్ష అనేది ఉండదని...సహనం సమానత్వాలు పెరుగుతాయని నొరాక్ అంటుంది. తన ఫొటోల ద్వారా ఆమె ఎల్లలు దాటిన జీవన తత్వాలను...ఎల్లలు లేని జీవితం తాలూకూ వెలుగులను ప్రపంచం ముందుకు తెచ్చింది. ఆమె పుస్తకాల్లోని కొన్ని ఫొటోలు... వాటిలోని స్త్రీల కథలు మీ కోసం-

ఆమె ఆశయం 'క్లిక్' అయ్యింది!

యాభై దేశాలు తిరిగి...500 మంది స్త్రీల ఫొటోలతో పుస్తక ప్రచురణ

భిన్నత్వమే జీవితంలోని అందం...అంటున్న మహిళా ఫొటోగ్రాఫర్...మిహేలా నొరాక్

ఒక దేశ సంస్కృతీ సంప్రదాయాలను ఎక్కువగా ప్రతిబింబించేది మహిళల జీవితాలే. ఎందుకంటే జీవితంతో మరింత ఎక్కువగా పెనవేసుకుని ఉండే ఆహార విధానం, కట్టుబొట్టు, అలంకరణ..ఇలాంటివాటి నిర్వహణలో ఆడవారి పాత్రే ఎక్కువ. మిహేలా నొరాక్ ఇథోపియా నుండి అమెరికా వరకు, గ్వాటెమాలా నుండి ఫ్రాన్స్ వరకు ప్రయాణించి... సహజత్వం, సాధికారత కలబోసిన అచ్చమైన అలాంటి స్త్రీలను, వారిలోని జీవన సౌందర్యాలను తన ఫొటోల ద్వారా పట్టుకుంది.

ఇథోపియాలో సమైరా..



సమైరాని నొరాక్ కాఫీషాపులో కలిసింది. ఆమెతో పాటు ఆమె స్నేహితురాలు కూడా ఉంది. సమైరా ముస్లిం కాగా ఆమె స్నేహితురాలు క్రిస్టియన్. ఇలా మతాలకు అతీతంగా అనిపించే మంచి స్నేహాలను ఇథోపియాలో చాలా చూశానంటారామె. అయితే అక్కడ జాతుల మధ్య తేడాలు విభేదాలు సైతం చాలా ఉన్నాయని, కానీ సమైరాని చూపి ఆమెతో మాట్లాడిన తరువాత ఆమెలోని విశాలదృక్పథం అర్థమైందని...తనలాంటి దయా హృదయులే ఈ ప్రపంచాన్ని సుఖశాంతులతో ఉంచుతున్నారనిపించిందని నొరాక్ తన పుస్తకంలో రాసింది.

గ్వాటెమాలాలో మరియా...



తను ఉంటున్న చిన్నపాటి పట్టణంలో మరియా కూరగాయలు అమ్ముతుంటుంది. ఆమె కెమెరాని చూడగానే సిగ్గుపడిపోయి పట్టుగా చెప్పిన నొరాక్...ఆ దృశ్యాన్నే తన కెమెరాలో బంధించింది.

చైనాలో... తాలిబన్ మహిళ



తను చూసిన స్ఫూర్తిమంతమైన మహిళల్లో ఈమె కూడా ఒకరని తెలిపింది నొరాక్. తాలిబన్‌కి చెందిన ఈ మహిళ చైనాలోని ఒక గ్రామంలో నివసిస్తోంది. తాను వెళ్లి తలుపు కొట్టినప్పుడు ఆమె ఇల్లు శుభ్రం చేస్తోందని, అయినా నగలను అలంకరించుకుని ...అందంగా కనిపించిందని నొరాక్... ఆమె గురించిన వివరణలో పేర్కొంది.

ఆఫ్ఘానిస్తాన్‌లో ఒక చిన్న మట్టి ఇంట్లో...



ఇక్కడ చిన్నపాటి మట్టి ఇళ్లలో నివసిస్తున్న జనం తలుపులు తెరచి ఆహ్వానించారని, అలాగే తమ జీవితాలను గురించి కూడా ఎలాంటి సంకోచం భయం లేకుండా చెప్పారని నొరాక్ పేర్కొంది. వారు ఉంటున్న వాతావరణంలో జీవించడం కష్టమే అయినా, తమ పూర్వులనుండి వచ్చిన చేతి వృత్తులనే చేసుకుంటూ వారూ బతికేస్తున్నారని పుస్తకంలో వివరించింది.

అమెరికాలో అబ్బి, ఏంజిలా...



అమెరికా వాసులైన ఇద్దరు అక్కాచెల్లెళ్లు అబ్బి, ఏంజిలా. వీరి తల్లి ఇథోపియాకు చెందిన మహిళ కాగా తండ్రి నైజీరియా వ్యక్తి. వీరి తల్లిదండ్రులు ఇద్దరు ఐక్యరాజ్య సమితికోసం పనిచేశారు...దాంతో ఈ అక్కాచెల్లెళ్లు మూడు భిన్న ఖండాల్లో ఆరుదేశాల్లో పెరిగారు. అయితే వారు గ్రాడ్యుయేషన్ తరువాత ఆఫ్రికాకు వెళ్లిపోయి...తమ తెలివితేటలను అక్కడి వారి సేవల కోసం వినియోగించాలని అనుకుంటున్నారు.

ఫ్రాన్స్‌లో ...అనియా



ఫ్రాన్స్‌లో పరిచయమైన అనియాకు పుట్టుకతోనే కుడికాలు లేదు. ఆమె జన్మస్థలం పోలెండ్. 19నెలల వయసులో ఆమెను ఒక బెల్జియన్ కుటుంబం దత్తత తీసుకుంది. అనియా బాల్యం చాలా ఆనందోత్సాహాలతో గడిచింది. ఆమెకు ఆటలంటే చాలా ఇష్టం. అడవుల్లో చెట్లు రాళ్ల మధ్య ఎంతో స్వేచ్ఛగా తిరిగేది... అయితే ఈ క్రమంలో తనకు అమర్చిన కృత్రిమ కాలుని చాలాసార్లు పోగొట్టుకుంది. అనియాకు తొడకండరం లేకపోవటం వలన ఆమెకు కృత్రిమ కాలుని అమర్చినా ఆటలు ఆడటం కష్టంగా ఉండేది. అయినా అథ్లెట్ కావాలనే కోరిక బలంగా ఉండేది. దాంతో ఆమె డాక్టర్లను సంప్రదించింది. ఎట్టకేలకు ఇప్పుడు అనియా పరుగెత్తగలుగుతోంది... పరుగులు తీయాలనే తన చిన్ననాటి కలని నిజం చేసుకుంది.

ఈక్వెడర్‌లో గిరిజన మహిళ



అమెజాన్ అడవుల్లో నివసిస్తున్న చాలా గిరిజన జాతులు ఇప్పుడు...ఆధునిక దుస్తులనే ధరిస్తున్నారు. అయితే ముఖ్యమైన సందర్భాల్లో మాత్రం వారు తమ సాంప్రదాయ దుస్తుల్లోనే కనిపిస్తుంటారు. అలాగే ఈక్వెడర్‌లో ఓ గిరిజన యువతిని తన పెళ్లి దుస్తుల్లో సాంప్రదాయ అలంకరణలో ఉండగా మిహేలి క్లిక్‌మనిపించింది.

నార్త్ కొరియాలో ...గైడ్



ఉద్యోగపరమైన యూనిఫాంలో చాలా క్రమశిక్షణగా నిలబడ్డ ఈ యువతి ఒక మిలటరీ మ్యూజియంలో గైడ్‌గా పనిచేస్తోంది.

భారత్‌లోని జోధ్‌పూర్‌లో...ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా....



చేతుల నిండుగా గోరింటాకు, పెదవులపై విరబూసిన నవ్వు, అందమైన దుస్తులతో కనబడుతున్న ఈ మహిళలో ...తనకు ఎంతో శక్తి, మరెంతో విశిష్టమైన వ్యక్తిత్వం కనిపించాయని....చాలామంది భారతీయ వనితల్లో తాను ఈ రెండు లక్షణాలను చూశానని నొరాక్ పేర్కొంది.

ఉక్రెయిన్‌లో అలినా



ఉక్రెయిన్‌లోని ఒడిస్సా వీధుల్లో అలినాని కలిసింది నొరాక్. ఆమె జీవితంలో ఏమంత ఆనందం లేదని...అయితే తనలో ఎన్నో లక్ష్యాలున్నాయని, చెక్ రిపబ్లిక్‌లో ఆర్కిటెక్చర్ చేయాలని కోరుకుంటున్నదని నొరాక్ పేర్కొంది.

గ్రీస్‌లో... సిరియా మహిళలు



సిరియాలో జరుగుతున్న యుద్ధానికి భయపడి గ్రీస్ దేశానికి పారిపోయి వచ్చిన ముగ్గురు మహిళలను తన ఫొటో యాత్రలో భాగంగా క్లిక్‌మనిపించింది మిహేలా నొరాక్. వీరు ముగ్గురు తల్లీ కూతుళ్లు.

మన సహనంప్రపంచాన్ని మార్చేస్తుంది!



మిహేలా నొరాక్

మిహేలా నొరాక్ రొమేనియాకు చెందిన ఒక సాధారణ ఫొటోగ్రాఫర్. 2013లో ఆమెకు తన రోజువారీ దినచర్య, వృత్తి పట్ల విసుగనిపించింది. రోజూ ఇదేనా ఇంతకంటే కొత్తగా ఏంచేయలేనా అనుకుంది. అంతే ఉద్యోగానికి రాజీనామా చేసేసింది. ఫొటోగ్రఫీ ద్వారానే తన జీవితానికి ఒక అత్యున్నత స్థాయి గుర్తింపుని, అలాగే పనిలో ఉత్సాహాన్ని పొందాలనుకుంది. అంతే ...భిన్నదేశాలు ప్రయాణించి భిన్నమహిళల జీవితాలని చిత్రించే ఫొటోలను తీయాలనే నిర్ణయం తీసుకుంది. అలా మొదలైన ప్రయాణంతోనే 50దేశాలు తిరిగి 500 ఫొటోలు తీసి... ది అట్లాస్ ఆఫ్ బ్యూటీ ప్రాజెక్టుని పూర్తిచేసింది. ఉద్యోగం చేసి తాను కూడబెట్టుకున్న డబ్బుతోనే తన ఈ ప్రాజెక్టు పూర్తయిందని అయితే ఎప్పుడూ తక్కువ ఖర్చుతోనే ప్రయాణం చేసే ప్రయత్నం చేశానని ఆమె తెలిపింది. ఎప్పటి ఫొటోలు అప్పుడు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడంతో 2015లో అవి బాగా వైరల్ అయి... నొరాక్ గురించి, ఆమె ప్రాజెక్టు గురించి అందరికీ తెలిసింది. దాంతో 2016 మహిళా దినోత్సవం సందర్భంగా ఆరుగురు ప్రముఖ మహిళల ఫొటోలను తీయడానికి ఆమెకు ఫేస్ బుక్ నుండి పిలుపుకూడా వచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా భిన్నత్వంలో ఉన్న అందాన్ని ప్రపంచం ముందుకు తెచ్చే ప్రయత్నం చేశానని ఆమె తెలిపింది. భిన్నత్వమంటే డబ్బు, జాతి, కులమతాలు పేరు ప్రతిష్టలు వీటివలన ఏర్పడింది కాదని...మనం మనంగా సహజంగా ఉండటం వలన...ఏర్పడే భిన్నత్వమని మిహేలా అభిప్రాయపడింది. అయితే ప్రపంచంలో భిన్నత్వమే వివక్షకు కారణమవుతుందని, కానీ నిజానికి భిన్నత్వాన్ని ఒక సౌందర్యంగా గుర్తించాలని, అప్పుడే దాని పట్ల మనకు సహనం పెరుగుతుందని అంటుంది నొరాక్. స్త్రీలకు తాను ఇదే చెప్పాలనుకుంటున్నానని, తామందరం ఒక్కో ప్రత్యేకత ఉన్న వ్యక్తులమని, తాము తలచుకుంటే ఈ ప్రపంచంలోకి ఎంతో శాంతిని సహనాన్ని సమానత్వాన్ని తేవచ్చని నొరాక్ అంటోంది. రొమేనియాలో పుట్టిపెరిగిన ఒక సాధారణ స్త్రీ తీసిన ఫొటోలు లక్షలమంది చూస్తారని తాను అనుకోలేదని, తన కల ఇలా నిజం కావటం ఎంతో సంతోషాన్నిఇచ్చిందని...ప్రతి స్త్రీ ఆమెలోని శక్తిని సహజత్వాన్ని గుర్తించాలని నొరాక్ తోటి మహిళలకు తన సందేశంగా చెబుతోంది.

అచ్చం నీలాగే...నేను!

★ సెలబ్రిటీలా కనిపించాలనే తాపత్రయంలో యువత
★సోషల్‌మీడియా లోగిలిలో అనుకరణమంత్రమే అందరిదీ

'నువ్వు నీలాగానే ఉండు...బి యువర్ సెల్ఫ్' మానసిక నిపుణులు చెప్పే గొప్ప వ్యక్తిత్వ లక్షణాల్లో ఇదీ ఒకటి. మరొకరిని అనుకరించడం, ఎవరిలాగో మారిపోవాలని తాపత్రయపడటం ఇలాంటివన్నీ మనలోని సహజత్వాన్ని మనకు దూరం చేస్తాయి. మనమేంటో తెలియాలంటే...మనం కనిపించే తీరులో...మనం చేస్తున్న పనిలో మనదైన ముద్ర ఉండాలి. జీవితంలో పైకి రావాలని అనుకునేవారు తప్పనిసరిగా పాటించాల్సిన సూత్రమిది. అయితే ఇప్పుడు సోషల్ మీడియా ఈ మంచి లక్షణానికి గండికొడుతున్నట్టే ఉంది. ఎందుకంటే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్...వీటన్నింటిలో యువతరం పోస్ట్ చేసే ఫొటోలను, సెల్ఫీలను చూస్తుంటే...అనుకరణకు వారెంతగా బానిసలైపోతున్నారో తెలుస్తుంది.

సోషల్‌మీడియా మారుమూల పల్లెటూళ్లో నివసిస్తున్న అమ్మాయిలు అబ్బాయిలకు సైతం ఒక సందేశాన్ని మోసుకునివెళ్లి చెబుతోందిప్పుడు...'నువ్వు ఎప్పటికీ నీలాగే ఉండాల్సిన పనిలేదు... నువ్వు బాలివుడ్ సెలబ్రిటీలా ఉండవచ్చు'...అనేది ఆ సందేశం. తాము తమలా కాకుండా తమకు నచ్చిన సెలబ్రిటీలా కనిపించడం అనేది నేటితరం ముందున్న ప్రధాన ఆశయం. ఒక తల్లికి పుట్టిన పిల్లలు ఒకేలా ఉండటంలో అర్థముంది. కానీ ఇప్పుడు సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్న ఫొటోల్లో పిల్లలంతా ఒకేలా కనబడుతున్నారు. ఫ్యాషన్ అనుకరణల్లో వారి సహజ త్వాన్ని మర్చిపోతున్నారు. ఆడపిల్లలు పోస్ట్ చేస్తున్న సెల్ఫీల్లో మనకు ఆ విషయం మరింతగా అర్థమవుతుంది. కళ్లకు చెంపలకు పెదవులకు మేకప్‌తో పాటు... నొసలను పైకెత్తి...నోటిని గుండ్రంగా చుట్టి దిగుతున్న సెల్ఫీల్లో ...పిల్లల్లోని హావభావాలు, భావోద్వేగాలు చూస్తుంటే..ఇతరులను చూసి నేటి యువతరం ఎంతగా ప్రభావితం అవుతున్నదో మనకు తెలుస్తుంది. సోషల్‌మీడియా చాలా తేలిగ్గా చాపకింద నీరులా.. యువతరమంతా ఒకే మూసలోకి ఒరిగి పోయేలా చేస్తున్నది. ముఖ్యంగా మేకప్ విషయంలో ఇన్‌స్టాగ్రామ్ చూపుతున్న ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నదని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్ మేకప్, ఇన్‌స్టాగ్రామ్ ఫేస్ అనేది ఒక ట్రెండ్‌లా వ్యాపించిందని సౌందర్యానికి సంబంధించిన చరిత్రకారిణి, న్యూయార్క్ కి చెందిన రాచెల్ వెయిన్ గార్టెన్ అంటున్నారు.

సోషల్‌మీడియా ద్వారా వ్యాపిస్తున్న ఫ్యాషన్లు... మహిళలపై ప్రభావం చూపుతున్న తీవ్రమైన సాంస్కృతిక అంశాల్లో ఒకటని, దీనిని కల్చరల్ అబ్సెషన్ అనవచ్చని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒక వ్యక్తి ధరించే దుస్తులు, అనుసరించే ఫ్యాషన్లు ...అతను లేదా ఆమె నివసిస్తున్న కాలం, ప్రదేశాలు, వారు పుట్టి పెరిగిన కుటుంబ వాతావరణం, వారి జాతి మతాలు...ఇలా అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. కానీ ఇప్పుడు ఈ అంశాలేమీ కనిపించడం లేదు. వ్యక్తుల జీవన నేపథ్యాలను ఫ్యాషన్లు ఏకీకృతం చేస్తున్నాయి. రోజుకో కొత్త ఫ్యాషన్ మార్కెట్ ప్రపంచంలోకి వస్తున్నా...అందరూ ఒకేలా కనిపించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం. క్షణాల్లో ప్రపంచాన్ని చుట్టుముడుతున్న సమాచారం లాగే ఫ్యాషన్లు కూడా అలాగే వైరల్ అవుతున్నాయి. అందుకే అనుకరణే ఆధునిక జీవన మంత్రంగా మారిపోయింది.



సోషల్ మీడియా తరువాత...

ప్రపంచంలో చాలా విషయాలను మనం సోషల్ మీడియాకు ముందు, తరువాత అని విభజించి చూడాల్సిన అవసరం ఉందంటున్నారు...రాచెల్ వెయిన్ గార్టెన్. ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చాక...ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫ్యాషన్లు తెలుసుకోవడానికి ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకుండాపోయింది. ప్రపంచంలో ఎక్కడ ఎలాంటి ట్రెండ్స్ నడుస్తున్నాయో తెలవడమే కాదు...ఆన్‌లైన్‌లో ఆయా వస్తువులు కూడామనకు అందుబాటులో ఉంటున్నాయి. దాంతో తాము పుట్టి పెరిగిన సామాజిక సాంస్కృతిక నేపథ్యాలు... చివరికి ఆడా మగా అనే వ్యత్యాసాన్ని కూడా మరచిపోయి అన్ని ఫ్యాషన్లను అందరూ అనుసరించేస్తున్నారు. అందుకే అన్ని రకాల సౌందర్యాలను కలబోసుకున్న మల్టీ కల్చరల్ సౌందర్యం ఇప్పుడు మనముందు ఆవిష్కృతవుతున్నదని రాచెల్ వెయిన్‌గార్టెన్ అంటున్నారు. దీనికి ఉదాహరణగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యంత ప్రాచుర్యాన్ని పొందిన కైలీ క్రిస్టెన్ అనే అమెరికా టెలివిజన్, సోషల్‌మీడియా సెలబ్రిటీ గురించి చెప్పుకొచ్చారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ సెల్ఫీ ఫొటోలను ఎంత మంది ఫాలో అవుతున్నారో తెలిపారు. ఈ విషయంలో మనవాళ్లూ తక్కువకాదు. ట్విట్టర్ ఫేస్‌బుక్ ఇన్‌స్టాగ్రామ్...ఇలా పలుమార్గాల్లో సెలబ్రిటీలను అనుసరిస్తున్న యువత.... మేకప్‌లు, డ్రస్‌లు, హెయిర్ స్టయిల్...ఇలా అన్ని విషయాల్లోనూ సెలబ్రిటీలనే ఫాలో అవుతున్నారు.



కైలీ క్రిస్టెన్

సెలబ్రిటీలాగే ఎందుకు...

సెలబ్రిటీలా కనిపించడం ఎందుకు...అనే ప్రశ్న వేసుకుంటే సూటిగా ఒక సమాధానం చెప్పవచ్చు. అలా ఉండకపోతే...తాము నలుగురికంటే తక్కువనే అభిప్రాయం ఆత్మన్యూనత పిల్లల్లో పెరుగుతోంది. దాంతో...వారు సెలబ్రిటీలు నిర్దేశించిన సౌందర్య కొలతలు, ఫ్యాషన్లను తామూ అనుసరిస్తున్నారు. సెలబ్రిటీలు సోషల్ మీడియాలో ఉంటే... వారి ప్రతిరూపాలు మన కళ్లముందే మన పిల్లలై తిరుగుతున్న పరిస్థితి. అలా ఉంటేనే నేటి యువత ఆత్మవిశ్వాసంతో ఉండగలుగుతున్నారు. అలా ఉంటేనే తమకు సమాజంలో గుర్తింపు వస్తుందని వారు భావిస్తున్నారు.

✍ వడ్లమూడి దుర్గాంబ

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

శ్రవణ మననాదులు



శ్రీ రమణాశ్రమం
19-7-47

"నిన్న కుంభకోణం నుంచి ఇద్దరు పండితులు వచ్చారు. వారీ ఉదయం తొమ్మిది గంటలప్పుడు శ్రీవారిని సమీపించి "స్వామీ, సెలవు పుచ్చుకుంటాం. మనస్సు శాంతిలో అణగునట్లను గ్రహించాలని ప్రార్థిస్తున్నాం" అన్నారు. భగవాన్ సెలవు చిహ్నంగా తల ఊపారు. వారటుపోగానే సమీపంలో ఉన్న రామచంద్రయ్యరును చూచి "శాంతియే స్వరూపం, పైన వచ్చేదంతా తోసివేస్తే, ఉండేది శాంతే. ఇక అణిగేందుకు ఏమున్నది? పైన వచ్చేదో తోసివేయాలి. పక్వచిత్తులైతే శాంతియే స్వరూపంరా అంటే చాలు జ్ఞానం కలుగుతుంది. అపక్వచిత్తులకే శ్రవణ మననాదులు చెప్పారు గాని, పక్వచిత్తులకు పనిలేదు. దూరంలో ఉన్న వారు రమణమహర్షి వద్దకు ఎట్లా వెళ్లాలని అడిగితే ఆ రైలెక్కాలి, ఈ రైలెక్కాలి. అదీ దోవ అని చెప్పాలి గాని, తిరువణ్ణామలకు వచ్చి, రమణాశ్రమం చేరి హాలులో అడుగుపెట్టిన వెనుక ఇదుగో వీరే వారు అంటే చాలును. మరి కదలవలసిన పనిలేదు" అన్నారు భగవాన్.

"శ్రవణమననాదులంటే వేదాంత గురువాక్య శ్రవణాదులేనా?" అన్నారొకరు. "అవును. అయితే ఒకటి. ఈ బాహ్య శ్రవణ మననాదులే గాక ఆంతర శ్రవణ మననాదులున్నవి. అవి మనఃపరిపాకవశంగా స్ఫురించాలి. ఆ అంతర శ్రవణం చేసిన వారికి సందేహాలుండవు" అన్నారు భగవాన్.

"అంతర శ్రవణాదులంటే యేమి?" అని అప్పుడప్పుడు కొందరు ప్రశ్నిస్తే "సదా హృదయకుహరమందు అహమహమని భాసించే ఆత్మ స్ఫురణ నెరుగుటే ఆంతర శ్రవణమనీ, దానియందు నిలకడ నలవరచుకొనుట మననమనీ, అది తానుగ నిలుచుట నిది ధ్యాసమనీ" భగవాన్ సెలవిస్తూ ఉంటారు.

భగవద్రచితమైన "హృదయకుహరమధ్యే" అన్న శ్లోకం, తాత్పర్యం జ్ఞప్తి వున్నదో లేదో దిగువన వ్రాస్తాను. అందులో ఆత్మస్ఫురణ ప్రకాశమును గుఱించేగాక, పొందే విధానం గూడా విశదంగా ఉన్నది. పొందుటనగా తానుగ నిలుచుటయే గదా?

హృదయకుహర మధ్యే కేవలం బ్రహ్మ మాత్రం
హ్యహ మహమితి సాక్షా దాత్మరూపేణ భాతి,
హృది విశ మనసా స్వం చిన్వతా మజ్జతావా
పవన చలన రోధా దాత్మ నిష్ఠోభవత్వం.

తా: హృదయగుహామధ్యమం దేకమైక బ్రహ్మము మాత్రమే 'నేను, నే'నని యాత్మరూపముగ భాసించుచున్నది. తన్నుదా వెదకి మునుగు మనస్సు చేతనో, ప్రాణరోధము వలన మునుగు మనస్సు చేతనో, హృదయమునంది ఆత్మనిష్ఠుడవు కమ్ము.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభపరిణామాలు చోటు చేసుకొంటాయి.ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభ మవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయా లు అనుకూలం. మానసిక ధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేక పోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు ఉపకరిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. శ్రమ పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు/ లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవిచూస్తారు.

కుంభ రాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. శుభవార్తలు వింటారు. అవకాశాలను సద్వినియోగపరచుకోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



'మహర్షులు సమాజానికి కావలసిన నీతి సూత్రాలను పురాణాల ద్వారా అందించారు. వాటి లక్ష్యం ఉన్నత సత్యాలను బోధించడం. అందుకే అవి పరమ ప్రమాణాలు' అని స్వామి వివేకానంద అన్నారు. ప్రతి పురాణానికి మూలభూతంగా కొంత చారిత్రకాంశం ఉంటుంది. పురాణాల ముఖ్యోద్దేశం జనులకు ఉదాత్త తత్వార్థాన్ని రకరకాలుగా బోధించడమే. వాటిలో చారిత్రక సత్యాలు లేకపోయినా అవి బోధించే ఉన్నత సత్యాలవల్ల పురాణాలు మనకు పరమప్రమాణాలే! శీల ప్రతిపాదిక గ్రంథం రామాయణం. భారతం సర్వధర్మాల సారం.

నీతిసూత్రాల బోధనే

పురాణ ముఖ్యోద్దేశం



రామాయణం రంకు, భారతం బొంకు అని కొందరు హేళన చేస్తారు. అలాంటి మనస్తత్వం కలవారికి ప్రతిదానిలోను దోషం కనిపిస్తుంది. సమగ్రంగా చదవని కారణం వల్లనో మిడిమిడి జ్ఞానం వల్లనో, పాశ్చాత్యులు రాసిన కువ్యాఖ్యలకు ప్రభావితమయ్యో పెద్ద చదువులు చదివిన వారూ ఇలా పురాణేతి హాసాలను తూలనాడడం వారి కుంఠిత తత్వానికి దర్పణం పడుతోంది. నిత్య జీవితంలో మనం పనికి మాలినవి ఏరిపారేసి మంచి వాటినే స్వీక రిస్తాం. ఉదాహరణకు బజారులో కొన్న బియ్యాన్ని తెచ్చినవి తెచ్చినట్లే ఎసట్లో పొయ్యం. ముందుగా పురుగులు, రాళ్లు, పొల్లు ఏరి ఆ బియ్యాన్ని కడిగి అప్పుడు వంటకు ఉపయోగిస్తాం. కాని ఈ మేధా వులకు చంద్రుడిలో మచ్చ కనిపించినట్లు దోషాలే కనిపిస్తాయి. కాని ఏ ప్రయోజనం ఆశించి మన మహర్షులు వాటిని రాసేరో మనసు పెట్టి ఆలోచించరు. 'మహర్షులు సమాజానికి కావలసిన నీతి సూత్రాలను పురా ణాల ద్వారా అందించారు. వాటి లక్ష్యం ఉన్నత సత్యాలను బోధించడం. అందుకే అవి పరమ ప్రమాణాలు' అని స్వామి వివేకానంద అన్నారు. ప్రతి పురా ణానికి మూలభూతంగా కొంత చారిత్రకాంశం ఉంటుంది. పురాణాల ముఖ్యోద్దేశం జనులకు ఉదాత్త తత్వా ర్థాన్ని రకరకాలుగా బోధించడమే. వాటిలో చారిత్రక సత్యాలు లేకపో యినా అవి బోధించే ఉన్నత సత్యాల వల్ల పురా ణాలు మనకు పరమ ప్రమాణాలే! శీల ప్రతిపాదిక గ్రంథం రామాయణం. భారతం సర్వధర్మాల సారం.

ఇక రాముడనే వ్యక్తి అసలు పుట్టేడా? ఏ ఇంజినీరింగ్ కాలేజీలో చదివాడు అనే ప్రశ్నలు వేసే వారిది పిడివాదము. పోనీ వారిలా ఆలోచించి రాముడనే వాడు అసలు పుట్టనే లేదు. ఇది మహర్షి వాల్మీకి ఊహే అనుకుందాం. అంత మాత్రాన రామాయణం గొప్పతనం తరిగి పోతుందా?

రాముడు లేదా కృష్ణ పాత్రలు కల్పితాలే అనుకున్నా ఆ పురాణా ల్లోని ధర్మోదాత్తత ఎంత మాత్రం చెడదు. వారు సజీవ వ్యక్తులు కాకపోతేనేం, ఆ గ్రంథాలు బోధించే ఉత్తమ ధర్మాల వరకూ వాటిని పరమ ప్రమాణంగా స్వీకరించడానికి ఎవరికైనా ఎందుకు అభ్యంతరం ఉండాలి? మన వేదాంత సత్యం వ్యక్తిపై ఆధారపడినది కాదు. శ్రీకృష్ణుడు వేదాలలో లేని వినూత్న విషయాలేవీ చెప్పలేదు. ధర్మాచరణ విషయాలు చెప్పాలంటే అందుకొక వ్యక్తి అవసరం. అందువలన రాముడున్నాడా? కృష్ణుడున్నాడా? అనే ప్రశ్నలకు తావు లేదు.


పురాణాల ముఖ్యోద్దేశం ముందుగా చెప్పుకున్నాం. మన పురాణాలు ధర్మాచరణను బోధించేవి. ధర్మం, మతం అన్నవి సమానార్థకాలు కావు. ధర్మానికి మత విశ్వాసంతో సంబంధం లేదు. రెలిజియన్ అనే ఆంగ్ల పదానికి ధర్మం సమానార్థకం కాదు. మతం ఒక విశ్వాసం. ఇతర మతాలు ఒక వ్యక్తిపై ఆధారపడినవి. హిందూ మతం ఏ ఒక్క వ్యక్తిపైన ఆధారపడినది కాదు. పురాణాల్లో వర్ణించిన వ్యక్తులు నిజంగా ఉండేవారా లేదా? అవన్నీ కల్పితమా అన్న చర్చ అవసరం లేనిది. పురాణాల్లోని తత్వార్థ ప్రామాణికత కోసమే వాటిలోని పాత్రలు.

ఎవరైనా తండ్రి తండ్రి గురించి చెప్పగలుగుతారు. తండ్రి తాత గురించి అడిగితే ఏమని చెప్పగలరు? అలాగే త్రేతాయుగంలోని వ్యక్తులు, ద్వాపర యుగంలోని వ్యక్తులు ఆనాడు నిజంగా ఉన్నారా? లేదా అని ఆలోచించడంలో ప్రయోజనం ఏమిటి. నీవు ఉన్నా వంటే నీ తాతకు ముత్తాత ఉండే ఉండాలి కదా?

పురాణాల లక్ష్యం లోకానికి 'సు'విద్య ఇవ్వడం. వాటిని రచిం చిన మంత్ర ద్రష్టలు, మహర్షులు కొంతమంది చారిత్రక వ్యక్తు లను గ్రహించివారిలోని సద్గుణ, దుర్గుణాలను వివరించి జనుల నడవడికకు కావలసిన నీతి సూత్రాలను రచించారు. దేవతలు, రాక్షసులు ఇతరత్రా అనేక జాతులు ఉన్నాయా అని ప్రశ్నించడం మూర్ఖత్వం. ఆ యుగాల్లో ఉండేవారేమో. లేరని నిరూపించడానికి మాత్రం ఏదైనా కొలబద్ద ఉందా? విష్ణు శర్మ పంచ తంత్ర కథలు రాశాడు. అందులో పాత్రలు జంతువులు, పక్షులు. అవి మాట్లాడేవా? ఆ పాత్రల ద్వారానే మూర్ఖులను విద్యావంతులను చేశాడు విష్ణుశర్మ. పురాణాలను ఆ దృష్టితో చూడాలి. ఆ కాలంలో ఉన్నట్లు నేడూ మనుషుల లోనే దేవతలు, రాక్షసులు ఉన్నారు. అక్రమాలు, హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు చేసేవాడు రాక్షసుడు కాడా? ధర్మయుతంగా నడుచు కుంటూ పరోపకారం చేసేవాడు దేవతల కన్నా తక్కువా? ఈ మిడిమిడి జ్ఞానానికి కారణం చిన్నతనంలో సరైన విద్య లభించకపోవడమే. నీతికథలు, పురాణ కథలు పాఠ్యాంశాల్లో ఉంటే ఎంతో కొంత ప్రయోజనం ఉండేది.

- గుమ్మా ప్రసాదరావు
భిలాయ్ నుంచి
09755110398

లలితా సహస్రం 'రహస్యం' ఎందుకైంది?




లలితా సహస్ర నామం గురించి చాలా మందికి తెలుసు. అది పరమ పవిత్రమైనదీ, శక్తివంతమైనదీ అని వేరే చెప్పనక్కర్లేదు. ఇటీవలి కాలంలో ఇది ఎంతో ప్రాచుర్యం పొందింది. దీనిపై ప్రసార మాధ్యమాల్లో మహాత్ములు అర్థ వివరణ చేస్తూ అందరికీ వాటి గురించి అవగాహనను కలగజేయడం కూడా జరిగింది. అలాగే పదాల విరుపు గురించి కూడా పలువురు విద్వాంసులు వివరణలు ఇచ్చారు. ఈ సహస్రనామాల ఆవిర్భావం గురించి క్లుప్తంగా చూద్దాం. శ్రీలలితా పరా భట్టారికా దేవి వశిన్యాది వాగ్దేవతలను పిలిచి ఒకప్పుడు ఇలా సెలవిచ్చింది. మీరు నా ప్రసాదం వల్ల సద్వాగ్విభూతిని పొందారు. మరి నా భక్తులకు కూడా సద్వాగ్విభూతి కలిగించేందుకు ఉపయోగపడాలి కదా. శ్రీచక్ర రహస్యాలు తెలిసిన వారు మీరు. అందుచేత మీరు ఆ స్తోత్రం చేయటానికి అనుజ్ఞ ఇస్తున్నాను.

కురుధ్వ మండితం స్తోత్రం మమ నామ సహస్రకైః
యేన భక్తైః స్తుతా మామే సత్యః ప్రీతిః పరాభవేత్

రహస్యార్థంతో సహా సహస్రనామ స్తోత్రం మీరు నిర్మించండి. ఏది భక్తులు పఠించినంతనే మాకు ప్రీతి కలుగుతుందో అలాంటి స్తోత్రాన్ని రచించండి అని సాక్షాత్తు అమ్మే ఆజ్ఞాపించింది. అవన్నీ అటుంచితే ఈ సహస్రనామ స్తోత్రానికే మిగతా వాటికి లేని విధంగా రహస్య సహస్రనామ స్తోత్రం అనే పదం వాడారు. గణపత్యాదిగా అందరు ప్రముఖ దేవీ దేవతలకూ సహస్రనామ స్తోత్రాలున్నాయి. వాటికి వేటికీ ఈ రహస్య అనే పేరు లేదు. ఈ రహస్యం అనేది తృతీయాధ్యాయం ప్రారంభ శ్లోకంలోనే ఉంటుంది. '**రహస్యానాం రహస్యంచ లలితా ప్రీతిదాయకమ్**' అని నిష్కర్ష చేస్తుంది. ఆ అధ్యాయం చివరన హయగ్రీవులు అగస్త్యునితో '**నా విద్యా వేదినే బ్రూయాత్ నాభక్తాయ కదాచన, యథైవ గోప్యా శ్రీవిద్యా తథాగోప్యామిదం మునే పశు తుల్యాతునబ్రూయా జ్ఞానేషు స్తోత్ర ముత్తమమ్**' అని హెచ్చరిక చేస్తారు. శ్రీదేవి భక్తులు కానివారికి, బాలా మంత్రోపదేశం లేనివారికి ఈ స్తోత్రం ఉపదేశం చేయరాదని సంప్రదాయం. అందుకే ఇది రహస్యం. అంతేకాక హయగ్రీవుల వారు '**శ్రీదేవీ ప్రేరణా దేవ మయోక్తం కుంభసంభవ**' అని అమ్మ వారి ఆదేశం మేరకే నీకు ఉపదేశించాను సుమా (నీవూ అలానే చేయవలెను) అని స్పష్టం చేశారు. ఈ స్తోత్రంలో వలెనే అనేక స్తోత్రాదుల్లో కూడా ఇటువంటి హెచ్చరికలే ఉంటాయని అందరికీ తెలుసు. ఇలా ఉండటానికి కారణం తేలికగానే గ్రహించవచ్చు. **ముక్కస్య ముక్కార్థః** అన్నట్టు ఏ మాటకు ఆ మాట అర్థం అన్వేషించి కూర్చుకుంటూ శ్లోకాలకు అన్వయం గ్రహించటానికి ప్రయ త్నించటం సముచితం కాదు. అలాంటి ప్రయత్నం చేసే వారు భాషపై అధికారం లేని కారణంగా సులువుగా దారి తప్పుతారు.

రెండవది సంప్రదాయాలని కొన్ని ఉంటాయి. ఏ విషయం గురించి శ్లోకాలు అర్థం చేసుకోవటానికి యత్ని స్తున్నామో దానికి సంబంధించిన సంప్రదాయాలను క్షుణ్ణంగా గురు పరంపర నుంచి స్వీకరించిన వారికి విదితమయ్యే విధానికీ, అటువంటిదేమీ లేకుండా కేవలం పదాలకు అర్థాలు సాయంతో శ్లోకార్థ నిర్మాణ క్రియకు దిగిన వారికి తెలిసే విధానానికి హస్తి మశకాంతరం ఉంటుందన్నది నిర్వివాదం. మాట వరుసగ జర్మన్ టు ఇంగ్లీష్ డిక్షనరీ ఒకటి, ఇంగ్లీష్ టు తెలుగు నిఘంటువు ఒకటి ముందు పెట్టుకుని న్యూక్లియర్ ఫిజిక్స్ సబ్జెక్టు (అణు భౌతిక శాస్త్రం)పై వచ్చిన సిద్ధాంత వ్యాసాన్ని జర్మన్ నుంచి తెలుగు చేయటం ఎలా ఉంటుందో ఆలోచించండి. అది కూడా ఎన్నడూ సైన్స్ విద్యార్థి కాని ఒక జర్నలిస్టు ఆ పని చేస్తే ఎలా ఉంటుందో యోచించండి. మాక్స్ ముల్లర్ సంస్కృతం నేర్చుకున్నంత మాత్రాన వేదాల్లోని బుక్కులకు తర్జుమాలు చేపి వాటి పరువు తీశాడని అరవిందులే ఆగ్రహపడ్డారు. ఒక బుక్కుకు యధాతథంగా అర్థం, ఇంద్రుడి రథం పోతూ ఉంటే ఆ రథాశ్వం గిట్ట నుంచి నేయి కారుతున్నదని వస్తుందట. అలా గ్రహించి ముల్లర్ ట్రాష్ అన్నాడని మనమూ బాధపడకూడదు కదా! దాని అసలు అర్థం వివరించటానికి అరవిందులు ఒక పుస్తకమే రాశారని గుర్తు.



- తాడిగడప శ్యామలరావు
9849626023

భగవద్గీత



జగత్తును విడిచే కాలం తెలుసుకోవాలి

అధ్యాయం 8
శ్లోకం 23

యత్ర కాలే త్వనావృత్తిమ్
ఆవృత్తిం చైవ యోగినః।
ప్రయాతా యాంతి తం కాలం
వక్ష్యామి భరతర్షభ॥

తాత్పర్యం

ఓ భరతవంశ శ్రేష్ఠుడా! ఏయే కాలమందు ఈ జగమును వీడుట ద్వారా యోగి వెనుకకు తిరిగి వచ్చుట జరుగునో లేక తిరిగి రాకుండునో నీకు నేనిప్పుడు వివరిస్తాను.

భాష్యం

భగవంతుని శుద్ధ భక్తులు, భగవంతుని శరణు జొచ్చుటచే వారు శరీరాన్ని ఏ సమయములో ఏ పరిస్థితులలో వదలిపెట్టవలెనోయనేది అంతగా పట్టించుకోరు. వారు ఆ నిర్ణయాన్ని శ్రీకృష్ణునికే వదిలివేసి భగవద్ధామాన్ని చేరుకుంటారు. అయితే అలా శుద్ధభక్తిని కాక, కర్మయోగమో, జ్ఞానయోగమో లేదా హఠయోగమో పాటించు వారు శరీరాన్ని ఏ సమయములో వదులుతారనే దానిపై మరలా ఈ జన్మమృత్యు ప్రపంచానికి తిరిగి వస్తారా లేదా అనేది ఆధారపడి ఉంటుంది.

యోగాభ్యాసము పరిపూర్ణము గావించిన యోగి తాను ఏ సమయములో శరీరాన్ని వదలాలనుకుంటున్నాడో నిర్ణయించుకోవచ్చును. కాని ఆ స్థితికి చేరని యోగి ఏ క్షణాన్నైనా శరీరాన్ని వదలాల్సి రావచ్చు. ఇక్కడ 'కాలము' అనే పదము కాల దేవతను సూచిస్తుంది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



వేమన పద్యం

నిక్కమైన మంచినీలమొక్కటిచాలు
దళుకు బెళుకు రాళ్లు తట్టెడేల
చాటుపద్యమిలను చాలదా యొక్కటి?
విశ్వదాభిరామ వినురవేమ

తాత్పర్యం: రత్నమొక్క దానివిలువ పూత మెరుగురాళ్లకు రాదు. వేలాది పనికిరాని కవితలకన్నా మంచినీతిగల చాటు పద్యమొక్కటిచాలు అని తన పద్యము విలువ చెప్పకనే చెప్పుకున్నాడు వేమన

బాలప్రభ

పొడుపు కథ

కిరు కిరు తలుపులు
కిటారు తలుపులు
వెయ్యంగ వస్తవి గానీ
తియ్యంగ తియ్యరావు

ఙ్ఞాబ : ణాలిజ

మూఢ భక్తి

కథ

ఒకానొక ఊళ్లో ఒక సోమరిపోతు ఉండేవాడు. చిన్నతనంలో అమ్మానాన్నలు పోషించారు కానీ పెద్దయ్యాక కూడా ఏ పనీచేయక ఇంటిపట్టునే ఉండి కావలసినవి సాధించుకు తింటుంటే భరించే ఓపిక లేక పెళ్లి చేసి వేరుకాపురం పెట్టిచ్చి ఊపిరిపీల్చుకున్నారు. అయితే అతనితో వేగలేక కొన్నాళ్లకే భార్య కూడా విడిచిపెట్టి ఎటో వెళ్లిపోయింది. అతనికి ఏం చెయ్యాలో తెలియక ఊళ్లు పట్టుకు తిరుగుతూ ఒక రోజు ఒక గుళ్లో నిద్రపోయాడు. అది చలికాలం కావడంతో సరైన దుప్పటికూడా లేక వణుకుతున్న అతన్ని చూసి ఒక దారే పోయే దానయ్య గుడిలోకొచ్చి దర్శనం చేసుకుని వెళ్లబోతూ ఇతన్ని చూసి జాలిపడి కాషాయపు రంగున్నపై కండువాను కప్పి వెళ్లిపోయాడు. మర్నాడు కోనేట్లో స్నానం చేసి చొక్కా చిరిగిపోవటంతో పడవేసి కండువానే కప్పుకుని గుడిలో కూర్చున్నాడు ప్రసాదం కోసం ఎదురుచూస్తూ. పూజ ముగియటం ఆలస్యం అయ్యే సరికి చిన్న కునుకు పట్టి తూగుతూ పగటి కలలు కని, కలలో మాట్లాడ్తూ ''అలాగే సరే.. మీరు చెప్పినట్టే వుంటాను'' అన్నాడు.



అది విన్న పూజారీ భక్తులంతా అతనో కారణ జన్ముడైన సాధు పుంగవుడని, ధ్యానంలో దేవునితో మాట్లాడుతున్నాడని భావించి అతనికి మొక్కసాగారు. కొద్దిరోజుల్లోనే అతని ప్రమేయం లేకనే ఊరివాళ్లు. చుట్టుపక్కల గ్రామాలవాళ్లు కలిసి అతనికొక మంచి ఆశ్రమం, డబ్బు, బంగారం అంటూ కానుకలతో ముంచెత్తారు. ఇదేదో బాగుందని భావించి అతను కూడా కళ్లు మూసుకునే వుండటం అలవాటు చేసుకున్నాడు. అది ధ్యానంగా భావించి ఎప్పుడు అతను కళ్లు తెరిచి ఎవరిని చూస్తే వాళ్లు అదృష్టవంతులు అవుతారని ప్రచారం మమ్మురంగా జరిగిపోయి, అతని పేరు కూడా ధ్యానానంద స్వామి అని పిలవసాగారు.

ఈ విషయం తెలిసి మెల్లగా అతని తల్లిదండ్రులు, భార్య మాత్రమే కాక ఆమె తరపు బంధువులంతా వచ్చేసి అతనిపై భక్తులపై ఆజమాయిషీ చేయసాగారు. అయినా అతని పేరు ప్రఖ్యాతులు మరింతగా పెరిగి, గొప్పగొప్పవాళ్లు సైతం అతని చూపులు సోకితే చాలని పడిగాపులు పడసాగారు.

కొన్నాళ్లకు అతను కాలం చేసాడు. అప్పుడు ఆశ్రమం ఏమౌతుందో అని అంతా భయపడసాగారు. కానీ మర్నాడే ఒక సాధువు వేషధారి హిమాలయాలలో ఉన్న తనని ధ్యానానంద స్వామి వచ్చి తన బాధ్యత తీసుకొమ్మన్నాడని నమ్మబలికాడు.

భక్తులు విశ్వాసం కోల్పోకుండా యథాశక్తి వస్తూనే వున్నారు. కానుకలు ఇస్తూనే ఉన్నారు. పనీపాటలేని తన పిన్ని కొడుక్కి కాషాయవస్త్రాలేసి సాధువులా తయారు చేసి భక్తులు స్వీకరిస్తారో లేదో అన్న భయంతో బిక్కుబిక్కుమని తిరిగిన ధ్యానానంద స్వామి భార్య మూఢభక్తుల నమ్మకాన్ని చూసి అసలు ఇతను కాకుంటే తానైనా వారసత్వం ప్రకటించుకుని జీవితాంతం విలాసవంతంగా బ్రతకగలనన్న విశ్వాసం వచ్చి హాయిగా ఊపిరిపీల్చుకుంది.

నీతి: గాలిలో దీపం పెట్టి దేవుడ్ని తలచుకున్నట్టు, పాపాలు చేసి పుణ్యం కోసం దొంగ సాధువుల్ని పెంచి పోషించడం వల్ల సమాజానికి నష్టమే కానీ లాభం ఉండదు. మంచి నడవడితో బ్రతికితే పుణ్యం దానంతట అదే వెదుక్కుంటూ వస్తుంది.

- డేగల అనితాసూరి



టైరనోసారస్ రాక్షసబల్లి

టైరనోసారస్ అంతరించిపోయిన ఒక రాక్షసబల్లి జాతి. శాస్త్రవేత్తలు ఇటీవల దీని శిలాజాలను కనుగొని పరిశోధనల ద్వారా దీని గురించి మరిన్ని వివరాలను తెలుసుకున్నారు.

ఇది మాంసాహార కుటుంబానికి చెందినదే అయినా శాకాహారి అని తేలింది. పరిణామక్రమంలో భాగంగానే పరిసరాల ప్రభావం వల్లనో ఇది శాకాహార జీవిగా రూపాంతరం చెందిందని శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. ఇలా చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. పాండాల్లోనూ ఇలా పరిణామక్రమంలో మార్పులు వచ్చాయి. ఇప్పుడు ఆకులు మాత్రమే తినే పాండాలు మాంసాహారులైన పోలార్ బియర్, గ్రిజ్లీ బియర్‌లనుంచే రూపాంతరం చెందాయి. ఈ రాక్షసి బల్లి కొన్ని లక్షణాల్లో 15 కోట్ల ఏళ్ల క్రితం బతికిన శాఖాహారి బ్రకియోసారస్‌ని కూడా పోలి ఉంది. అంటే దీనిలానే ఆకులూ అలములు తినేది. ఈ రాక్షసబల్లి శిలాజాలు దక్షిణ అమెరికాలోని చిలీలో దొరకడం వల్ల దీనికి చిలీసారస్ డిగో సూరెజీ అని పేరు పెట్టారు. చిన్ని తల, పొడవైన మెడ, ఆకులా ఉండే పళ్లు, దృఢమైన కాళ్లతో ఉండే ఇది పది అడుగుల పొడవుతో భయం గొలిపేలా ఉండేది.

ఇరవై చిరుమువ్వలు అందిస్తా

బాలసాహితీ బంధువులు-44

చిన్నతనంలో పురాణ కథలు చదివి బాలసాహిత్యంపై ప్రేమ పెంచుకున్న తాతయ్య ప్రతాపురం రామానుజాచారి. వరంగల్ జిల్లా హన్మకొండలో 5 ఏప్రిల్ 1959న పుట్టారు. అమ్మ మంగతాయారు, నాన్న పెరుమాండ్లచారి. 1979 సంవత్సరంలో బొడ్రాయిలోని ప్రభుత్వ సహాయక ప్రాథమికోన్నత పాఠశాల ఎస్‌జీటీగా నియమితులయ్యారు. 1983 నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తూ 2017లో పదవీ విరమణ చేశారు.

ప్రతాపురం రామానుజాచారి చిన్నతనంలో పురాణ కథలు ఆసక్తిగా చదివేవారు. అలా పుస్తక పఠనం వలన రచనారంగంపై ఆసక్తి కలిగింది. మొదట్లో తనూ పురాణ కథలు ఎక్కువగా రాశారు.

18వ ఏటనుండే అంటే 1975 నుండి బాలలకోసం రచనా వ్యాసాంగం ప్రారంభించారు. వీరి తాతగారి పేరైన ప్రతాపురం రంగాచారి, పి. గీతారాం పేర్లతో కూడా చాలా కథలు రాశారు. సుమారు 400కి పైగా కథలు చందమామ, బాలమిత్ర, బుజ్జాయి, బొమ్మరిల్లు, చిన్నారి, చిన్నారిలోకం, బాలరంజని, బాలజ్యోతి, బాలభారతం వంటి వివిధ బాలల పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. ఆంధ్రప్రభలో బాలప్రభలో ప్రతాపురం రంగాచారి పేరుతో ప్రతివారం వీరి బాలల కథలు ప్రచురించబడ్డాయి. కొన్ని కథల్ని చిరుమువ్వలు పేరుతో రెండు భాగాలుగా ప్రచురించారు. ఇలాంటి పుస్తకాలు మరో 18 ప్రచురించి 20 చిరుమువ్వల భాగాలను ప్రచురించాలన్న లక్ష్యంతో ఉన్నారు. తల్లిదీవెన, విషకన్య, కాల భైరవుడు, అపూర్వ సహోదరులు, అమృతజలం నవలలు బాలల కోసం ప్రచురించారు. వీరి నవలలు బాలరజనిలో ప్రచురించబడ్డాయి. బాలమిత్రలో తోటి రచయితలతో కూడి ఒక గొలుసు నవల కూడా రాశారు. అంతేకాదు పత్రికలకు ఫజిల్స్ ప్రచురణకు పంపటమన్నా, ప్రచురించినవి పూరించటమన్నా చాలా ఇష్టం. ఇలా బహుమతులు కూడా పొందారు. వరంగల్ జిల్లా నుండి బాలసాహిత్యం రాస్తున్న రచయితలు చాలా తక్కువ.

ప్రతాపురం రామానుజాచారి
6-7-20, బ్రాహ్మణవాడ,
హన్మకొండ, వరంగల్ జిల్లా
9866776452



ప్రతాపురం రామానుజాచారి వరంగల్ ఆకాశవాణిలో ఏ గ్రేడ్ కళాకారునిగా గుర్తించబడ్డారు. 20 కథానికలు అందులో ప్రసారమయ్యాయి. కేవలం రేడియో కళాకారునిగానే కాకుండా టీవీషోలలో కూడా పలుమార్లు పాల్గొన్నారు. ప్రభుత్వం కూడా బాలసాహిత్యంపై మక్కువ చూపించి ప్రభుత్వ పరంగా పిల్లలకొరకు ఒక బాల మాసపత్రిక నడిపించాలంటారు. బాలల పత్రికల వారు నిర్వహించిన పోటీలో వీరి కథలకు పలుమార్లు బహుమతులు రావటం విశేషం.


బాలసాహిత్యపరిషత్, సృజనా ఆర్ట్ క్రియేషన్స్ ద్వారా బాలసాహిత్య పురస్కారాలందుకున్నారు ప్రతాపురం రామానుజాచారి తాతయ్య.



నిర్వహణ: పైడిమర్రి రామకృష్ణ
సెల్: 9247564699

పక పక

నాలుగు గ్లాసులు



డాక్టర్: నీవు కనీసం 10గ్లాసుల మంచినీటిని ప్రతినిత్యం తీసుకోవాలి.

పేషెంట్: అది కుదరని పని.

డాక్టర్: ఎందుకు?

పేషెంట్: నా దగ్గర కేవలం నాలుగు గ్లాసులు మాత్రమే ఉన్నాయి

చెక్ చేస్తున్నా



సన్నీ 500 రూపాయల నోటు మీద రాసిన నెంబర్ డయల్ చేస్తున్నాడు.

డుంబు: సన్నీ ఏం చేస్తున్నావు?

సన్నీ: గాంధీజీ అయితే చనిపోయాడు కానీ ఆయన మొబైల్ నెంబర్ ఎవరి వద్ద ఉందో చెక్ చేస్తున్నా

ఇన్ఫెక్షన్



సోము: ఈ చాకు ఎందుకు నీళ్లలో మరగబెడుతున్నావు?

రాము: సుసైడ్ చేసుకోవడానికి

సోము: అయితే మరగబెట్టే అవసరం ఏమొచ్చింది?

రాము: ఇన్ఫెక్షన్ రాకుండా ఉండటానికి

విరిగే వస్తువులు



రైలులో శాంత తన సామాగ్రిని పైసీటు మీద పెట్టాడు.

బాంటా: మీ సామాగ్రిని ఎక్కడైనా పెట్టుకోండి. నా నెత్తిమీద పడుతుంది

శాంత: పర్వాలేదు. ఇందులో విరిగే వస్తువులు ఏం లేవు

బంగారు పలుకు

సమస్యలొస్తే రానీ..
సవాళ్లు ఎదురవుతే
ఎదురవనీ..
ఓటమి తలుపుతడితే
తట్టనీ..
నిలుద్దాం..పోరాడదాం..
గెలుద్దాం..
- స్వామి వివేకానంద



మన పండుగ-మన భాష

హాయ్! ఎలా ఉన్నారు మీరంతా.. ఇల్లంతా సందడిగా ఉన్నట్లుందే. ఎందుకో తెలుసా. రేపే ఉగాది కదా.. ఇది మన పండుగ కేవలం మన తెలుగువారి పండుగ. మనవారంతా ఎక్కడున్నా ఏ రాష్ట్రంలో ఉన్నా.. ఏ దేశంలో ఉన్నా సంబరంగా జరుపుకునే పండుగ. ఎందుకంటే తమిళులు, మళయాళీలు, కన్నడీగులు, మరాఠీలకు వారి సంవత్సరాది ఉంటాయి. మనకు ఈ ఉగాదే సంవత్సరాది. వేల సంవత్సరాలుగా మనం ఈ పండుగను జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా మనమంతా ఒక నిర్ణయం తీసుకోవాలి. మన పండుగను మనం జరుపుకోవాలి. మన భాష మనం మాట్లాడుకోవాలి... కదా.. మన భాష వదిలి ఆంగ్లమాధ్యమంలో చదివి రెండు మూడు తరాలు తెలుగుదనానికి దూరంగా ఉంటున్నారు. కానీ మన మాతృభాష నేర్చుకుంటే మిగతా అన్ని భాషలు సులభంగా వస్తాయి. పీవీ నర్సింహరావ్, ప్రకాశ్ రాజ్, సుమ, నలిమెల భాస్కర్ వంటివారు వివిధ భాషల్లో చక్కగా మాట్లాడగలరు. ఎందుకు తమ మాతృభాషలో ముందు నైపుణ్యాన్ని సంపాదించుకుంటే ఇతర భాషలు నేర్చుకోవడం చాలా సులభం. ఆంగ్ల నూతన సంవత్సరం అయిన ఉగాదిని కూడా జరుపుకుంటున్నాం... కదా.. మరి ఆంగ్లంపై మోజుపడేవారంతా ముందు తెలుగును బాగా నేర్చుకోవడానికి ప్రయత్నించడం వచ్చే సంవత్సరం నుంచి అన్ని పాఠ్యాంశాల్లో తెలుగు తప్పనిసరి చేసినట్టు ముఖ్యమంత్రి ప్రకటించడం ఆనందదాయకం. ఎందుకంటే తెలుగుభాష వచ్చిన వారికి మాట్లాడేప్పుడు ఎంతో స్పష్టత ఉంటుంది. గుణింతాలు, ఒత్తులు భాషకు సోయగాలు తెచ్చిపెట్టాయి. ఈ భాషకు మరో ప్రత్యేకత ఏమంటే పద్యం.. అద్భుతమైన వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది. వేమన సుమతి, భాస్కర శతక పద్యాలు బాల్యంలో నేర్చుకుంటే జీవితాంతం మన వెంటే ఉంటాయి. అదే విధంగా ఏ భాషకు ఉండని సామెతలు, నుడికారాలు తెలుగు సౌందర్యాన్ని రెట్టింపు చేస్తాయి. తెలుగులో సంవత్సరానికి పేర్లు ఉంటాయి. అదే విధంగా నెలలకు కూడా పేర్లు ఉంటాయి. వాటి వివరాలు పంచాంగం తెలుపుతుంది. ఏ సమయంలో గ్రహణం ఏర్పడుతుంది. పంటలు ఎలా పండుతాయి, వర్షం ఎంత, ఎప్పుడు కురుస్తుంది అనే వివరాలు కూడా అందులో ఉంటాయి. ఏ పండుగ ఎప్పుడు చేసుకోవాలి. అనే వివరాలు ఉంటాయి. అంటే మనం ఏ కాలంలో ఎలా ఉండాలి. ముందు జాగ్రత్తలు చెబుతుంది. మన రాశి ఏమిటి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే వివరాలు కూడా ఇందులో ఉంటాయి. ఇవి పూర్తిగా ఖగోళ సంబంధిత అంశాలు.. మరి ఇంతటి ప్రాశస్త్యం గల మన భాషను, మన సంప్రదాయాలను మనం గౌరవించాలి కదా..




మరి మనమంతా మన భాషను నేర్చుకుని దీని ప్రాధాన్యతను ఇతర భాషలవారికి, ఇతర దేశాలవారికి తెలియజేయాలి. ఇక నుంచి మీరంతా చక్కని తెలుగు నేర్చుకుని తెలుగులోనే మాట్లాడాలి. తెలుగుపద్యాలు చదువుకోవాలి. తెలుగు సామెతలు నేర్చుకోవాలి. సరేనా.. అందరికీ ఉగాది శుభాకాంక్షలు...

టి. వేదాంతసూరి


వెన్నెలబాల

పుస్తకాల తోట

ఏమర్రా బుజ్జాయిలు! ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? రాబోయే సమీక్షలకోస మా? ఏమి భయం లేదు భయం దూరం చేసుకుంటేనే పరీక్షలు చకచకా రాసే యొచ్చు. అందుకోసం మీకు ఈ వారం పుస్తకాలతోటలో చక్కని బాలగేయాల పుస్తకం గురించి చెబుతానే! ఇవి చదివితే గాల్లో తేలినంతగా ఉయ్యాల ఊగినంత ఆనందం కలుగుతుంది తెలుసా? వెన్నెల బాలఅనే పేరుగల ఈ బాలగేయాల పుస్తకం ఖమ్మంకు చెందిన సునంద అత్తమ్మ వ్రాసింది. ప్రతిగేయంకు ఒక బుల్లి బొమ్మ కూడా ఉండి ఎంత ముద్దుగా వున్నాయో!! ఈ గేయాలు కేవలం చదువుకుని పాడుకోవడానికే కాదు ఎంచక్కా అభినయం చేసుకుంటు ఆడుకోవడానికి కూడా వీలుగా ఉన్నాయి. ''పిల్లలమూ మేం పిల్లలమూ...'' అంటూ సాగే గేయంలో మీరు చేసే చెయ్యాల్సిన పనుల గురించి సునంద అత్తయ్య ఎంత చక్కగా చెప్పిందో మీరే మచ్చుకు చదవండి. ''అమ్మ గోరుముద్దలు తింటూ/ కమ్మని కలలు కంటాము/ నాన్న చెప్పే మంచిమాటలు/ సద్దు చేయకు వింటాము/ కసిరివిసురుగా కోపం చేస్తే/ కంటికి దూరం దాక్కుంటాం/ ప్రేమగ పిలిచి తాయిలమిస్తే/ కబురులు ఎన్నో చెబుతాముమన అందరం భయపడే ఎండలు గురించి ఎంత చక్కగా చల్లగా చెప్పారో ఎండలు గేయంలో ఇది చదివితే ఎండల గురించిన భయం పోవడం ఖాయం! ఇంకా ఇందులో మనకు ఇష్టమైన మువ్వలు గురించి బాల్యం , ఆనందం, ఆకాంక్ష, తెలుగుభాష, చిలక, వర్షం, పడవ వంటి వాటి గురించి భలే భలే గేయాలు ఎంత ముద్దుగా వున్నాయో!! చదివే కొద్ది మళ్లీ మళ్లీ చదవాలనిపిస్తాయి. చదువుతున్నంత సేపు మరో కొత్తలోకంలో తిరుగుతున్నట్టు అనిపిస్తోంది తెలుసా?కాగితం- ఇంగితం అనే గేయం మాత్రం మిగతా గేయాలన్నింటికన్నా చిత్రంగా వుంది తెలుసా? చిన్ని కాగితం మీలాంటి బుజ్జి పాపాయికి ఎలాంటి జ్ఞానోదయం కలిగించిందో తెలుసుకోవాలంటే నేనే చెప్పడం కాదు కానీ మీరు చదివితేనే గమ్మత్తుగా వుంటుంది. అలాగే బాలకృష్ణుని గేయం కూడా సుమా!!ఇంత చక్కని బుల్లిపుస్తకం చదువుతుంటే నిజంగానే వెన్నెల్లో విహరిస్తున్నట్టు హాయిగా వుంటుంది ఇంకెందుకు ఆలస్యం చదివేయండి చకచక.దీనిలో మొత్తం పేజీలు 30. వెల పదిరూపాయలు, బండారు పబ్లికేషన్ వారు ప్రచురించిన ఈ పుస్తకం చిరునామా వురిమిళ్ల సునంద, ఇంటినెంబర్ 11-10-694/5 బుర్హాన్‌పురం, ఖమ్మం 507001 సెల్: 9441815722



పరిచయకర్త: డాక్టర్ అమ్మిన




కైరాఅద్వాని

ముచ్చటగా మూడవ సినిమా


బాలకృష్ణ

హిట్ కాంబినేషన్ మరోసారి రిపీట్ అవుతోంది. ఇది అభిమానులకు శుభవార్త. నందమూరి బాలకృష్ణ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన సినిమాల్లో సింహా, లెజెండ్ కూడా ఉన్నాయి. ఈ రెండు చిత్రాల దర్శకుడు బోయపాటి శీను. లెజెండ్ తర్వాత బోయపాటి చిరంజీవి కంపౌండ్‌కు వెళ్ళారు. సరైనోడు తీసి విజయం సాధించారు. ఇప్పుడు రామ్ చరణ్‌తో సినిమా తీయనున్నారు. బాలకృష్ణ వందవ సినిమాకు బోయపాటి దర్శకత్వం వహిస్తారని ప్రచారం జరిగినా ఆ అవకాశం క్రిష్‌కు దక్కింది.

బాలకృష్ణ ఇమేజ్‌ను మరింత పెంచిన చిత్రాలు సింహా, లెజెండ్. బాలకృష్ణ బాడీలాంగ్వేజ్ తగిన సంభాషణలు అందరికీ ఆకట్టుకున్నాయి. ఈ రెండు చిత్రాల్లో ఆయన ద్విపాత్రాభినయం చేశారు. కమర్షియల్‌గా బిగ్గెస్ట్ హిట్స్‌గా నిలిచాయి. వీరి కాంబినేషన్ మరోసారి కుదిరితే బావుండు అని అభిమానులంతా భావిస్తూ వచ్చారు. ఇప్పుడు అది నిజం కానందని సమాచారం. బోయపాటి శీను చెప్పిన కథని బాలకృష్ణ ఒకే చేశారనే మాట వినిపిస్తోంది. అన్నీ సవ్యంగా కుదిరితే బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా జూన్ 10న సినిమా మొదలవుతుంది. బోయపాటి ప్రస్తుతం రామ్‌చరణ్ సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం జూన్‌లో విడుదలయ్యేలా ప్లాన్ చేశారు.

సైరాలో అమితాబ్ ఎంటర్


చిరంజీవి


మెగాస్టార్ చిరంజీవి కొత్త చిత్రం సైరా నరసింహారెడ్డి ద్వితీయ షెడ్యూల్‌కు వరుసగా అవరోధాలు ఏర్పడుతున్నాయి. హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్ చిత్రీకరణ తర్వాత మరో షెడ్యూల్‌కు మొదలుకావడానికి చాలా విరామం వచ్చింది. ఇప్పటికే మూడు సార్లు వాయిదా వేశారు. తాజాగా ఈ నెల 23న ప్రారంభిస్తారని తెలిసింది. చిరంజీవితో పాటుగా అమితాబ్, నయనతార, జగపతిబాబు, సుదీప్ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. రామ్‌చరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు.

సైరా చారిత్రాత్మక చిత్రం కావడంతో అనేక కసరత్తుల నడుమ స్క్రిప్ట్ ఫైనల్ చేశారు. ముఖ్యంగా చిత్రీకరణ కోసం స్వాతంత్ర్యంకు పూర్వపు నేపథ్యాన్ని క్రియేట్ చేయాలి. ప్రత్యేకంగా సెట్స్ వేయాలి. దీనికోసం భారీ వ్యయం అవుతుంది. అయినప్పటికీ తొలిసారి బయోపిక్ చిత్రంలో నటిస్తున్న చిరంజీవి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తెలుగుతో పాటుగా ఇతర భాషల్లో అనువాదం చేసేందుకు వీలుగా నిర్మిస్తున్నారు.

ఈ నెల 23న మొదలయ్యే కొత్త షెడ్యూల్లో అమితాబ్ బచ్చన్, నయనతార పాల్గొంటారని తెలిసింది. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ చిత్రీకరిస్తారట. ఇవి సినిమాలో కీలక సన్నివేశాలని చిత్రబృందం తెలిపింది. సైరా చిత్రానికి పరుచూరి బ్రదర్స్, సాయి మాధవ్ రచన చేస్తునవారు. ఛాయాగ్రహణం రత్నవేలు అందిస్తున్నారు. నటవర్గంలో విజయ్ సేతుపతి కూడా ఉన్నారు.

రెండో సినిమాకే కోటి!

కొందరు తారలకు తొలి సినిమా విడుదల కాకమునుపే విపరీతమైన క్రేజ్ లభిస్తుంటుంది. దాంతో ఆలస్యం లేకుండానే రెండో సినిమా అవకాశం వెతుక్కుంటూ వచ్చేస్తుంటుంది. దాంతో ఆ తారలు డిమాండ్ చేసినంత పారితోషికాన్ని ఇచ్చేందుకు నిర్మాతలు సై అంటుంటారు. ఇటీవల బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన కైరాఅద్వాని పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీలేదు. ఫగ్లీ అనే చిత్రం ద్వారా మొట్ట మొదటిసారి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ భామ ఆ తర్వాత ఎం.ఎస్.ధోని, మిచిన్ వంటి చిత్రాలలో నటించింది. తాజాగా మహేష్‌బాబు సరసన భరత్ అనే నేను చిత్రం ద్వారా టాలీవుడ్‌లోకి ప్రవేశించిన ఆమెకు ఆ చిత్రం విడుదల కాకమునుపే బోలెడంత క్రేజ్ లభించింది. దాంతో నూతన చిత్రాలలో ఆమెను తీసుకునేందుకు టాలీవుడ్‌కు చెందిన దర్శక, నిర్మాతలు ఆసక్తిని కనబరుస్తున్నారు. టాలీవుడ్‌లో తొలి చిత్రానికి అరకోటి వరకు పారితోషికం తీసుకుంటే...రెండో సినిమాకు రెట్టింపు అంటే కోటి వరకు ఆమె డిమాండ్ చేసినట్లు పరిశ్రమలో వినిపిస్తోంది. రంగస్థలం తర్వాత రామ్‌చరణ్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో కైరాఅద్వాని నాయికగా ఎంపికైంది. ఈ చిత్రం కోసం ఏకంగా డబుల్ పారితోషికాన్ని డిమాండ్ చేయగా, ఆమెకు ఏర్పడిన క్రేజ్ కారణంగానే అంత పారితోషికాన్ని ఇచ్చేందుకు అంగీకరించినట్లు పరిశ్రమలో చెప్పుకుంటున్నారు.


నాగచైతన్య

సవ్యసాచి ఫస్ట్‌పంచ్

నాగచైతన్య నటిస్తున్న తాజా చిత్రం సవ్యసాచి. దీనికి చాందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ విడుదల చేశారు.

నిర్మాతలు వై.నవీన్, వై.రవిశంకర్, మోహన్ మాట్లాడుతూ రెండు చేతులను సమర్థవంతంగా వినియోగించగల సమర్థుడు అర్జునుడు. అతడిని సవ్యసాచి అంటారు. మా సినిమాలో నాగచైతన్య క్యారెక్టరైజేషన్‌లో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. అందుకే సవ్యసాచి అనే పేరు పెట్టాం. ఇందులో చైతన్య మాస్ అప్పీల్ ప్రత్యేక ఆకరణ. నిధి అగర్వాల్ నాయికగా నటిస్తోంది. యాక్షన్, థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో మాధవన్, భూమిక ప్రత్యేక పాత్రధారులు. త్వరలో అమెరికా షెడ్యూల్ జరుపుతాం. జూన్ 14న సినిమాను విడుదల చేస్తాం. కీరవాణి స్వరాలు అందిస్తున్నారు అని చెప్పారు.


ప్రభాస్

ఉత్సాహంగా సాహో షూటింగ్

సాహో చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రభాస్, శ్రద్ధాకపూర్ నాయకానాయికలుగా సుజిత్ (రన్ రాజా రన్ ఫేమ్) దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వి.వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్‌లు నిర్మిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంచిత్రీకరణ ప్రస్తుతం దుబాయ్‌లో జరుగుతున్నట్లు, అక్కడ యాక్షన్ సీన్స్ తీస్తున్నట్లు సమాచారం. కాగా ఈ చిత్రం షూటింగ్ సమయంలో ప్రభాస్, దర్శకుడు సుజిత్‌లకు మధ్య విభేధాలు ఏర్పడ్డాయన్న వదంతులు కొద్దిరోజుల క్రితం హల్‌చల్ చేశాయి. మేకింగ్ విషయంలో ప్రభాస్ సంతృప్తిగా లేకపోవడం వల్లే వారి మధ్య ఈ వివాదం వచ్చిందన్న ఊహాగానాలు వెల్లువెత్తాయి. దీనిపై ఓ అభిమాని సోషల్‌మీడియాలో సుజిత్‌ను ప్రశ్నించగా...అందుకు సుజిత్ స్పందిస్తూ...అలాంటిదేమీ లేదు గురువా. హై కిక్‌తో అత్యంత ఉత్సాహ భరితంగా షూటింగ్ చేస్తున్నాం. మధ్యలో ఇలాంటి వార్తలు మాకు వినోదం అనుకో...అంటూ ట్వీట్ చేశారు. అలాగే మరో అభిమాని ప్రభాస్ ఆరోగ్యం గురించి సుజిత్‌ను ప్రశ్నించగా...ఆయన చాలా ఫిట్‌గా, ఆనందంగా ఉన్నారు. అలాంటి వదంతులను నమ్మొద్దు అంటూ సుజిత్ బదులిచ్చారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ భారీ చిత్రంలో విలన్లుగా జాకీష్రాఫ్, నీల్‌నితిన్ ముఖేష్, చుంకేపాండేలు నటిస్తుండగా, ఇతర ముఖ్యపాత్రలలో తమిళ నటుడు అరుణ్‌విజయ్, మలయాళ నటుడు లాల్ కనిపించనున్నారు. అతిథి పాత్రలో అమీజాక్సన్ మెరవనుంది. బాలీవుడ్ సంగీత త్రయం శంకర్, ఇషాన్, లాయ్‌లు సంగీతాన్ని సమకూరుస్తున్నారు.


సురభి

విజయాలు ఎక్కువ... అవకాశాలు తక్కువ!

తెలుగు సినీరంగంలో హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకోవాలని సురభి ఎప్పట్నుంచో కోరుకుంటోంది. అయితే ఇప్పుడిప్పుడే వరుస విజయాలతో పాటు కాస్త నెమ్మదిగా అయినా అవకాశాలు లభిస్తున్నాయని అంటున్నారు. బీరువా చిత్రం ద్వారా టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ ఢిల్లీ భామ తొలుత తమిళ సినీరంగంలో పాదం మోపింది. ఓ వైపు తమిళ సినిమాల్లో నటిస్తూనే తెలుగు సినిమాలపై కన్నేసింది. బీరువా, ఎక్స్‌ప్రెస్‌రాజా, జెంటిల్‌మెన్, ఇటీవల వచ్చిన ఒక్కక్షణం వంటి సినిమాలు ఆమెకు విజయాలను అందించడంతో పాటు టాలీవుడ్‌లో నిలదొక్కుకునేందుకు ఆమెకు ఆశలను పెంచాయి. ఈ సినిమాలకు మధ్యలో వచ్చిన అటాక్ చిత్రం ఆమెను నిరాశపరిచినప్పటికీ విజయాల శాతం ఎక్కువగా ఉండటం వల్లే ఆమెకు అవకాశాలు రావడానికి కారణమైందని పరిశ్రమలో అంటున్నారు. చూపరులను ఇట్టే ఆకట్టుకునే చక్కటి అందం ఈ భామ సొంతం కావడమే కాదు పాత్రకు తగ్గ అభినయాన్ని ప్రదర్శించడంలో తను చూపుతున్న శ్రద్ధ కూడా పరిశ్రమ ఆమె పేరును పరిశీలించేందుకు దోహదం చేస్తోందని చెబుతున్నారు. ఒక్కక్షణం తర్వాత ఇప్పుడామె నిఖిల్ సరసన ఓ చిత్రంలో నటించబోతున్నట్లు వినిపిస్తోంది. తమిళంలో ఘన విజయం సాధించిన యాక్షన్ థ్రిల్లర్ కనితన్ చిత్రాన్ని తెలుగులో నిఖిల్ కథానాయకుడిగా పునర్నిర్మిస్తున్నారు. కిరాక్‌పార్టీ తర్వాత నిఖిల్ చేసే ఈ చిత్రంలో సురభిని నాయికగా ఎంపిక చేశారని అంటున్నారు. ఇదిలావుండగా...రామ్, దర్శకుడు త్రినాథరావు నక్కిన కలయికలో రూపొందుతున్న హలో గురు ప్రేమకోసమే... చిత్రంలో ఒక కథానాయికగా అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఇంకో కథానాయికగా తొలుత సురభి పేరు, ఆ తర్వాత మేఘ ఆకాష్ పేరు వినిపించింది. కానీ ఆ చిత్రంలో వారిద్దరు చేయడం లేదని తాజా సమాచారం. ఇలా అడపాదడపా అవకాశాలు కాకుండా చేతినిండా చిత్రాలతో టాలీవుడ్‌లో బిజీబిజీగా ఉండాలని సురభి కోరుకుంటోంది.



సిరిమల్లె పువ్వా

షూటింగ్ ప్రారంభం

మమత, నరేంద్ర, షఫీ, ప్రియ ముఖ్యతారాగణంగా రూపొందుతున్న చిత్రం సిరిమల్లె పువ్వా. ఎస్.ఎమ్. క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి గౌతమ్.ఎమ్ దర్శకుడు కౌసర్ జహాన్ నిర్మాత. సందేశాత్మక కథతో తీస్తున్న ఈ చిత్రం షూటింగ్ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులు ఈటెల రాజేందర్ క్లాప్‌తో మొదలైంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమీషన్ అధ్యక్షులు డాక్టర్ వకుళా భరణం, ఇంకా కృష్ణమోహన్‌రావు, సుధాకర్ గోగికర్ తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే మంచి కథ, కథనంతో తీస్తున్నాం. పేరుకు తగినట్టుగానే సిరిమల్లె పువ్వంత స్వచ్ఛంగా మా సినిమా ఉంటుంది అన్నారు. నిర్మాత మాట్లాడుతూ మెసేజ్‌తో పాటుగా కమర్షియల్ అంశాలున్నాయి. మా సంస్థకు మంచి పేరు తెచ్చే చిత్రం అవుతుంది అన్నారు.

ఈ చిత్రానికి ఛాయాగ్రహణం ప్రభాకర్, ఫిరోజ్, సంగీతం రామ్ మోహన్, కథ, దర్శకత్వం గౌతమ్. ఎమ్.